అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

సోమవారం 26-6-2023

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 9 సంచిక : 176 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | www.navatelangana.com | 10 పేజీలు వెల : 6.50

లౌకికవాదం లేకుండా ప్రజాస్వామ్యమే ఉండదు

సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఏచూరి వివరాలు 9లో






సొమ్మొకడిది.. సోకొకడిది

క్రిమినల్స్‌కు మోడీ సర్కార్ ఎర్ర తివాచీ

పేదల సొమ్ముతో పెద్దల రుణాలు మాఫీ.. ఆర్‌బీఐ తాజా ఆదేశాల సారాంశం ఇదే

మీరు బ్యాంకుకు సకాలంలో రుణం చెల్లించకపోతే ఏమవుతుంది? అధికారులు మీ ఇంటి మీద పడతారు. చెంబూ, గ్లాసూ, కంచం, మంచం... ఇలా అన్నీ వీధిలోకి గిరాటేస్తారు. ఇంటికి తాళం వేస్తారు. మిమ్మల్ని రోడ్డున పడేస్తారు. మరి బడా బాబులు రుణం ఎగవేస్తేనో? సాదరపూర్వక స్వాగతం పలికి రాజీ పరిష్కారం చేసుకుంటారు. కొందరి రుణాలు మాఫీ చేస్తారు కూడా. అంటే చిన్న చిన్న మదుపుదారులు దాచుకున్న కష్టార్జితం సొమ్మును బడా బాబుల రుణాల మాఫీకి వినియోగిస్తారు. సొమ్మొకడిది... సోకొకడిది అంటే ఇదే!



న్యూఢిల్లీ : రిజర్వ్‌బ్యాంక్ తాజాగా విడుదల చేసిన సర్క్యులర్ రుణాల ఎగవేతదారులకు వరంగా మారుతోంది. మోసానికి పాల్పడిన ఎగవేతదారులు, కంపెనీలు తాము బకాయి పడిన బ్యాంకులతో, బ్యాంకేతర ఆర్థిక సంస్థలతో రాజీ చేసుకొని సమస్యను పరిష్కరించుకోవచ్చు. లేదా సాంకేతికంగా బకాయిని రద్దు చేయించుకోవచ్చు. ఇదీ ఆ సర్క్యులర్ సారాంశం. బ్యాంకింగ్ నిర్వచనం ప్రకారం తీసుకున్న రుణాలను చెల్లించే స్థోమత ఉన్నప్పటికీ వాటిని ఉద్దేశపూర్వకంగానే నిరాకరించే వారిని ఎగవేతదారులు అంటారు. ఇక తప్పుడు పత్రాలు, సమాచారంతో కావాలనే బ్యాంకులను మోసం చేసి డబ్బును దుర్వినియోగం చేసే వారిని మోసగాళ్లు అంటారు. ఈ రెండూ క్రిమినల్ నేరాలే. అలాంటి నేరాలకు పాల్పడే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలి. కానీ అందుకు బదులుగా వారికి వెసులుబాటు కల్పిస్తూ ఆర్‌బీఐ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. రుణాలు తీసుకున్న వారు మోసానికి పాల్పడినా, ఉద్దేశపూర్వకంగా ఎగవేసినా, అక్రమాలు చేసినా వారిని అనర్హులుగా ...9లో

బోర్డులదే ఇష్టారాజ్యం

2014లో నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి ఇప్పటి వరకూ ప్రభుత్వ రంగ బ్యాంకులకు డైరెక్టర్ల నియామకాలు చేపట్టలేదు. బ్యాంకుల బోర్డుల్ని బీజేపీ మద్దతుదారులతో నింపేశారు. డైరెక్టర్లను నియమించకపోవడాన్ని ఆర్‌బీఐ ఏనాడూ ప్రశ్నించలేదు. ఇలాంటి పరిస్థితులలో రాజీ పరిష్కారాలకు బోర్డులు ఏ విధంగా ఆమోదం తెలుపుతాయో ఎవరైనా ఊహించుకోవచ్చు. అధికారులు, ఉద్యోగుల మాదిరిగా బోర్డు సభ్యులకు ఎలాంటి జవాబుదారీతనం ఉండదు. బ్యాంక్ సంఘాలు, యూనియన్లతో సంబంధం లేకుండా బోర్డు తీసుకునే నిర్ణయాలు సమాచార హక్కు చట్టం కింద కూడా అందుబాటులో ఉండవు.

మోసాలు ఇవే...

ఈ సంవత్సరంలో ఇప్పటి వరకూ 13,530 మోసాలు జరిగాయని బ్యాంకులు ఆర్‌బీఐకి తెలిపాయి. 2021, 2022 సంవత్సరాలలో ప్రభుత్వ రంగ బ్యాంకులను రూ. 97,245 కోట్ల మేర మోసం చేశారు. గత ఐదు సంవత్సరాల కాలంలో ...9లో

చెప్పులు కొందామన్నా... సోంచాయిస్తున్నాం

ఆర్టీసీ కార్మికుల ఆత్మాభిమాన గోస

- నష్టాలంటూ కష్టాల్లోకి నెడుతున్న యాజమాన్యం
- 9 ఏండ్లుగా పెరగని జీతాలు
- కార్మిక సంఘాలు లేవంటూ సర్కారు మొండివైఖరి
- తాడోపేడో అంటూ మరో ఐక్య పోరాటానికి సిద్ధమవుతున్న సంఘాలు



ఎస్ఎస్ఆర్ శాస్త్రి

"ఎవరికి చెప్పుకోవాలన్నా మా బాధ...చెప్పులు కొందామన్నా ఒకటికి రెండుసార్లు సోంచాయిస్తున్నాం. 8 గంటల పనిదినాలు పోయి చాలాకాలం అయ్యింది. ఏ సినిమా ఎంత కలెక్షన్ సాధించింది అన్నట్టే...ఏ ట్రిప్పుకు ఎంత కలెక్షన్ వచ్చిందనే లెక్కలే తప్ప, కాలుతున్న మా డొక్కల్ని యాజమాన్యం పట్టించుకోవట్లేదు. తొమ్మిదేండ్లుగా జీతాలు పెరగలేదు. ఖర్చులు మాత్రం పెరిగాయి. ఉప్పు, పప్పు సహా పిల్లల చదువుల ఫీజులూ పెరిగాయి. 25 ఏండ్లు దాటినా ఇంట్లో ఆడపిల్లలకు పెండ్లిండ్లు చేయలేక మానసికంగా కుంగిపోతున్నాం. పనిలో సుఖం లేదు. ఆఫీసర్ల బెదిరింపులు, ఛీత్కారాలు భరిస్తూ, ఆత్మాభిమానం చంపుకొని బతుకుతున్నాం" ఇది సగటు ఆర్టీసీ కార్మికుడి అరిగోస. వాళ్ల బాధలో వాస్తవం ఉంది. డిమాండ్లలో నిజాయితీ ఉంది. కానీ ఆ రెంటినీ పరిష్కరించాల్సిన ప్రభుత్వం, యాజమాన్యంలో మాత్రం కాఠిన్యం ఉంది. వేదికలపై తాము కార్మికుల పక్షమేనంటూ యాజమాన్యం గప్పాలు కొట్టడమే తప్ప, వారికి ఆర్థికంగా రావల్సిన ఏ ఒక్క ప్రయోజనాన్ని సకాలంలో అందించిన దాఖలా లేదు. 2015లో పెరిగిన 44 శాతం జీతం తప్ప, ఇప్పటి వరకు వాళ్లకు అదనంగా ఇచ్చింది ఏమీ లేదు. 2017, 2021లో జరగాల్సిన వేతన సవరణ ఒప్పందాలు జరగలేదు. ప్రతి ట్రిప్పుకూ ఇంత కలెక్షన్ తేవాలంటూ డిపో మేనేజర్లు నిర్మొహమాటంగా ఎస్ఆర్‌లపైనే రాసిచ్చి, టార్గెట్లు పెడుతున్నారు. ప్రయివేటు వాహనాలకు విచ్చలవిడిగా అనుమతులు ఇచ్చి, ఊబర్, ఓలా వంటి కార్పొరేట్ ఆన్‌లైన్ రవాణా సంస్థల్ని పెంచి పోషిస్తూ, ఆర్టీసీ బస్సుల్లో ఆక్యుపెన్సీ రేషియో (ఓఆర్) రావట్లేదంటే... డ్రైవర్, కండక్టర్లు ఏం చేస్తారు? గతంలో 55 రోజులు సమ్మె చేస్తే, ఉద్యోగాల్లోంచి పీకేస్తామని బెదిరించిన సర్కారు.. వాళ్ల ఉద్యోగాలు వాళ్లకే తిరిగిచ్చి, 'రాచరిక దయ' చూపిన ...9లో

నేటి నుంచి రైతుబంధు జమ

- 70 లక్షల మంది రైతు ఖాతాల్లోకి పైసలు
- కొత్తగా ఐదు లక్షల మంది లబ్దిదారుల
- నాలుగు లక్షల ఎకరాల పోడు రైతులకు కూడా... : మంత్రి నిరంజన్‌రెడ్డి వెల్లడి



వివరాలు 2లో


నేడు, రేపు వర్షాలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణ మీదుగా నైరుతి రుతుపవనాలు చురుగ్గా కొనసాగుతున్నాయి. దీని ప్రభావం వల్ల రాష్ట్రంలో వచ్చే రెండు, మూడు రోజుల పాటు మోస్తరు, అక్కడక్కడా భారీ వర్షాలు పడే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. పలు జిల్లాలకు ...9లో



మహారాష్ట్రలో సీఎం కేసీఆర్ రెండ్రోజుల పర్యటన



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

భారత రాష్ట్ర సమితి అధినేత, ముఖ్యమంత్రి కే చంద్రశేఖరరావు రెండ్రోజులు మహారాష్ట్రలో పర్యటించనున్నారు. సోమ, మంగళవారాల్లో ఆయన ఆ రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో బీఆర్ఎస్ కార్యక్రమాల్లో ...2లో

పాఠ్యాంశాల నుంచి నెహ్రూ మాయం

- రాజేంద్ర ప్రసాద్, రాధాకృష్ణన్ కూడా
- ఉత్తరప్రదేశ్ సెకండరీ బోర్డు నిర్వాకం



ప్రయాగరాజ్ : భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ, తొలి రాష్ట్రపతి బాబూ రాజేంద్ర ప్రసాద్, రెండవ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ స్వాతంత్ర్య సమరయోధులు కారట. వారు దేశ స్వాతంత్ర్యం కోసం తమ జీవితాలను త్యాగం చేయలేదట. అందుకే ...9లో

బీజేపీ-బీఆర్ఎస్‌ది ఫెవికాల్ బంధం

కుర్చీ కదులుతుందనే ఢిల్లీలో ప్రదక్షిణలు

- మంత్రి కేటీఆర్‌పై రేవంత్ విమర్శ



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలది తెగిపోయే బంధం కాదనీ, అది ఫెవికాల్ బంధమని టీపీసీసీ అధ్యక్షులు, ఎంపీ ఎనుముల రేవంత్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ నేతలు ఎంత కంఠశోష పెట్టుకున్నా వారి మాట ఎవరూ నమ్మరని చెప్పారు. రాష్ట్రంలో సీఎం కుర్చీ కదులుతుందనే మంత్రి కేటీఆర్ ఢిల్లీలో ప్రదక్షిణలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. తెలంగాణకు పట్టిన చీడ వదలాలంటే ఏకైక ప్రత్యామ్నాయం కాంగ్రెస్ పార్టీయేనన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మహేశ్వరం నియోజకవర్గానికి చెందిన కొంత మంది నేతలు కాంగ్రెస్‌లో చేరారు. రేవంత్ వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ పాలన నుంచి తెలంగాణ రాష్ట్రానికి కాంగ్రెస్ పార్టీ విముక్తి కల్పిస్తున్నందని భరోసా ఇచ్చారు. ఢిల్లీ బీజేపీ నేతలు, కేసీఆర్ ఒక్కటేనన్నారు. తెలంగాణ రాష్ట్రానికి రోడ్లు అమ్ముకునే పరిస్థితి తీసుకొచ్చారని ...2లో

నడ్డా ఇక్కడ.. ఈటల అక్కడ!

- ఢిల్లీలోనే రాజేందర్, రాజగోపాల్‌రెడ్డి
- ముఖ్యనేతలతో సమావేశం కోసమా? ఇంకేమైనానా..

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బీజేపీ జాతీయ అధ్యక్షులు జయత్ ప్రకాశ్ నడ్డా రాష్ట్ర పర్యటనకొచ్చారు. ఆ పార్టీ చేరికల కమిటీ చైర్మెన్ ఈటల రాజేందర్, మాజీ ఎంపీ రాజగోపాల్‌రెడ్డి మాత్రం ఢిల్లీలోనే ఉండిపోయారు. జాతీయ పార్టీ అధ్యక్షులు రాష్ట్రానికి వస్తున్నారంటే ఎంత పనున్నా నేతలు వారి వెంట ఉండేందుకో, సభలో పాల్గొనేందుకో ఆసక్తి చూపుతారు. సోమ, మంగళవారాల్లో అమిత్‌షాతో భేటీ ఉందనుకున్నా ఢిల్లీ నుంచి వచ్చి సభలో పాల్గొని పోవడం ఈటలకు అసాధ్యమేమీ కాదు. ఆయన వచ్చి ఉంటే నేతల మధ్య అధిష్టానం సయోధ్య కుదిర్చింది...పార్టీలో నేతలు ఐక్యంగా ఉన్నారు అనే భావన కాస్తయినా ఆ పార్టీ శ్రేణుల్లోకి వెళ్లేది. కానీ, అలా జరగలేదు. 'పార్టీ మారేటోళ్లను మేం ఆపబోం' అని బండి అంటే...ఈటల రాజేందర్, రాజగోపాల్‌రెడ్డిలు 'మొహమాటాలు లేవు. మేం చెప్పాల్సిందంతా అధిష్టానానికి చెబుతాం. రాష్ట్రంలో ఎలాగైతే ముందుకెళ్తామనే విషయంలో మా



అభిప్రాయాన్ని స్పష్టంగా చెబుతాం' అని చెప్పారు. పార్టీలో బేదాభిప్రాయాలను పక్కనబెట్టి ముందుకెళ్తామని చెప్పకుండా.. ఎవరికి వారు "మేం" అని పేర్కొనడమే వారి మధ్య ఉన్న ...2లో

పేదరికం నిర్మూలనే మోడీ లక్ష్యం

- బీజేపీ జాతీయ అధ్యక్షులు జేపీ నడ్డా

వివరాలు 2లో



రష్యాలో తేలిపోయిన తిరుగుబాటు

గంటల వ్యవధిలోనే పరార్ | బెలారుస్‌లో ఆశ్రయం పొందిన ప్రిగోజిన్

నెల్లూరు నరసింహారావు

యూజెనీ ప్రిగోజిన్..."వ్యాగ్నర్" అనే ఒక రష్యన్ కిరాయి సైన్యానికి అధిపతి. ఈ కిరాయి సైన్యం ఉక్రెయిన్ యుద్ధంలో రష్యా తరపున ప్రముఖంగా పాల్గొంటోంది. అలాంటిది శుక్రవారం సాయంత్రం రష్యా పైనే తన సాయుధ తిరుగుబాటును ప్రకటించింది. ప్రిగోజిన్ కేవలం 30 నిమిషాల వీడియోని విడుదల చేయటం ద్వారా ఈ తిరుగుబాటును ప్రకటించాడు. ఈ వీడియోలో రష్యన్ సైనిక నాయకత్వానికి వ్యతిరేకంగా తీవ్రమైన విమర్శలు చేయటమే కాకుండా రష్యన్ పాలక వర్గంలోని నాటో అనుకూల గ్రూపు మద్దతును కోరుతున్నట్టు చెప్పాడు. ఇలా శుక్రవారం సాయంత్రం మొదలైన సైనిక తిరుగుబాటు శనివారం సాయంత్రంకల్లా అంతం అయింది. బెలారుస్ అధ్యక్షుడు, అలెగ్జాండర్ లుకాషెంకో మధ్యవర్తిత్వంతో కుదిరిన ఒప్పందం ప్రకారం ప్రిగోజిన్ రష్యాను వదిలి బెలారుస్ లో ఆశ్రయం పొందాడు. రష్యన్ రహస్య సర్వీస్(ఎఫ్ఎస్‌బీ) ప్రిగోజిన్ తిరుగుబాటుపైన మొదలెట్టిన విచారణను నిలిపివేసింది.

శనివారం ఉదయం రష్యా అధ్యక్షుడు వ్లాడీమీర్ పుతిన్ టెలివిజన్ లో ప్రసంగిస్తూ ప్రిగోజిన్ నాటో కుట్రలో భాగంగా వ్యవరిస్తున్నాడని అన్నాడు. "నేడు రష్యా తన భవిత కోసం నియో నాజీలు, వారి మద్దతుదార్లతో భయంకరమైన పోరాటం చేస్తున్నది. పశ్చిమ దేశాల యావత్ సైన్యం, ఆర్థిక, సమాచార యంత్రాంగం అంతా మనకు వ్యతిరేకంగా సమీకరించబడ్డాయి" అని పుతిన్ పేర్కొన్నాడు. శనివారం సాయంత్రంకల్లా తాము ఆక్రమించిన రోస్తోవ్-ఆన్-డోన్ సైనిక కేంద్ర కార్యాలయాన్ని వ్యాగ్నర్ సైన్యం వీడనున్నదని ప్రిగోజిన్ ప్రకటించాడు.

తిరుగుబాటుకు కారణాలు

ప్రిగోజిన్ అసలు తిరుగుబాటు ఎందుకు చేశాడు?అనే ప్రశ్నకు సమాధానాన్ని వెతుకుదాం. మొదటి కారణమేమంటే.. రష్యా ప్రభుత్వ, సైనిక యంత్రాంగంతో ఆయన పడుతున్న ఘర్షణ పతాక స్థాయికి చేరుకుంది. తిరుగుబాటు ప్రారంభానికి ముందు యుద్ధాన్ని తగినంత తీవ్ర స్థాయిలో నడపటం లేదని ఆయన రష్యా ...2లో

పేదల సోయిలేని ప్రభుత్వాలు

ప్రత్యేక రాష్ట్రంలోనూ సమస్యలతో సామాన్యుల సహవాసం

- రూ.467 కోట్ల ప్రభుత్వ సొమ్ముతో ఢిల్లీలో మోడీకి ఇల్లు కడుతుండ్రు
- ఏ ప్రధానికీ లేని హంగు ఆర్భాటాలు మోడీకి ఎందుకు?: పాలకుల తీరుపై ధ్వజమెత్తిన ప్రజాసంఘాల పోరాట వేదిక బృందం



నవతెలంగాణ-మెదక్

ప్రభుత్వాలు మారినా, పాలకులు మారినా పేదల బతుకులు మాత్రం మారడం లేదని, పేదల బతుకులను మార్చి వారిని ఆదుకుందామన్న సోయి కూడా ఈ ప్రభుత్వాలకు లేదని తెలంగాణ ప్రజా సంఘాల ఐక్య పోరాట వేదిక కన్వీనర్ ఎస్.వీరయ్య అన్నారు. మెదక్ జిల్లా కేంద్రంలోని 248/1 సర్వే నంబర్‌లో పేదలు వేసుకున్న గుడిసెల కేంద్రాన్ని ప్రజా సంఘాల పోరాట వేదిక బస్సు యాత్ర బృందం సభ్యులు ఆదివారం సందర్శించారు. గుడిసెల్లో నివసిస్తున్న పేదల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్.వీరయ్య మాట్లాడుతూ.. తెలంగాణ వస్తే అన్ని వస్తాయనుకున్నామని, రాష్ట్రం సిద్ధించి పదో ఏట అడుగుపెట్టడంతో ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాలు జరిపి సంబురాలు చేసుకుంటోందని, పేదలకు మాత్రం ఎలాంటి లబ్ధి చేకూర్చడం లేదని విమర్శించారు. పేద ఆడ బిడ్డలకు గూడు కల్పించాలన్న సోయి కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు లేకుండా పోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తిండి లేకుంటే బతకొచ్చు.. చాటు లేకుండా ఎట్లా బతికేదని ప్రశ్నించారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పెట్టినా, ఇప్పటికీ ఎవరికి గూడు ఇచ్చిన పరిస్థితులు లేవన్నారు. ఢిల్లీలో ప్రధాని మోడీకి ప్రభుత్వ సొమ్ము రూ.467 కోట్లతో ఇల్లు కడుతున్నారని, ఇంత హంగు ఆర్భాటాలు ఎందుకని ప్రశ్నించారు. పూర్వం జమీందారుల ఇండ్లు సైతం ఇలా లేవని ...9లో

నవతెలంగాణ

నడ్డా ఇక్కడ.. ఈటల అక్కడ!

(మొదటిపేజీ తరువాయి)

అంతర్గత విబేధాలను ఎత్తిచూపుతున్నది. రెండు రోజులుగా జరుగుతున్న ప్రెస్‌మీట్ల సారాంశాన్ని చూస్తే బీజేపీ తెలంగాణ శాఖలో ఏదో జరగరానిది జరుగుతుందనే సంకేతాలు కనిపిస్తున్నాయి. ఈటల, కోమటిరెడ్డిలిద్దరూ ముఖ్య నేతలతో సమావేశం కోసమే ఆగియాపోయారా? కావాలనే దుమ్మా కొట్టారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పుడు రాజకీయంగా ఇదే చర్చనీయాంశం అవుతున్నది. ఇప్పటికే వారిద్దరూ రాష్ట్ర బీజేపీలో చేయాల్సిన మార్పుల విషయంపై అధిష్టానం వద్ద కుండ బద్దలు కొట్టి చెప్పినట్టు ప్రచారం సాగుతున్నది. మద్యం కుంభ కోణం విషయంలో కవితను అరెస్టు చేయకపోవడం వల్ల బీజేపీ-బీఆర్ఎస్ లాలూచీ పడ్డాయని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో అధిష్టానం ఇంకా స్తబ్దుగా ఉండటం సబబు కాదనీ, ఇలాగైతే తెలంగాణలో పార్టీ ముందుకెళ్లడం కష్టమని వారు స్పష్టం చేసినట్టు తెలిసింది. అయితే, జేపీ నడ్డాతో జరిగిన సమావేశంలో వారికి ఏ విషయంపైనా స్పష్టమైన హామీ రాలేదనీ, ఈ నేపథ్యంలో బీజేపీలో నెంబర్ 2 నేతగా చలామణీ అవుతున్న కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షాతో పాటు, మరికొందరు నేతలతో సమావేశం అయ్యేందుకే వారు ఢిల్లీలో ఉన్నారని బీజేపీ శ్రేణులు చెబుతున్నాయి. మరోవైపు బీఆర్ఎస్ బహిష్కృత నేతలు పొంగులేటి, జూపల్లిలతో కలిసి టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి రాహుల్‌గాంధీతో సోమవారం ఢిల్లీలో సమావేశం కానున్నారు. అలాగే ఈ నేతలిద్దరితోనూ ఢిల్లీలో రేవంత్‌రెడ్డి, పొంగులేటి, జూపల్లి రహస్య సమావేశం జరుపబోతున్నట్టు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నది. వారిద్దరూ బీజేపీని వీడనున్నారనే ప్రచారమే జోరుగా సాగుతున్నది. బీజేపీ జాతీయ అధ్యక్షులు నడ్డాతో జరిగిన సమావేశంలో వారిద్దరికీ అధిష్టానం నుంచి స్పష్టత రాకపోవడంతో విసుగుచెందినట్టు తెలుస్తున్నది. కాంగ్రెస్ పార్టీతో ఈటల మూడు సీట్ల కోసం, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తనకు ఎంపీ, భార్య లేదా కొడుక్కి మునుగోడు సీటు కోసం బేరసారాలు జరుపుతున్నట్టు కాంగ్రెస్ శ్రేణుల్లో చర్చ జరుగుతున్నది. కాంగ్రెస్‌లో చేరికను వారిద్దరూ ఖండిస్తున్నప్పటికీ..."లోగుట్టు పెరుమాండ్లకే ఎరుక అన్నట్టు"గా వారి మనస్సులో ఏమున్నదనేది కొద్దిరోజుల్లోనే తేలిపోనున్నది.

మహారాష్ట్రలో సీఎం కేసీఆర్ రెండ్రోజుల పర్యటన

(మొదటిపేజీ తరువాయి)


పాల్గొంటారు. పండరీపూర్, తుల్జాపూర్ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. షోలాపూర్‌లో పార్టీ కార్యక్రమంలో పాల్గొంటారు. ఆయన వెంట పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వెళ్లనున్నారు. సోమవారం ఉదయం 10 గంటలకు రోడ్డు మార్గాన హైదరాబాద్ నుంచి మహారాష్ట్రకు వెళ్తారు. సాయంత్రానికి షోలాపూర్ చేరుకుని అక్కడే బస చేస్తారు. ఈ సందర్భంగా షోలాపూర్‌కు చెందిన భగీరథ్ బాల్కే సహా పలువు రు నేతలు కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరనున్నారు. అలాగే సీఎం కేసీఆర్ అక్కడి చేనేత కార్మికుల కుటుంబాలను కూడా కలుస్తారని పార్టీ వర్గా లు తెలిపాయి. మంగళవారం ఉదయం పండరీపూర్‌కు చేరుకొని అక్కడి విఠో భారుక్మిణి మందిర్‌లో ప్రత్యేక పూజలు చేస్తారు. దారాశివ్ జిల్లాలోని శక్తిపీఠ మైన తుల్జాభవానీ అమ్మవారిని దర్శించుకుంటారు.. అక్కడి నుంచి మళ్లీ రోడ్డు మార్గంలో హైదరాబాద్‌కు తిరిగి వస్తారని పార్టీ వర్గాలు తెలిపాయి.

కారెక్కిన ఎన్సీపీ నేత ఆరిఫ్ అజ్మీ

మహారాష్ట నుంచి బీఆర్ఎస్‌లో చేరికలు కొనసాగుతున్నాయి. భీవండి నుంచి ఎన్సీపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన పలువురు నేతలు బీఆర్ఎస్ అధ్యక్షులు, సీఎం కేసీఆర్ సమక్షంలో పార్టీలో చేరారు. ఆదివారం ప్రగతిభవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సీఎం కేసీఆర్ వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎన్సీపీ మైనార్టీ విభాగం జాతీయ కార్యదర్శి ఆరిఫ్ అజ్మీ, ఫజిల్ అన్సారీ, భీవండి కాంగ్రెస్ నేత, సామాజిక కార్యకర్త ఇర్ఫాన్ మోమిన్, కాంగ్రెస్ నేత, ఎన్జీవో సీనియర్ నేత అర్షత్ షేక్, ఎన్సీపీ థానే జిల్లా ఉపాధ్యక్షులు మక్సూద్‌ఖాన్ తదితరులు చేరారు. ఎమ్మెల్యే ఏ. జీవన్‌రెడ్డి, మహారాష్ట బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పేదరికం నిర్మూలనే మోడీ లక్ష్యం

- బీజేపీ జాతీయ అధ్యక్షులు జేపీ నడ్డా



నవతెలంగాణ- కందనూలు

నరేంద్ర మోడీ ప్రభుత్వం పేదరికం నిర్మూలన కోసం పనిచేస్తుందని బీజేపీ జాతీయ అధ్యక్షులు జే పి నడ్డా తెలిపారు. నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో నవ సంకల్ప సభ ఆదివారం సాయంత్రం జిల్లా పరిషత్ హై స్కూల్ గ్రౌండ్‌లో నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన జేపీ నడ్డా మాట్లాడుతూ.. అమరుల త్యాగాల ఫలితంగా వచ్చిన తెలంగాణలో ఒక్క కేసీఆర్ కుటుంబమే బాగుపడిందని, ప్రజల బతుకుల్లో ఎలాంటి మార్పులేదని విమర్శించారు. అంధకారంలోఉన్న తెలంగాణ అభివృద్ధి కావాలంటే రాష్ట్రంలో కమలం వికసించాలన్నారు. ఏ దేశం పోయినా మోడీని హీరో అంటూ.. గ్లోబల్ లీడర్ అంటూ పొగుడుతున్నారని, కాంగ్రెస్ నాయకులు మాత్రం చాయ్‌వాలా అంటూ విమర్శిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. భారత్‌లోనే ఏ ప్రధాని పొందని మన్ననలను ప్రపంచంలో మోడీ పొందారని తెలిపారు. సభలో బీజేపీ రాష్ట్ర ప్రతినిధులు, వివిధ మండలాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సీనియర్ జర్నలిస్ట్ అంబటి ఆంజనేయులు మృతి



(ఫైల్)

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

జర్నలిస్టు ఉద్యమనేత, ఐజేయూ స్టీరింగ్ కమిటీ సభ్యులు, ఏపీయూడబ్ల్యూజే గౌరవ సలహాదారులు అంబటి ఆంజనేయులు (78) ఆదివారం రాత్రి మరణించారు. హృద్రోగ సమస్యతో బాధపడుతున్న ఆయన మూడు రోజుల క్రితం విజయవాడలోని ఒక ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఏపీయూడబ్ల్యూజే అధ్యక్షుడిగా, ప్రధాన కార్యదర్శిగా సుదీర్ఘకాలం సేవలు అందించారు. ప్రస్తుతం ఇండియన్ జర్నలిస్టు యూనియన్ స్టీరింగ్ కమిటీ సభ్యుడిగా ఉన్నారు. ఆంధ్రప్రభ, ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో ప్లాంట్ లెవల్ యూనియన్ అభివద్ధికి కృషి చేశారు. ఆంధ్రప్రదేశ్ న్యూస్ పేపర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (ఏపీఎన్ఈఎఫ్) అధ్యక్షులుగా పనిచేశారు. అంబటి ఆంజనేయులు మృతికి తెలంగాణ ఫోటో జర్నలిస్ట్ అసోసియేషన్ (టీఎస్‌పీజేఏ) అధ్యక్షులు గంగాధర్, ప్రధాన కార్యదర్శి కేఎన్ హరి, రామ్మూర్తి, అనిల్ కుమార్, గాంధీ, రవికాంత్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్ ఫోటో జర్నలిస్ట్ అసోసియేషన్ (ఏపీపీజేఏ) అధ్యక్షులు ఎన్ సాంబశివరావు, సీనియర్ ఫోటోగ్రాఫర్లు సీహెచ్ విజయ భాస్కర్, ఆనంద్, రూబిన్, జీవీ నారాయణ, మరిడయ్య, మహేష్, రాము, టీవీ రమణ, సుమన్‌రెడ్డి తదితరులు ప్రగాఢ సంతాపం తెలిపారు.

నల్లేరుపై నడక కాదు!

అంతర్గత కుమ్ములాటలతో బీజేపీ సతమతం

అగ్నిపరీక్షగా మారిన అసెంబ్లీ ఎన్నికలు




వచ్చే సంవత్సరం జరగబోయే లోక్‌సభ ఎన్నికలకు సెమీఫైనల్స్‌గా భావిస్తున్న ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు బీజేపీకి అగ్నిపరీక్షగా మారబోతున్నాయి. ఆ రాష్ట్రాలలో విజయం నల్లేరుపై నడక కాదని తేలిపోయింది. కర్నాటక ఎన్నికలలో కాంగ్రెస్ చేతిలో పరాభవాన్ని చవిచూసిన తర్వాత ఆ పార్టీని సంక్షోభాలు ఒక దాని వెంట ఒకటిగా వెంటాడుతున్నాయి. బాలాసోర్ రైలు ప్రమాదం, కోవిన్ సమాచారం లీకేజీ ఉదంతాలు బీజేపీ ప్రతిష్టను మసకబార్చాయి. రెండు వేల రూపాయల నోట్ల ఉపసంహరణ, అంతర్జాతీయ క్రెడిట్ కార్డు లావాదేవీలపై పన్ను విధింపు వంటి నిర్ణయాలతో పార్టీ వ్యతిరేకతను మూటకట్టుకుంటోంది.దీనిని గ్రహించిన బీజేపీ అధిష్టానం నష్టనివారణ చర్యలు చేపట్టినప్పటికీ వివిధ రాష్ట్రాలలో కొనసాగుతున్న అంతర్గత కుమ్ములాటలు పార్టీని చీకాకు పరుస్తున్నాయి. మరోవైపు మహిళా మల్లయోధుల నిరసన కూడా ఆ పార్టీకి అప్రదిష్ట తెచ్చిపెట్టింది.

న్యూఢిల్లీ :2014లో తొలిసారి అధికారంలోకి వచ్చిన నరేంద్ర మోడీ ప్రభుత్వం తన ఐదేళ్ల పదవీకాలాన్ని పెద్దగా కుదుపులు లేకుండానే పూర్తి చేసుకుంది. కానీ 2019లో రెండోసారి బాధ్యతలు చేపట్టిన తర్వాత అనేక సమస్యలు చుట్టుముట్టాయి. ముఖ్యంగా అసెంబ్లీ ఎన్నికలు జరిగే మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్ఘర్ రాష్ట్రాలలో సంస్థాగత సమస్యలతో పాటు ముఠా కుమ్ములాటలు కూడా బీజేపీని కలవరపరుస్తున్నాయి.

మధ్యప్రదేశ్‌లో నాయకత్వ పోరు

మధ్యప్రదేశ్‌లో 2005 నుండి అధికారంలో ఉన్న శివరాజ్ సింగ్ చౌహాన్ ప్రభుత్వం ప్రభుత్వ వ్యతిరేకతను ఎదుర్కొంటోంది. మోడీకి వ్యతిరేకిగా ముద్ర పడినప్పటికీ బీజేపీ కేంద్ర నాయకత్వం మరోసారి చౌహాన్ నాయకత్వంలోనే ఎన్నికలకు వెళ్లాలని నిర్ణయించింది. అయితే పార్టీలో అంతర్గత విభేదాలు తారాస్థాయికి చేరుకున్నాయి. 2018 ఎన్నికలలో పార్టీ పరాజయం పాలైనప్పటికీ కాంగ్రెస్‌కు చెందిన జ్యోతిరాదిత్య సింథియా నేతృత్వంలో 23 మంది ఎమ్మెల్యేలు బీజేపీ గూటికి చేరడంతో ఫిరాయింపుల ద్వారా ఆ పార్టీ అధికారాన్ని చేపట్టింది. అయితే ఇప్పుడు ఆ ఎమ్మెల్యేలే బీజేపీకి తలనెప్పిగా మారారు. పార్టీలో చేరిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎప్పటి నుండో కొనసాగుతున్న బీజేపీ విధేయుల మధ్య అసెంబ్లీ టిక్కెట్ల కోసం పోటీ నడుస్తోంది. ఒకవేళ కాంగ్రెస్ నుండి ఫిరాయించిన వారికి సీట్లు ఇస్తే విధేయుల నుండి తిరుగుబాటు తప్పకపోవచ్చు. మరోవైపు సింధియా కూడా చౌహాన్‌కు సవాలు విసురుతున్నారు. దీనికితోడు చౌహాన్ ఇప్పటికే పార్టీలో అసమ్మతిని ఎదుర్కొంటున్నారు. నేతలు ఒకరిపై ఒకరు కత్తులు నూరుకుంటూ పార్టీ పరువును బజారున పడేస్తున్నారు. బీజేపీ ఎమ్మెల్యేలు కూడా తమ తమ నియోజకవర్గాలలో ప్రజాగ్రహాన్ని ఎదుర్కోవాల్సి వస్తోంది. తమను పార్టీ నాయకత్వం పట్టించుకోవడం లేదని వారు ఆక్రోశం వెళ్లగక్కుతున్నారు. గత రెండు నెలల కాలంలో పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. సింథియాకు ప్రాధాన్యత ఇవ్వడాన్ని వారు జీర్ణించుకోలేకపోతున్నారు. వీరి నిష్క్రమణతో దళితులు, ఆదివాసీల ప్రాబల్యం ఎక్కువగా ఉన్న స్థానాలలో పార్టీ దెబ్బతినే ప్రమాదం ఉంది.



ఛత్తీస్‌గడ్‌లో పారని పాచిక

ఛత్తీస్‌గడ్‌లో కాంగ్రెస్ ముఖ్యమంత్రి భూపేష్ బాఘెల్ ప్రభావం ఎక్కువగా ఉంది. మాజీ ముఖ్యమంత్రి రామన్ సింగ్ మినహా చాలా మంది బీజేపీ నేతలు ఇప్పుడు రాజకీయ చిత్రం నుండి కనుమరుగయ్యారు. రాష్ట్రంలోని వివిధ సామాజిక వర్గాలను సమీకరించడంలో బాఘెల్ విజయం సాధించారు. మత విద్వేషాలు రెచ్చగొట్టి ఓట్లు దండుకుందామనుకుంటున్న బీజేపీ పాచిక పారడం లేదు. బీజేపీ నుండి కాంగ్రెస్‌లోకి ఫిరాయింపులు కూడా జరుగుతున్నాయి.







రాజస్థాన్‌లో లోపించిన ఐక్యత

రాజస్థాన్‌లో పార్టీ ప్రచార సారథి ఎవరో బీజేపీ నాయకత్వం నిర్ణయించుకోలేకపో తోంది. వసుంధర రాజె నాయకత్వాన్ని మోడీ-షా ద్వయం వ్యతిరేకిస్తున్నప్పటికీ మరో సమర్ధ నాయకుడిని ఎంపిక చేసుకోలేక సతమతమవుతోంది. పార్టీ టికెట్లు ఆశిస్తున్న వారు, మెజారిటీ బీజేపీ ఎమ్మెల్యేలు కూడా వసుంధర నాయకత్వాన్నే సమర్ధిస్తున్నారు. పార్టీలో ఐక్యత లేకపోవడం బీజేపీ నాయకత్వాన్ని కలవరపెడుతోంది. కాంగ్రెస్‌లో అశోక్ గెహ్లాట్, సచిన్ పైలట్ మధ్య కొనసాగుతున్న విభేదాలను సైతం సొమ్ము చేసుకునే పరిస్థితి కానరావడం లేదు. వసుంధర స్థానంలో పలువురు నేతల పేర్లు తెరపైకి వస్తున్నప్పటికీ కేంద్ర నాయకత్వం ఎటూ తేల్చుకోలేకపోతోంది.

ఇతర రాష్ట్రాలలోనూ...

ఎన్నికలు జరిగే రాష్ట్రాలలో పరిస్థితి ఇలా ఉంటే అధికారంలో ఉన్న రాష్ట్రాలలో సైతం ఆశాజనకంగా లేదు. మణిపూర్‌లో పార్టీకి అండగా ఉంటున్న మైతీలు, కుకీల మధ్య ఘర్షణలు జరుగుతున్నాయి. బీజేపీలోని కుకీ ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రి బీరేన్ సింగ్‌పై బాహాటంగానే గళం విప్పుతున్నారు. వీరంతా ఢిల్లీలో మకాం వేసి తమ ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. ఘర్షణల నేపథ్యంలో రాష్ట్రంలో కాంగ్రెస్‌కు మద్దతు పెరుగుతోంది. త్రిపురలో మాజీ ముఖ్యమంత్రి విప్లవ్ కుమార్ దేవ్, ప్రస్తుత ముఖ్యమంత్రి మాణిక్ సాహాలకు ఏ మాత్రం పొసగడం లేదు. వాస్తవానికి దేవ్ మద్దతుతోనే సాహా కాంగ్రెస్‌ను వీడి బీజేపీలో చేరారు. దేవ్‌ను పదవి నుండి తప్పించేంత వరకూ సాహా ఆయనకు విధేయుడిగానే ఉన్నారు. సాహాను ముఖ్యమంత్రిగా ఎంపిక చేయడంతో ఇప్పుడు ఇరువురి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటోంది. ఎమ్మెల్యేలు కూడా ఇద్దరు నేతల మధ్య చీలిపోయారు. జమ్మూకాశ్మీర్‌లో ఎన్నికలు నిర్వహించేందుకు బీజేపీ నాయకత్వం విముఖంగా ఉంది. లెఫ్టినెంట్ గవర్నర్ పాలనలో మితిమీరిన అవినీతి ఆ పార్టీ అవకాశాలను దెబ్బతీస్తోంది. ఎన్నికలు జరిగే రాష్ట్రాలలోనే కాకుండా తాను అధికారంలో ఉన్న రాష్ట్రాలలో సైతం పరిస్థితి ఆశాజనకంగా లేకపోవడంతో బీజేపీ కేంద్ర నాయకత్వం ఇప్పుడు కొత్త మిత్రుల కోసం వెతుకుతోంది. ఒకప్పటి ఎన్డీఏ భాగస్వామ్యపక్షాలైన అకాలీదళ్, తెలుగుదేశం, జనతాదళ్ (సెక్యులర్)తో మంతనాలు జరుపుతోంది.

భారతీయ రైతులకు విదేశీ మార్కెట్లతో అనుసంధానం

వాల్‌మార్ట్ సరికొత్త వ్యూహం

- వారి రిటైల్ సామ్రాజ్య విస్తరణకే : రైతు సంఘ నేతలు

గ్లోబల్ రిటైలింగ్ దిగ్గజం వాల్‌మార్ట్ ఎనిమిది లక్షల మంది భారతీయ రైతులను నేరుగా విదేశీ మార్కెట్లకు అనుసంధానం చేస్తానంటూ ఓ సరికొత్త పథకాన్ని రంగం మీదికి తెచ్చింది. తొమ్మిది రాష్ట్రాలు, 500కి పైగా రైతు ఉత్పత్తిదారుల సంస్థల (ఎఫ్‌పిఓ) నెట్‌వర్క్‌ను సష్టించి, వారికి విదేశీ మార్కెట్‌లో వ్యాపారం చేసేందుకు అవకాశం కల్పిస్తామని చెబుతోంది. ఇది వాల్‌మార్ట్ వ్యాపారాభివృద్ధి కోసమేననీ, ఇటువంటి వాటివల్ల ప్రభుత్వ వ్యవసాయ మార్కెటింగ్ వ్యవస్థ, ఇప్పటికే వివిధ ప్రాంతాల్లో పని చేస్తున్న రైతు సహకార సంఘాలు, దెబ్బ తింటాయని రైతు నేతలు భయ సందేహాలు వ్యక్తం చేస్తున్నారు.

న్యూఢిల్లీ :30 దేశాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న టెక్నోసర్వ్ అనే స్వచ్ఛంద సంస్థ ఆరేళ్ల క్రితం ఆంధ్రప్రదేశ్‌లోని అరకులోయలో కాఫీ రైతులతో తన అనుబంధాన్ని ప్రారంభించింది. వారిలో కొంతమందితో ఎఫ్‌పిఓ ఏర్పాటు చేసి నిర్వహణకు సహాయపడింది. అటువంటి ఎనిమిది ఎఫ్‌పిఓలు టెక్నోసర్వ్ ద్వారా పని చేస్తున్నాయని వాల్‌మార్ట్ సంస్థ పేర్కొంది. అదేవిధంగా రాష్ట్రంలో జీడి రైతుల మధ్య పనిచేసే మరొక సంస్థ డిజిటల్ గ్రీన్, సమిష్టి విధానం వల్ల జీడిపప్పు ధరలు 13 శాతం పెరిగాయని ఆ సంస్థ ప్రతినిధి జూలీ గెహ్రీకా చెప్పారు. ప్రొఫెషనల్ అసిస్టెన్స్ ఫర్ డెవలప్‌మెంట్ యాక్షన్, ఎఫ్‌పిఓలను ప్రోత్సహించడానికి మహిళా రైతుల మధ్య పని చేస్తోందని తెలిపారు. ఈ మూడింటి పరిధిలోని ఎఫ్‌పిఓలతో వాల్‌మార్ట్ ఫౌండేషన్ ద్వారా నిధులు సమకూరుస్తుంది. ఇప్పుడు వాటిని సమన్వయం చేసి నేరుగా రిటైల్ మార్కెట్‌తో అనుసంధానించే నెట్‌వర్క్‌ను వాల్‌మార్ట్ రూపొందించింది. తద్వారా తన రిటైల్ సామ్రాజ్యాన్ని విస్తరించుకుంటుంది.

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, ఒడిశా, ఉత్తరప్రదేశ్, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ వంటి తొమ్మిది రాష్ట్రాలలో ఎనిమిది లక్షల మంది రైతులతో కనీసం 500 ఎఫ్‌పిఓలు పాల్గొంటున్నాయి. కాఫీ, జీడి, పుదీనా, మామిడి, కూరగాయలు, గోధుమలు, చిరు ధాన్యాలను పండించే చిన్న, సన్నకారు రైతులతో కలిసి పనిచేస్తున్నాయి. వాల్‌మార్ట్ ప్రతినిధి జూలీ గెహ్రీకా మాట్లాడుతూ.. వాల్‌మార్ట్



లేదా ఫ్లిప్‌కార్ట్.. సంస్థల కోసం కాదనీ, రైతులు వృద్ధి చెందడానికి సహాయం చేస్తున్నామని, ఎఫ్‌పిఓలను బలోపేతం చేయడానికేనని చెబుతున్నారు.

భారతీయ కిసాన్ యూనియన్ (ఏక్తా ఉగ్రహన్) కో-ఆర్డినేటర్ పావెల్ కుస్సా మాట్లాడుతూ.. వాల్‌మార్ట్ వీటిని నడిపేది లాభాల కోసమేనన్నారు. వాల్‌మార్ట్ నియంత్రణలో ఉన్న ఎఫ్‌పిఓలు ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికై ఆఫీస్ బేరర్లచే నిర్వహించబడే సహకార సంఘాలను బలహీనపరుస్తాయని కూడా ఆయన సందేహపడ్డారు. 'వాల్‌మార్ట్ భారతదేశంలో వ్యవసాయ మార్కెట్‌లోకి ప్రవేశించాలని కోరుకుంటోంది. లాభమే వీరి ఉద్దేశం కాబట్టి రైతులు జాగ్రత్తగా ఉండాలి. మేము వారి నుండి రైతులకు ఏదైనా మంచిని ఆశించం. వారు తమ ఉత్పత్తులను విక్రయించడానికి, భారతదేశంలో మార్కెట్‌ను సమగ్రపరచడానికి కొత్త ఛానెల్‌ను తవ్వడానికి ప్రయత్నిస్తూ ఉండవచ్చునని కుస్సా అన్నారు. ఎఫ్‌పిఓలను ప్రోత్సహించడం ఇప్పుడేదో వాల్‌మార్ట్ కొత్తగా కాదు. 2020లోనే కేంద్రం పది వేలు కొత్త ఎఫ్‌పిఓలను ప్రారంభించింది. వాల్‌మార్ట్ కూడా గతంలో సెంట్రల్ అమెరికా మరియు మెక్సికోలో ఎఫ్‌పిఓలతో ప్రయోగాలు చేసింది.

లాభాపేక్ష లేని సంస్థలు జోక్యాలు నిజంగా సహాయపడతాయని భావిస్తాయి. వాల్‌మార్ట్ సహాయంతో అరకులోయలోని కాఫీ రైతుల మధ్య ఎఫ్‌పిఓలలో కప్పింగ్ ల్యాబ్‌లను ఏర్పాటు చేశామని, తద్వారా ప్రతి బ్యాచ్ కాఫీ కప్పు నాణ్యతను గుర్తించగలుగుతామని టెక్నోసర్వ్ కంట్రీ హెడ్ పునీత్ గుప్తా చెప్పారు. "ఈ జోక్యాల ద్వారా, మేము బ్లూ టోకై, స్టార్‌బక్స్ వంటి పెద్ద సంస్థాగత కొనుగోలుదారుల సమూహాన్ని తీసుకువచ్చాం. కాబట్టి, వారు వచ్చి ఈ రైతు ఉత్పత్తిదారుల కంపెనీల నుండి ఈ కాఫీని కొనుగోలు చేస్తారు, అరకులోని 5 శాతం కాఫీ రైతులతో ఈ సంస్థ పనిచేస్తుందని గుప్తా పేర్కొన్నారు. ప్రపంచంలోని ఇతర ప్రాంతాలలో వారి అనుభవాలతో జ్ఞానాన్ని పంచుకోవడం ప్రయోజనకరమని డిజిటల్ గ్రీన్ కంట్రీ డైరెక్టర్ కృష్ణన్ పల్లసన చెప్పారు.

బీజేపీ-బీఆర్ఎస్‌ది ఫెవికాల్ బంధం

(మొదటిపేజీ తరువాయి)

ఎద్దేవా చేశారు. సీఎం కేసీఆర్‌కు ఇష్టమైన ప్రాంతం దుబాయ్ అని, దోచుకున్న సొమ్ముతో అక్కడికే పారిపోతారని తెలిపారు. కేసీఆర్ కుర్చీ కదులుతుందనే మంత్రి కేటీఆర్ ఢిల్లీ వీధుల్లో గల్లీ గల్లీ ప్రదక్షిణలు చేస్తున్నా రని విమర్శించారు. కేటీఆర్ పర్యటన కంటోన్మెంట్ రోడ్ల కోసమో, మెట్రో రైలు కోసమో,రాష్ట్ర ప్రయోజనాల కోసమో కాదన్నారు. కల్వకుంట్ల కుటుంబ సభ్యు ల కంపెనీలపై ఐటీ దాడుల నేపథ్యంలోనే కేటీఆర్ ఢిల్లీ టూర్ సాగుతోందనే ఐటీ దాడుల్లో చాలా రహస్య ఆస్తుల వివరాలు దొరికాయని ఆరోపించారు.

నేటి నుంచి రైతుబంధు జమ

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

వానాకాలానికి సంబంధించిన రైతుబంధు సోమవారం నుంచి రైతుల ఖాతాల్లో జమ కానున్నాయని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి వెల్లడించారు. దీంతో 70 లక్షల మంది రైతులకు ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. ఈసారి కొత్తగా ఐదు లక్షల మంది లబ్దిదారులు చేరారని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లక్షా 50 వేల మంది పోడు రైతులకు చెందిన సుమారు నాలుగు లక్షల ఎకరాలకు రైతు బంధు అందజేయనున్నట్టు తెలిపారు. మొత్తం రూ.7720.29 కోట్లు రైతు ఖాతాల్లో పడనున్నాయని వెల్లడించారు.

రష్యాలో తేలిపోయిన తిరుగుబాటు

(మొదటిపేజీ తరువాయి)

రక్షణ మంత్రి షోయిగు పైన ఆరోపణలను గుప్పించాడు. వ్యాగ్నర్ కు చేసిన నిధుల కేటాయింపులో గణనీయంగా కోత విధించటం జరిగిందనేది మరో ఆరోపణ. ఈ నెల మొదట్లో వ్యాగ్నర్ దళాలు రష్యా సైనిక నాయకత్వం నియంత్రణలో పనిచేయాలని పుతిన్ చేసిన సూచనను ప్రిగోజిన్ తిరస్కరించాడు. దీర్ఘకాలంగా పుతిన్ ఆశ్రయం పొందిన ప్రిగోజిన్ సైన్యంపట్ల దురుసుగా వ్యవహరిస్తుండటంతో సైనికాధికారులు విసుగుచెందారు. ఉక్రెయిన్ లో వ్యాగ్నర్ దళాలు కొంత వరకు ఉపయోగపడినా సైనికాధికారుల యుద్ధ నిర్వహణలో ప్రిగోజిన్ జోక్యం ఎక్కువైంది. తనకు వ్యతిరేకంగా చర్యలు తీసుకోకుండా ఉండటం కోసం ప్రిగోజిన్ ఈ సైనిక తిరుగుబాటుకు ప్రయత్నించాడు. రెండో కారణం: గత 24 నుంచి 36 గంటల కాలంలో నాటో ఏమీ చేయకుండా చోద్యం చూస్తూ ఉందని అనుకోవటమంటే అంతకన్నా అమాయకత్వం మరొకటి ఉండదు. నాటో కూటమి ప్రిగోజిన్ తో సంపర్కంలో ఉందనేది సుస్పష్టం. ఈ తిరుగుబాటు జరిగిన కాలంలో ప్రిగోజిన్ నాటో అనుకూల ధోరణిని వ్యక్తం చేయటాన్ని మరోలా వివరించటం కుదరదు. తిరుగుబాటుకు ఇదే తగిన సమయమని ప్రిగోజిన్ తో సంపర్కంలోవున్న నాటో వర్గాలు సూచించి ఉంటాయి. ఉక్రెయిన్ ప్రతిదాడి మొదలయిన మూడు వారాలలోపే ఈ తిరుగుబాటు జరిగింది. ఉక్రెయిన్ రష్యాపైన చేస్తున్న ఈ ప్రతిదాడి సంసిద్ధతకు వందల కోట్ల డాలర్ల వ్యయం చేసినప్పటికీ ఇప్పటికే ఉక్రెయిన్ సైనికులు వేలాదిగా చనిపోయారు. రష్యాతో తలపడిన ఉక్రెయిన్ ప్రతి రంగంలో మట్టిగరిచింది. పశ్చిమ దేశాలు ముఖ్యంగా అమెరికా, జర్మనీలు ఉక్రెయిన్ కు అందించిన ప్రతి ఆయుధాన్నీ రష్యా నిర్వీర్యం చేసింది.మరో రెండు వారాల్లో విల్నియస్‌లో నాటో శిఖరాగ్ర సభ జరగనుంది. ఈ సభలో రష్యా- ఉక్రెయిన్ యుద్ధంలో ఉక్రెయిన్ దారుణ వైఫల్యం ప్రధాన చర్చనీయాంశం కానుంది. అయితే ఈ తిరుగుబాటుతో అటువంటి చర్చ పక్కకుపోయే అవకాశం ఉంది. ఇటువంటి తిరుగుబాటు విజయవంతం కాకపోయినప్పటికీ రష్యన్ ప్రభుత్వాన్ని అస్థిరపరుస్తుందని, రష్యన్ సైనిక చర్యను బలహీనపరుస్తుందని అమెరికా, నాటో దేశాలు భావించాయి. ఈ తిరుగుబాటు తమను ఆశ్చర్యపరచలేదని అమెరికన్ సామ్రాజ్యవాద ప్రతినిధులు, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీ తమ తక్షణ స్పందనలో పేర్కొన్నారంటేనే ఈ తిరుగుబాటు వెనుక అత్యున్నత స్థాయిలో నాటో దేశాల పాత్ర ఉన్నదనేది సుస్పష్టం. అయితే ఈ కిరాయి సైనిక తిరుగుబాటు కేవలం సీఐఏ కుట్రతో మాత్రమే జరిగిందనుకోవటమంటే రష్యా ప్రభుత్వంలోని వాస్తవ విభజనరేఖల్ని, విధానాలను నిర్ణయించే సామాజిక ప్రయోజనాలను విస్మరించటం అవుతుంది.ప్రిగోజిన్ కిరాయి సైనిక తిరుగుబాటు అన్నింటికీ మించి పుతిన్ పాలనావైఫల్యానికి ప్రతీకగా ఉంది. ఈ వైఫల్యం నుంచే ప్రిగోజిన్ ఆవిర్భవించాడు. తాను సృష్టించిన దుష్టశక్తిపైనే పుతిన్ తన నియంత్రణ కోల్పోవటం ఇక్కడ వైచిత్రి. అనేక దశాబ్దాలుగా పుతిన్, ప్రిగోజిన్ ప్రాణమిత్రులు. రష్యన్ మిలిటరీ ఇంటెలిజెన్స్ నుంచి ఆవిర్భవించిన వ్యాగ్నర్ గ్రూపు పట్ల పుతిన్‌కు, ప్రభుత్వ యంత్రాంగంలోని ఇతర బలమైన శక్తులకు ఆశ్రిత పక్షపాతం ఉండేది. ప్రిగోజిన్ సంపన్నుడు. రష్యాలోని పెట్టుబడిదారీ వ్యవస్థను, రష్యా సహజ వనరులను రక్షించటానికి పుతిన్ చేస్తున్న ప్రయత్నంతో తాము నష్టపోతున్నామని రష్యాలోని సంపన్నవర్గం(ఒలిగార్క్స్) భావిస్తోంది. రష్యాలో పుతిన్ నాయకత్వంలోని పెట్టుబడిదారీ వ్యవస్థకు, ఒలిగార్క్ లని పిలువబడుతున్న సంపన్న వర్గానికి మధ్య సమతౌల్యం అప్పుడప్పుడూ దెబ్బతింటూ ఉంటుంది. అలా దెబ్బతిన్నప్పుడు అనేక మంది సంపన్నులు రష్యాను వీడి ఐరోపా దేశాలలో తలదాచుకుంటున్నారు. మొదటి నుంచీ ఉక్రెయిన్ విషయంలో కొద్దిపాటి సైనిక ఒత్తిడితో రష్యా భద్రతకు సంబంధించిన సమస్యలను పశ్చిమ దేశాలు పట్టించుకుంటాయని రష్యా భావించింది. నాటో కూటమి దేశాలు ఎన్ని హద్దులు దాటినా ఇదే విధానాన్ని రష్యా కొనసాగించింది. నేడు అది పుతిన్ ను గద్దె దించే వరకు వచ్చింది. ఈ సైనిక తిరుగుబాటుతోనైనా అమెరికా నాయకత్వంలోని సామ్రాజ్యవాదంపట్ల రష్యా ఎంత వరకు అప్రమత్తం అవుతుందనేది, రష్యా అంతర్గత వైరుధ్యాలను పుతిన్ ఎలా సమతౌల్యంలో ఉంచుతాడనేది తెలియాలంటే వేచిచూడవలసిందే.

రష్యాకు వెనిజులా, నికరాగ్వా మద్దతు

వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురో, నికరాగ్వా అధ్యక్షుడు డేనియల్ ఒర్టెగా రష్యాకు మద్దతు ప్రకటించారు. రష్యాలో వ్యాగ్నర్ గ్రూపు సాయుధ తిరుగుబాటును ఖండిస్తూ ఒక ప్రకటన విడుదల చేశారు. హింసాత్మక మరియు రాజ్యాంగ విరుద్ధ మార్గాల ద్వారా అధికార మార్పు లేదా సాయుధ తిరుగుబాటును తాము తిరస్కరిస్తామని వెనిజులా ప్రకటనలో పేర్కొన్నది. రష్యా సార్వభౌమాధికారం, స్వయం నిర్ణయాధికారంపై దాడి చేయడాన్ని తిరస్కరిస్తున్నామని అందులో వివరించింది. వెనిజులా అధ్యక్షుడు సహా పలువురు ప్రతినిధులు ఈ ప్రకటనను తమ ట్విటర్ ఖాతాల్లో పోస్ట్ చేశారు. శాంతి, స్థిరత్వం, ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా జరిగిన ఈ దాడిని ఎదుర్కొనేందుకు రష్యా ప్రజలకు సంఘీభావం ప్రకటించారు. ప్రస్తుత పరిస్థితులు రష్యా ప్రతిష్ట, స్వభావం, విలక్షణత, బలానికి సవాళ్లు ఎదురవుతున్నట్టున్నాయని నికరాగ్వా అధ్యక్షుడు ఒర్టెగా తెలిపారు.

మణిపూర్ సీఎంను మార్చాలి

- తిరుగుబాటు దళాలను నిరాయుధులను చేయాలి : జాతీయ కన్వెన్షన్ తీర్మానం



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

"పక్షపాతంతో వ్యవహరిస్తున్న మణిపూర్ ముఖ్యమంత్రి బీరెన్‌సింగ్ నిష్క్రియంగా ఉన్నారు. ఆయనను తన పదవి నుంచి తొలగించాలి" అని జాతీయ కన్వెన్షన్ తీర్మానించింది. ఢిల్లీలోని హరికిషన్ సింగ్ సూర్జిత్ భవన్‌లో మణిపూరి సమాధావన్‌తో జరిగిన సదస్సులో కాంగ్రెస్, సీపీఐ(ఎం), సీపీఐ, జేడీయూ, ఫార్వర్డ్ బ్లాక్, ఎన్సీపీ, ఆప్, ఆర్ఎస్‌పీ, శివసేన (ఉదవ్ ఠాక్రే), టీఎంసీ పార్టీలు పాల్గొన్నాయి. తిరుగుబాటు సాయుధ దళాల నిరాయుధీకరణ లేకుండా శాంతి సాధ్యం కాదని కూడా కన్వెన్షన్ పేర్కొంది.మణిపూర్ మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ నేత ఓక్రమ్ ఇబోబి సింగ్ శనివారం హోంమంత్రి అమిత్ షా పిలిచిన అఖిలపక్ష సమావేశం ఒక ప్రహసనమని, మాట్లాడటానికి ఐదు నిమిషాల సమయం కూడా ఇవ్వలేదని ఆరోపించారు. అంతర్జాతీయ సరిహద్దును పంచుకుంటున్న మణిపూర్ రాష్ట్రంలో వందలాది మంది చనిపోతున్నా ప్రధాని మౌనం దిగ్భ్రాంతికరమని అన్నారు. ప్రధానిని కలిసేందుకు ప్రతినిధుల బృందం పది రోజులకుపైగా ఢిల్లీలో వేచి ఉందని, అమిత్ షా పర్యటన తరువాత కూడా హింస పెరుగుతోందని అన్నారు.సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు నీలోత్పల్ బసు మాట్లాడుతూ రాజ్యాంగ ఆదేశాన్ని నెరవేర్చడంలో ప్రధాని నరేంద్ర మోడీ విఫలమయ్యారని విమర్శించారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాతనే మణిపూర్‌లో అశాంతి నెలకొందని, బీజేపీకి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా నిరసన తెలపాలని బసు అన్నారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ మాట్లాడుతూ మణిపూర్ రాజకీయ విపత్తు అని ఆరోపించారు. ప్రజలు సామాజిక, మానవ హక్కుల క్షీణతను ఎదుర్కొంటున్నారని అన్నారు. అఖిలపక్ష బృందాన్ని పంపాలన్న సిఫారసును కూడా అమిత్ షా తిరస్కరించారని విమర్శించారు. తక్షణమే అందరి విశ్వాసంతో చర్చ జరగాలని, ప్రజలు ముఖ్యమంత్రిని మార్చాలనుకుంటే మార్చాలని అన్నారు. శాంతిని నెలకొల్పడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని, ప్రాణాలను, ఆస్తులను కాపాడేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలన్నారు.వివాదాన్ని అదుపు చేసేందుకు సిద్ధంగా లేని ప్రధాని బాధ్యత ఏమిటని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా ప్రశ్నించారు. పుల్వామా తరహాలోనే మణిపూర్ వివాదం కూడా రాజకీయ లబ్ధి పొందేందుకు మరో ప్రయత్నమేనని పేర్కొన్నారు. ఫార్వర్డ్ బ్లాక్ ప్రధాన కార్యదర్శి జి దేవరాజన్, జేడీయూ ఎంపీ అనిల్ హెగ్డే, ఆర్ఎస్‌పీ జాతీయ సెక్రెటేరియట్ సభ్యుడు ఆర్ఎస్ ధాగర్ కూడా మాట్లాడారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు హన్నన్ మొల్లా, సీపీఐ(ఎం) మణిపూర్ రాష్ట్ర కార్యదర్శి క్షేత్రమయుం ఎస్ శాంత, మణిపూర్ కాంగ్రెస్ అధ్యక్షుడు కె. మేఘచంద్ర సింగ్, సీపీఐ రాష్ట్ర మాజీ కార్యదర్శి ఎల్. సోతిన్‌కుమార్ సింగ్, జేడీయూ అధ్యక్షుడు బీరెన్ సింగ్ పాల్గొన్నారు.

గిరిజనేతరుల అరణ్యరోదన

అడవితల్లి బిడ్డలపై సర్కారు వివక్ష | గిరిజనేతరులమే కానీ అడవిబిడ్డలం కాదా?

- పోడు పట్టాలు ఇవ్వకపోవడంపై ఆగ్రహం
- రాష్ట్రంలో 4 లక్షల ఎకరాలకు గిరిజనేతరుల దరఖాస్తులు



నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

ఏడున్నర దశాబ్దాలకు పైగా అడవి తల్లి ఒడిలో కలిసిమెలిసి జీవిస్తున్న గిరిజన, గిరిజనేతరుల మధ్య పోడు పట్టాల విషయంలో సర్కారు అంతరాలు సృష్టిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా 12.46 లక్షల ఎకరాల పోడు భూముల కోసం అడవిబిడ్డలు దరఖాస్తు చేసుకోగా 1,50,012 మంది గిరిజన పోడు రైతులకు చెందిన 4,50,601 ఎకరాలకు మాత్రమే పోడు పట్టాలు ఇచ్చేందుకు ప్రభుత్వం సమాయత్తం అయింది. ఈనెల 30వ తేదీన ఆసిఫాబాద్ జిల్లా వేదికగా ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు పట్టాలు అందజేస్తారు. కానీ ఈ పోడుపట్టాల విషయంలో గిరిజనేతరులను పరిగణలోకి తీసుకోకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తమవుతోంది. మరోవైపు 12 లక్షల ఎకరాల కోసం రైతులు దరఖాస్తు చేసుకుంటే కేవలం నాలుగున్నర లక్షల ఎకరాలతో సరిపెడుతుండటంతోనూ వ్యతిరేకత వ్యక్తమవుతోంది. కాగా, రాష్ట్రవ్యాప్తంగా 4.36 లక్షల ఎకరాల పోడుభూములు 1.71 లక్షల గిరిజనేతరుల చేతుల్లో ఉన్నట్టు అటవీశాఖ అంచనా.

నిబంధనల సాకుతో..

రాష్ట్రవ్యాప్తంగా 28 జిల్లాల నుంచి 4,14,453 మంది 12,46,846 ఎకరాల పోడు భూముల కోసం దరఖాస్తు చేసుకున్నారు. తొలుత 11 లక్షల ఎకరాలకు పైగా పట్టాలిస్తామన్న ప్రభుత్వం కేవలం 4,50,601 ఎకరాలకు మాత్రమే పోడు పట్టాలు ఇచ్చేందుకు సిద్ధమైంది. ఇక 1.71 లక్షల గిరిజనేతరులు 4.36 లక్షల ఎకరాల కోసం దరఖాస్తు చేసుకుంటే నిబంధనల సాకుతో వీరిలో ఒక్కరికి కూడా పట్టాలు ఇవ్వడం లేదు. షెడ్యూల్ ఏరియా భూ చట్టాలు అమల్లో ఉండటంతో వీరి భూములకు మోక్షం లభించడం లేదని అంటున్నారు. అటవీహక్కుల చట్టం 2006 ప్రకారం గిరిజనులు 2005 డిసెంబర్ 13వ తేదీ నాటికి అటవీ భూముల్లో సాగులో ఉండాలి. గిరిజనేతరులైతే మూడు తరాలుగా (75 ఏండ్లు) అటవీ భూముల్లో పోడు చేస్తుండాలి. అంటే 1930 కంటే ముందు నుంచి అటవీప్రాంతంలో నివసిస్తున్నట్టు ఆధారం ఉండాలి. సంబంధిత ఆధారాలు పలువురు నాన్‌ట్రైబ్స్ వద్ద ఉన్నా ప్రభుత్వం పరిగణలోకి తీసుకోకపోవడం గమనార్హం. 1951కి ముందు నిజాం పాలనలో ఉన్న తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం ప్రత్యేక పత్రాలు ఏమీ ఇవ్వలేదు.. అటువంటప్పుడు ఆధారాలు చూపించాలంటే ఎలా అని మరికొందరు గిరిజనేతరులు ప్రశ్నిస్తున్నారు. మరోవైపు ఆక్రమణలో ఉన్న భూములకు, అందిన దరఖాస్తులకు పొంతన లేని కారణంగా గిరిజనేతరులను పక్కనపెట్టినట్టు మరో వాదన వినిపిస్తోంది. వచ్చిన దరఖాస్తుల్లో మూడో వంతు బోగస్‌వేనని ప్రభుత్వం భావిస్తున్నట్టు సమాచారం. ఐదేండ్ల క్రితం నాన్‌ట్రైబ్స్ సాగు చేస్తున్న భూములకు పహానీలు ఇచ్చినట్టే ఇచ్చి ఆ తర్వాత రద్దు చేశారు. ఆ పహానీలతో కొందరు పంట రుణాలు కూడా తీసుకున్నారు. వాటిని రద్దు చేయడంతో రుణాలు తీసుకున్న రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. కనీసం ఆ భూములకైనా పట్టాలు ఇవ్వాలని గిరిజనేతరులు ఎప్పుటి నుంచో డిమాండ్ చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోలేదు. నాన్‌ట్రైబ్స్‌లో షెడ్యూల్ కులాలు, వెనుకబడిన వర్గాలకు చెందిన వారు కూడా అనేక మంది ఉన్నారు. వీరిలో ఎక్కువ మంది పోడు వ్యవసాయమే జీవనాధారంగా బతుకుతున్నారు. పట్టాలొస్తాయని ఆశతో ఎదురుచూస్తున్న వీరికి నిరాశే మిగిలింది.

సీఎం పట్టాలిచ్చే ఆసిఫాబాద్ జిల్లాలో నాన్‌ట్రైబ్స్ దరఖాస్తులే ఎక్కువ..

ఈనెల 30వ తేదీన సీఎం కేసీఆర్ పోడు పట్టాలు పంపిణీ చేసే ఆసిఫాబాద్ జిల్లాలో గిరిజనుల కన్నా గిరిజనేతరుల నుంచే దరఖాస్తులు ఎక్కువగా వచ్చాయి. ఈ జిల్లాలో 31,633 దరఖాస్తులు 76,800 ఎకరాల కోసం స్వీకరించారు. వీరిలో 15,600 మంది గిరిజనులుంటే 16,033 మంది గిరిజనేతరులు ఉండటం గమనార్హం. ఈ జిల్లాలోని 15 మండలాల్లో నాన్‌ట్రైబ్సే ఎక్కువగా ఉన్నారు. ఇక్కడ ఒక్క జైనూరు మండలంలోనే 40వేల ఎకరాల్లో నాన్‌ట్రైబ్స్ సాగు చేస్తున్నారు. కామారెడ్డి జిల్లాలో దరఖాస్తు చేసుకున్న వారిలో.. 11వేల గిరిజనులు, 15వేల మంది గిరిజనేతరులు ఉండటం గమనార్హం. రాష్ట్రంలోనే అత్యధికంగా పోడు పట్టాల అర్హులను గుర్తించిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోనూ 1930 కంటే ముందు నుంచే ఏజెన్సీలో నివసిస్తున్నట్టు పలువురు గిరిజనేతరుల వద్ద ఆధారాలు సైతం ఉన్నాయి. రాష్ట్రంలో ఆసిఫాబాద్ తర్వాత గిరిజనేతరుల సాగులో మహబూబాబాద్, ములుగు, కొత్తగూడెం, కామారెడ్డి, భూపాలపల్లి, ఆదిలాబాద్, ఖమ్మం, పెద్దపల్లి, జగిత్యాల, మెదక్, నిజామాబాద్, నాగర్‌కర్నూల్, నల్లగొండ, మంచిర్యాల, నిర్మల్, సిద్దిపేట, వనపర్తి తదితర జిల్లాల్లో గిరిజనేతరులు ఒక్కొక్కరి చేతిలో మూడు ఎకరాలకు పైగా ఉన్నాయని సమాచారం.

మూడు తరాలుగా సాగు చేస్తున్నాం



మూడు ఎకరాలు పోడుకొట్టుకుని మూడు తరాలుగా సాగు చేస్తున్నాం. పట్టా లేదు.. హక్కు పత్రం లేదు. మా భూమి మా ముత్తాత జీవనాధారంగా సాగు చేసిండు. తరువాత మా తాత, మా నాన్న ఇప్పుడు నేను చేస్తున్నా. 1930కి ముందు నుంచి ఊర్లో ఉండి వ్యవసాయం చేస్తున్నాం. మొన్నటి పోడు సర్వేలో ఆ ఆధారాలు, మా గ్రామ పెద్దల వాంగ్మూలం కూడా ఇచ్చాను. పోడు పట్టాల కోసం ఆశగా చూసినా.. ప్రభుత్వ ప్రకటనతో కుటుంబం మొత్తం నిరాశకు గురయ్యాం.

చుంచు వెంకన్న, గిరిజనేతర రైతు, మొండికుంట, అశ్వాపురం, కొత్తగూడెం జిల్లా

గౌడ కులస్తుల ఆత్మగౌరవాన్ని పెంచుతాం

మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, గంగుల కమలాకర్

- కోకాపేటలో గౌడ సంఘం భవనానికి శంకుస్థాపన



నవతెలంగాణ-గండిపేట్

గౌడ కులస్తుల ఆత్మగౌరవాన్ని పెంచుతామని రాష్ట్ర మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, గంగుల కమలాకర్ అన్నారు. ఆదివారం రంగారెడ్డి జిల్లా గండిపేట్ మండలం కోకాపేట్‌లో గౌడ సంఘం భవనానికి మంత్రులు శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రులు మాట్లాడుతూ.. సర్దార్ సర్వాయి పాపన్న పేరుతో గౌడ సంఘ భవనాన్ని.. ఐదెకరాల స్థలంలో నిర్మిస్తున్నట్టు చెప్పారు. బీసీ వర్గాలకు అన్ని సంక్షేమ భవనాల మాదిరిగా గౌడ సంఘం భవనాన్ని కూడా గొప్పగా నిర్మిస్తామన్నారు. సీఎం కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని తెలిపారు. కోకాపేట్‌లో అన్ని కుల సంఘాల భవనాలను నిర్మించిన విషయాన్ని గుర్తు చేశారు. గౌడ కులస్తుల అభ్యున్నతికి సీఎం కేసీఆర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారన్నారు. ప్రజా సంక్షేమ భవనాలను త్వరలో పూర్తిచేసి కుల సంఘాలకు అంకితం చేస్తామన్నారు. బీసీలు ఆర్థికంగా ఎదిగేందుకు తోడ్పాటునిచ్చేందుకు రూ.లక్ష ఆర్థిక సాయం చేస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. అర్హులందరికీ దశల వారీగా రూ.లక్ష ఆర్థిక సాయం చేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, శాసన మండలి మాజీ చైర్మెన్ కె.స్వామిగౌడ్, మాజీ ఎమ్మెల్సీలు గంగాధర్‌గౌడ్, భిక్షమయ్యగౌడ్, సత్యనారాయణగౌడ్, ఆంజనేయులుగౌడ్, బీసీ సంక్షేమ కార్పొరేషన్ చైర్మెన్ కృష్ణమోహన్‌రావు, బీసీ కమిషనర్ సభ్యులు కిషోర్‌గౌడ్, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్, బీఆర్ఎస్ గండిపేట్ మండల అధ్యక్షులు రామేశ్వరం నర్సింహ, నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ రేఖయాదగిరి, బీఆర్ఎస్ నాయకులు వెంకటేష్ యాదవ్, కౌన్సిలర్లు, కార్పొరేటర్లు, నాయకులు, పాల్గొన్నారు.

ఒకే దఫా రుణమాఫీ చేయాలి

- రైతులకు కొత్త రుణాలూ మంజూరు చేయాలి : తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తీగల సాగర్



నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

రైతులకు ఒకే విడుతలో రుణమాఫీ చేసి కొత్త రుణాలు మంజూరు చేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తీగల సాగర్ డిమాండ్ చేశారు. నిజామాబాద్ నగరంలోని నాందేవ్‌వాడలో రైతు సంఘం కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి ఒకేసారి రైతులకు లక్ష రూపాయలు రుణమాఫీ చేస్తానని హామీ ఇచ్చి తొమ్మిదేండ్లు గడిచిపోతున్నప్పటికీ రుణ మాఫీ కాక రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. బ్యాంకులు వడ్డీలకు వడ్డీలు వేసి రైతులను అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారని వాపోయారు. ఒకేసారి లక్ష రూపాయలు మాఫీ చేసి కొత్త రుణాలు ఇప్పించాలని, అకాల వర్షాల వల్ల పంట నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలని, కౌలు రైతులను ఆదుకోవాలని కోరారు. పోడు భూములకు కేవలం నాలుగు లక్షల మందికి మాత్రమే పట్టాలు ఇస్తానని అన్నారని, అర్హులందరికీ పోడు హక్కు పత్రాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వానాకాలం పంట వేసుకోవటానికి రైతులు సిద్ధపడుతున్న తరుణంలో నకిలీ విత్తనాలు లేకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. యాసంగి పంటల డబ్బులను వెంటనే రైతుల ఖాతాలో జమ చేయాలని, లేనిపక్షంలో రైతులను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. సమావేశంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గంగాధరప్ప, వల్లపు వెంకటేష్, జిల్లా ఉపాధ్యక్షులు గంగామణి తదితరులు పాల్గొన్నారు.

తులసీ చందుపై మతోన్మాదుల బెదిరింపులను ఖండించండి

- సీఐటీయూ, డీవైఎఫ్ఐ పిలుపు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

స్వతంత్ర జర్నలిస్టు, సామాజిక విశ్లేషకురాలు తులసీచందును చంపేస్తామని ఫోన్లు చేసి బెదిరిస్తున్న ఆర్ఎస్ఎస్ మతోన్మాదుల చర్యలను ప్రతిఒక్కరూ ఖండించాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చుక్కరాములు, పాలడుగు భాస్కర్, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోట రమేశ్, ఎ.వెంకటేశ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. ఒక వ్యక్తి భావవ్యక్తీకరణను అడ్డుకోవడం రాజ్యాంగ ప్రజాస్వామిక హక్కులను కాలరాయడమేనని పేర్కొన్నారు. మతోన్మాదం, మనువాద ఆగడాలు అరాచకాలను ప్రశ్నిస్తూ దేశంలో శాంతి మతసామరస్యాలను పెంపొందించాలనే ధృఢ సంకల్పంతో సామాజిక మాధ్యమాలలో విశ్లేషణలు చేస్తున్న తులసీచంద్‌పై బెదిరింపులకు పాల్పడటం అప్రజాస్వామికమనీ, ఆటవిక చర్య అని పేర్కొన్నారు. గతంలో బీజేపీ - మతోన్మాదుల ఆగడాలను ప్రశ్నించినందుకు గౌరీ లంకేష్, కల్బుర్గి, పన్సారే, ధబోల్కర్‌ను హతమార్చిన ఈ మతోన్మాద గుండాలు ఇప్పుడు తులసీ చందును హత్య చేస్తామంటూ బెదిరించటం దారుణమని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి తులసీచందుకు పూర్తిస్థాయి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఆమెకి ఏమైనా జరిగితే రాష్ట్రంలోని ఆర్ఎస్ఎస్, బీజేపీ నేతలు బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

మతోన్మాదుల ఆగడాలను అడ్డుకుందాం : కేవీపీఎస్

స్వతంత్ర జర్నలిస్టు తులసి చందును ఆర్ఎస్ఎస్ మూకలు చంపుతామని ఫోన్లు చేసి బెదిరించడాన్ని మానుకోవాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జాన్ వెస్లీ టి స్కైలాబ్ బాబు ఆదివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. మతోన్మాదం, మనువాద ఆగడాలను ప్రశ్నిస్తున్నందుకే ఆమెపై బెదిరింపులకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. శాంతి మతసామరస్యాలను పెంపొందించాలనే సంకల్పంతో సామాజిక మాధ్యమాలలో ఆమె విశ్లేషణలు చేస్తున్నారని తెలిపారు. ఆమెపై బెదిరింపులకు పాల్పడటం ప్రజాస్వామిక హక్కును కాలరాయడమేనని పేర్కొన్నారు. ఆమెకి ఎలాంటి హాని జరిగినా రాష్ట్రంలోని ఆర్ఎస్ఎస్ బీజేపీ నేతలు బాధ్యత వహించాలని హెచ్చరించారు. ప్రభుత్వం ఆమెకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. బెదిరి ంపులకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి: సీపీఐ(ఎంఎల్)ప్రజాపంథా

స్వతంత్ర జర్నలిస్టు తులసి చందును ఆర్ఎస్ఎస్ మూకలు చంపుతామని ఫోన్లు చేసి బెదిరించడాన్ని మానుకోవాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు ఆదివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. మతోన్మాదం, మనువాద ఆగడాలను ప్రశ్నిస్తున్నందుకే ఆమెపై బెదిరింపులకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. శాంతి మతసామరస్యాలను పెంపొందించాలనే సంకల్పంతో సామాజిక మాధ్యమాలలో ఆమె విశ్లేషణలు చేస్తున్నారని తెలిపారు. ఆమెపై బెదిరింపులకు పాల్పడటం ప్రజాస్వామిక హక్కును కాలరాయడమేనని పేర్కొన్నారు. ఆమెకి ఎలాంటి హాని జరిగినా రాష్ట్రంలోని ఆర్ఎస్ఎస్ బీజేపీ నేతలు బాధ్యత వహించాలని హెచ్చరించారు. ప్రభుత్వం ఆమెకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. బెదిరింపులకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

గృహలక్ష్మిలో 5శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి

- మంత్రి కొప్పులకు ఎన్‌పీఆర్‌డీ వినతి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహలక్ష్మి పథకంలో వికలాంగులకు ఐదు శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక(ఎన్‌పీఆర్‌డీ) డిమాండ్ చేసింది. ఈ మేరకు శనివారం రాత్రి సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.వెంకట్, ఎం అడివయ్యతోపాటు కోశాధికారి ఆర్ వెంకటేశ్ హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో శనివారం రాత్రి మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు.స్వంత స్థలం కలిగిన నిరుపేదలకు ఇంటి నిర్మాణం కోసం రూ.3లక్షల ఆర్థిక సహాయం చేయటానికి గృహలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టిందనీ, దీనిలో 2016 వికలాంగుల హక్కుల పరిరక్షణ చట్టం ప్రకారం ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాల్లో 5 శాతం రిజర్వేషన్లను వికలాంగులకు అమలు చేయాలనే నిబంధనను పట్టించుకోలేదని తెలిపారు. ఆ చట్టం ప్రకారం గృహలక్ష్మి పథకంలో వికలాంగులకు ఐదు శాతం రిజరేశ్వన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. జూన్ 21న రవాణా, రోడ్, భవనల శాఖ జీవో 25ను విడుదల చేసిందనీ, ఇందులో కులాల వారిగా రిజర్వేషన్స్ అమలు చేయాలని పేర్కొన్నారని గుర్తు చేశారు.కానీ..వికలాంగులకు అమలు చేయాల్సిన రిజర్వేషన్ల గురించి జీవో లేకపోవటం విచారకరమని తెలిపారు. 2016 ఆర్‌పీడీ చట్టానికి బిన్నంగా రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేయడం తగదని పేర్కొన్నారు. వెంటనే జీవోను సవరించాలని డిమాండ్ చేశారు. చట్ట ప్రకారం వికలాంగులకు దక్కాల్సిన రిజర్వేషన్లను అమలు చేయకుండా మోసం చేయడమేంటని ప్రశ్నించారు. రాష్ట్ర వికలాంగుల సంక్షేమ శాఖ డైరెక్టర్ మాత్రం తమకు ఏమి పట్టనట్టు వ్యవహరిసస్తున్నారని విమర్శించారు. వికలాంగుల సంక్షేమ శాఖ డైరెక్టర్ నిర్లక్ష్యం వల్ల వికలాంగులకు అందాల్సిన సౌకర్యాలు అందటం లేదని పేర్కొన్నారు. వివిధ శాఖల అధికారులు 2016 ఆర్‌పీడీ చట్టానికి తూట్లుపొడుస్తుంటే పర్యవేక్షించాల్సిన కమిషనర్ ఏమి పట్టనట్లు వ్యవహరించడం తగదని హితవు పలికారు. గృహలక్ష్మి పథకం లబ్ధిదారులు తప్పనిసరిగా ఆహార భద్రత కార్డు కలిగి ఉండాలని నిబంధన ఉందనీ, దీని ప్రకారం వికలాంగులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వమే వికలాంగులకు ఉచితంగా ఇండ్లు కట్టించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. గృహలక్ష్మి పథకం లబ్ధిదారుల ఎంపికలో వికలాంగులకు 5 శాతం రిజ్వేషన్లు అమలు అయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని మంత్రి కొప్పుల ఈశ్వర్ హామీ ఇచ్చారని తెలిపారు.

టీఎస్‌యూఈఈయూలో చేరిన 31 మంది సీబీడీ-ఎస్ఎంజీ కార్మికులు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ట్రాన్స్‌కోలో పనిచేస్తున్న సీబీడీ-ఎస్ఎంజీ కార్మికులు తెలంగాణ స్టేట్ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్(సీఐటీయూ అనుబంధం)లో చేరారు. ఆదివారం హైదరాబాద్‌లోని సీఐటీయూ రాష్ట్ర కార్యాలయంలో 400, 200, 132కేవీ సబ్‌స్టేషన్లలో పనిచేస్తున్న మెయింటెనెన్స్ గ్యాంగ్ కార్మికులు, సెంట్రల్ బ్రేక్ డౌన్ కార్మికుల సమావేశం ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె.ఈశ్వర్‌రావు అధ్యక్షతన జరిగింది. టీఎస్‌యూఈఈయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.గోవర్ధన్ మాట్లాడుతూ...ట్రాన్స్‌కో సీబీడీ- ఎస్ఎంజీ గ్యాంగ్ కార్మికులు అత్యంత క్లిష్టతర పనులు నిర్వహించే వారికి విద్యార్హతతో సంబంధం లేకుండా గ్రేడ్-1 కార్మికులతో సమానంగా వేతనాలివ్వాలని డిమాండ్ చేశారు. కె. ఈశ్వర్‌రావు మాట్లాడుతూ గతంలో వారు హైస్కిల్డ్ వేతనం పొందేవారనీ, వేతన సవరణ జరిగినప్పటికీ గతంలో కంటే తక్కువ వేతనాలు వస్తున్నాయని వాపోయారు. దీనిని యాజమాన్యం, గుర్తింపు సంఘాలు పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. కష్టతరమైన పనిచేస్తున్న సిబీడీ గ్యాంగ్ కార్మికులకు రిస్క్ అలవెన్స్ ఇవ్వాలనీ, ఆర్టిజన్ కార్మికులకు కన్వర్షన్ ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు ట్రాన్స్‌కో సీబీడీ గ్యాంగ్ కార్మికులు యూనియన్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూఈఈయూ రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ కె. మధు, జె. ప్రసాదరాజు, కోశాధికారి ఎస్. బస్వరాజు ట్రాన్స్‌కో కమిటీ నాయకులు వెంకటేశ్వరరావు, అంజయ్య, చందులాల్, శ్యాం, సైదులు, అరండు వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

అమీన్‌పూర్ బాధితులకు న్యాయం చేయాలి

- సాహితీ శర్వాణి ఎలైట్ ప్రాజెక్ట్ బాధితుల సంఘం



నవతెలంగాణ-అడిక్‌మెట్

ఏపీలో సత్యం స్కాం, అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేసినట్టుగానే హైదరాబాద్ శివారు ప్రాంతంలోని అమీన్‌పూర్ సాహితీ శర్వాణీ ఎలైట్ ప్రాజెక్టు బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం న్యాయం చేయాలని సాహితీ శర్వాణి ఎలైట్ అమీన్‌పూర్ ప్రాజెక్టు బాధితుల సంఘం నాయకులు కోరారు. అమీన్‌పూర్ సాహితీ శర్వాణీ ఎలైట్ ప్రాజెక్టులో డబ్బు చెల్లించి మోసపోయిన బాదితులు ఆదివారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు కిషన్ రెడ్డి, మధుకర్ మాట్లాడుతూ.. సాహితీ శర్వాణీ ఎలైట్ ప్రాజెక్టు వెంచర్‌లో ప్లాట్ కొనుగోలు చేసేందుకు డబ్బు చెల్లించిన వారికి డబుల్ రిజిస్ట్రేషన్ చేశారని ఆరోపించారు. డబుల్ రిజిస్ట్రేషన్‌తో అమాయకులను మోసగించిన వారిపై రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని, వెంచర్ నిర్వాకులపై కేసులు నమోదు చేయాలని కోరారు. ఈ వెంచర్‌లో చోటు చేసుకున్న అవకతవకలపై, అమాయకులను మోసగించిన వారిని రాష్ట్ర ప్రభుత్వం విచారించి చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కమిటీ వేసి ప్లాట్ కోసం డబ్బులు చెల్లించిన వారి వివరాలను సేకరించి, చెల్లించిన మొత్తాన్ని తిరిగి చెల్లించే ప్రక్రియనూ చేపట్టాలని కోరారు. లేనిపక్షంలో ఈ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బాధితుల సంఘం నాయకులు హనుమంతరావు, వంశీ, ఫణీంద్ర, రమణ, నరేంద్రబాబు, భీమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘోర రోడ్డు ప్రమాదం

- కారును ఢీకొట్టిన టిప్పర్
- ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి



నవతెలంగాణ-ఆత్మకూర్

వరంగల్ నుంచి భూపాలపట్నం వెళ్లే జాతీయ రహదారిపై మారుతీ వ్యాగనర్ కారును ఎదురుగా అతివేగంగా వస్తున్న టిప్పర్.. ఢీకొట్టడంతో కారులోని నలుగురు అక్కడికక్కడే మృతిచెందిన ఘటన హన్మకొండ జిల్లా ఆత్మకూరు మండల కేంద్రంలో ఆదివారం జరిగింది. ఆత్మకూరు సీఐ బండారి కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా కాశీబుగ్గకు చెందిన ఒకే కుటుంబానికి చెందిన అనుముల నర్సింహస్వామి(52), వెల్దండి సాంబరాజు (40), వెల్దండి ఆకాంక్ష (26), వెల్దంది లక్ష్మీ ప్రసన్న(6).. ములుగు జిల్లా మేడారానికి వెళ్లి వనదేవతలను దర్శించుకొని తిరిగి వస్తున్నారు. హన్మకొండ జిల్లా ఆత్మకూరు మండలం పత్తిపాక క్రాస్ రోడ్డు సమీపంలో వారి కారును వరంగల్ నుంచి శాయంపేట మండలం పత్తిపాక గ్రామంలోని స్టోన్ క్రషర్‌కు చెందిన టిప్పర్ అతివేగంగా రెండుసార్లు ఢీకొట్టడంతో కారులో ప్రయాణిస్తున్న వారు అక్కడికిఅక్కడే మృతి చెందారు. మరో ముగ్గురు రాజశ్రీ, ఆర్షిత, అక్షయరాజ్‌కు తీవ్రగాయాలయ్యాయి. కారు బెలూన్ తెరుచుకోవడంతో డ్రైవర్ ఆకాష్ సురక్షితంగా బయట పడ్డారు. అందరూ వరంగల్ కాశీబుగ్గ ప్రాంతానికి చెందిన ఒకే కుటుంబానికి చెందిన వారని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ బండారి కుమార్ తెలిపారు.

ఎఫ్‌సీఆర్ఐలో ప్రవేశ దరఖాస్తులకు ఆహ్వానం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అటవీ కళాశాల, పరిశోధనా సంస్థ(ఎఫ్‌సీఆర్ఐ)లో 2023-24 విద్యాసంవత్సరానికి గానూ బీఎస్సీ(ఆనర్స్) ఫారెస్ట్రీ నాలుగేండ్ల డిగ్రీ కోర్సులో చేరేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేసింది. దరఖాస్తు రుసుం ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ అభ్యర్థులకు రూ.1000, ఇతరులకు రూ.2000 చెల్లించి జులై 12లోపు దరఖాస్తు చేయాలని సూచించింది. రూ.500 ఆలస్య రుసుముతో జులై 15 వరకు అవకాశం ఇస్తున్నట్టు తెలిపింది. వెబ్‌సైట్ WWW.fcrits.in లోగానీ, 80743 50866/89194 77851 ఫోన్‌నెంబర్లనుగాని సంప్రదించాలని సూచించింది.

ప్రొఫెసర్ నాగేశ్వర్‌ను కలిసిన జేపీ నడ్డా

- సిద్ధాంతాలు వేరైనా అభిప్రాయాలు పంచుకోవడం మంచిదే : నాగేశ్వర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాజకీయ విశ్లేషకులు, మాజీ ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ నాగేశ్వర్‌ను బీజేపీ జాతీయ అధ్యక్షులు జేపీ నడ్డా ఆదివారం హైదరాబాద్‌లో కలిశారు. ప్రధానిగా మోడీ తొమ్మిదేండ్ల పాలనపై ముద్రించిన పుస్తకాన్ని నాగేశ్వర్‌కు ఆయన అందించారు. తాజా రాజకీయాలపై కాసేపు ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, ఎంపీ, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు డాక్టర్ కె.లక్ష్మణ్, మాజీ ఎమ్మెల్సీ రామచందర్‌రావు, తదితరులు పాల్గొన్నారు. నడ్డాతో భేటీ అనంతరం నాగేశ్వర్ మీడియాతో మాట్లాడారు. 'దేశవ్యాప్తంగా అనేక మందిని కలుస్తున్నారు. అందులో భాగంగానే ఆయన నన్ను కలిశారు. అంతకు మించి ఏం లేదు. వివిధ అంశాలపై చర్చించాం. జేపీ నడ్డాతో నా అభిప్రాయాలను పంచుకున్నా.ప్రజాస్వామ్యంలో ఇది మంచి పరిణామం. సిద్ధాంతాలు వేరైనా అభిప్రాయాలు పంచుకోవడం మంచిదే' అని అన్నారు. పద్మశ్రీ అవార్డు గ్రహీత ఆనంద శంకర జయంత్‌ను కలిసి మోడీ 9 ఏండ్ల పాలనపై పుస్తకాన్ని అందించారు. మరోవైపు హైదరాబాద్‌లోని నోవాటెల్‌లో బీజేపీ ముఖ్యనేతలతో నడ్డా భేటీ అయ్యారు. రాష్ట్ర బీజేపీలో కొన్ని రోజులుగా జరుగుతున్న పరిణామాలపై ఆరా తీశారు. ఈ సమావేశంలో కిషన్‌రెడ్డి, లక్ష్మణ్, వివేక్, విజయశాంతి, రామచందర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

జులై 8,9 తేదీల్లో రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు

- వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బాలమల్లేష్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు జులై 8,9 తేదీలలో హైదరాబాద్‌లో హిమాయత్‌నగర్‌లోని మగ్దూంభవన్ నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర అధ్యక్షులు కలకొండ కాంతయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్. బాలమల్లేష్ ఆదివారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశాలు జులై 8 తేదీన ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతాయని, సమావేశానికి ముఖ్య అతిథులుగా వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ కార్యదర్శి నిర్మల్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కూనంనేని సాంబశివరావు, బీకేఎంయూ జాతీయ కార్యవర్గ సభ్యులు టి.వెంకట్‌రాములు హాజరవుతారని వెల్లడించారు.

'ఫినోలెక్స్' తెలంగాణ డీలర్స్ సమావేశం



హైదరాబాద్ : ఫినోలెక్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, భవ్య సేల్స్ కార్పొరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో 'ఫినోలెక్స్ అగ్రి కాలమ్ పైపులు తెలంగాణ డీలర్స్ సమావేశం జరిగింది. నాగోల్‌లోని జూబ్లీ పార్క్ (నవరస హోటల్)లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫినోలెక్స్ కంపెనీ డీజీఎం సందీప్ గౌడ్, భవ్య సేల్స్ కార్పొరేషన్ ప్రొప్రైటర్ నల్లపాటి బసంత్ లు పాల్గొన్నారు. కంపెనీ ఉత్పత్తుల నాణ్యతను వివరించారు. వాటిని ప్రదర్శించారు. సంస్థకు 43 ఏండ్లకు పైగా అనుభవం ఉన్నదని తెలిపారు. వెయ్యి మందికి పైగా డీలర్లు, 21 వేల మందికి పైగా రిటైలర్లను సంస్థ కలిగి ఉన్నదని చెప్పారు. కంపెనీ సేల్స్, ప్రమోషన్స్ గురించి కొత్త స్కీమ్స్‌ను ప్రవేశపెట్టారు. కార్యక్రమానికి వచ్చిన డీలర్లు కంపెనీ ఉత్పాదనల వ్యాప్తి, నాణ్యతను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నల్లపాటి కళ్యాణ్, కె. సుబ్రమణ్యం, రాఘవేంద్ర, రాములుతో పాటు డీలర్లు, కంపెనీ యాజమాన్యం, ప్రతినిధులు, భవ్య సేల్స్ కార్పొరేషన్ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రజల బాధలను వినాలి

- మాజీ పీవీ తరహాలో బాధితులను కలవాలి : మాజీ ఎంపీ సురవరం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సీఎం కేసీఆర్ సామూహికంగా ప్రజలను కలవనక్కర్లేదని(ప్రజా దర్బార్), ఇంత పెద్ద ప్రభుత్వ యంత్రాంగం పనిచేయకపోతేనే సీఎంను కలవాలని ఆయన అన్నట్లుగా మంత్రి కేటీఆర్ ట్వీట్ చేశారు. ఇది ఆశ్చర్యకరమని మాజీ ఎంపీ, సీపీఐ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి అన్నారు. మన అధికార యంత్రాంగం శక్తివంతమైనదే కానీ అనేక సందర్భాలలో అది నిరంకుశమైనదనీ, చట్టం పేరుతో సమస్యలు పరిష్కారం కాకుండా ఇబ్బంది పెడతారని విమర్శించారు. కొంతమంది ప్రజానుకూలంగా ఉంటే ప్రజాప్రతినిధులు వారిని పనిచేయకుండా నిర్బంధిస్తారని తెలిపారు. అవినీతి పరులు ప్రజలను ఇబ్బంది పెడతారని, కొన్ని ప్రభుత్వ నిబంధనలు లోపభూయిష్టంగా ఉండి తీవ్రమైన అడ్డంకులు సష్టిస్తాయని, ఇవి ఎవరికి చెప్పుకోవాలి? ఎవరు పరిష్కారం చేస్తారని ప్రశ్నించారు.దేశంలో కూడా పెద్ద అధికార యంత్రాంగం, గొప్ప అధికారులు ఉన్నప్పటికీ, పీవీ. నరసింహరావు ప్రధానిగా ప్రతిరోజు కొన్ని వందల మంది ప్రజలను కలిసేవారని గుర్తుచేశారు. వారి సమస్యలు నోట్స్ రాసుకుని, ప్రధాని వచ్చినపుడు వివరించేవారని, దరఖాస్తులను ప్రధాని చేతుల మీదుగా అధికారు లకు ఇచ్చేవారని తెలిపారు. వాటిని సంబధిత అధికారులకు పంపి, మళ్ళీ జవాబు పంపేవారని,వాజపేయి,మన్మోహన్ సింగ్ ఆ సంప్రదాయం కాక, ప్రజా ప్రతిని ధులను, రాష్ట్రాల ప్రతినిధి వర్గాలను కలిసేవారని వివరించారు.

దక్కన్ పతాకం

ఇది తూర్పు పడమరల నట్టనడిగడ్డ
సాత్పురా నీలగిరిల నడుమ నిలిచిన మైదానం
బహు సంస్కృతుల దక్కన్ పీఠభూమి

కృష్ణా గోదావరి నీళ్ల గలగలలోనే
పోరాటం సామరస్యం కలెగలిసిన ప్రవాహం
సహజీవనం ఈ నేల ప్రాకృతిక లక్షణం

ఇది తెలంగాణ మట్టి తెచ్చుకున్న వారసత్వం

నెత్తి మీద తెల్ల తెల్లని రుమాలు
తల మీద నిటారుగా నిలిచిన రూమి టోపీ
గుండె గుండె అలాయ్ బలయ్ ల తో నులువెచ్చని స్పర్శ

కలవక కలవక కలిస్తే రాలిన వలవల శోకం
కాకి ఎంగిలి తినిపించుకున్న స్నేహం
భుజాల మీద చేతులు ఏసుక తిరిగిన కాలం

ఆపతి సంపతిల ఆదుకునే సోపతి తత్వం

భాషలు వేరైనా భావాల సమైక్యత ఒక్కటే
సంస్కృతులు వేరైనా జనజీవితం ఒకటే
నారాయణగూడ లో కన్నడిగుల కస్తూరి పరిమళం
బేగంబజార్ నిండా వ్యాపించిన మార్వాడి మధురిమలు
తిరుమలగిరి బొల్లారం తమిళ తళుక్కువాక్కులు
కోటి రామ్ కోటి చుట్టూ అల్లుకున్న గుజరాతీయం
కూకట్పల్లి కొండాపూర్ కొండల్లో నిలిచిన అంధ్రం

చార్మినార్ చుట్టూ అల్లుకున్న ముస్లిం జీవన సౌరభం
హైదరాబాద్ ఒక మహా భాగ్యనగర పుష్పం

అసిఫ్ జాహీలైన, కుతుబ్ షాహిలైనా
గోలకొండను ఏలిన బహుమనీలు ఎవరైనా
బహుళ విలువల దక్కన్ పతాకం రెపరెపలాడాలి
సాంస్కృతిక సహజీవనం పరిఢవిల్లాలి.

- అన్నవరం దేవేందర్, 9440763479

కళల రేడు అడవి బాపిరాజు

సృజనశీల సాహిత్యం వేరు.. ఉద్యమ సాహిత్యం వేరు.. ఈ రెండింటినీ మెండుగా నడిపిస్తూ సమన్వయ పరుస్తూ కావ్యకర్తగా కృషి చేసిన అత్యంత అరుదైన కళాసాహితీ స్రష్ట - ద్రష్ట అడవి బాపిరాజు. కవి, గాయకుడు, నవలాకారుడు, చిత్రకారుడు, స్వాప్నికుడు.. ఇలా ఎన్నెన్నో ప్రజ్ఞా పాటవాలతో తెలుగు కళా సాహితీ జగత్తులో చల్లని వెన్నెల కాంతులు ప్రసరింప చేసిన అందాల చంద్రుడు అడవి బాపిరాజు అంటే అతిశయోక్తి కాదేమో!

'అఖిల కళా వైభవశ్రీ అడవి బాపిరాజు' పేర డా॥ నాగసూరి వేణుగోపాల్ సంపాదకత్వాన ఇటీవల రెండు బృహత్ సంపుటాలు వెలువడినాయి. సాహితీ, చిత్రలేఖన, శిల్ప, నాట్య, సంపాదక, సినీ కళా నైపుణ్యాల విశ్లేషణలు వీటిలో ఉన్నాయి. బాపిరాజు సహచర గణం, సమకాలీన తరం, ఆ తరువాతి తరం వారందించిన ఈ సంపుటిల సమాచార వ్యాసమాలలు బాపిరాజు గుణ గణాలు విశ్లేషించడంతో పాటు ఆయన స్వరూప స్వభావాలను, విశిష్ట వ్యక్తిత్వాన్ని సైతం పాఠకులకు బొమ్మ కడ్తాయి. కొండను అద్దంలో చూపినట్టు బాపిరాజు జీవితము - కృషిని ఇవి చూపెడతాయి.

బహుముఖ ప్రజ్ఞాశాలి బాపిరాజు తెలుగు వానిగా జన్మించడం తెలుగు వారందరికీ గర్వకారణమని, 20వ శతాబ్దంలో తెలుగు భాషా సంస్కృతులను, సాహితీ కళాకృతులను సుసంపన్నం చేసిన వారిలో బాపిరాజు అద్వితీయులని సంపుటాలు తేటతెల్లం చేస్తాయి. 'అడవి బాపిరాజు కవి, కథకుడు, నవలాకారుడు, పత్రికా సంపాదకుడు, నాట్యాచార్యుడు, సినీ కళా దర్శకుడు, న్యాయవాది, స్వాతంత్ర్యోద్యమంలో కారాగార వాసం చేసిన దేశ భక్తుడు. ఇంతటి బహుముఖీన ప్రతిభ కలవారు తెలుగునాట మరొకరు లేరనుట అతిశయోక్తి కాదు' అని భాషా సాహితీ ప్రియులు మండలి బుద్ధప్రసాద్ ముందుమాటలో పేర్కొన్నారు.

1895లో జన్మించిన బాపిరాజు ఆరు పదుల వయసు మించకుండానే 1952లో అస్తమించడం విషాదం. ఆ చిరు వయస్సులోనే వారు చేసిన కృషి అనన్య సామాన్యం గనుకనే వారి రచనలు, చిత్రాలు ఖండాంతర సీమలు పరుచుకున్నాయి. కళలోనే పుట్టి, కళలోనే పెరిగి, కళలకు జీవితం అంకితం చేసి, కళా సేవలోనే కాలధర్మం చెందిన ధన్యజీవిగా అడవి బాపిరాజును నార్ల అభివర్ణిస్తారు.

బావా బావా పన్నీరు, లేపాక్షి బసవయ్య లేచిరావయ్యా, గంగిరెద్దుల పాట, ఉప్పొంగి పోయింది గోదావరి / తెప్పున్న ఎగిసింది గోదావరి వంటి బాపిరాజు గీతాలు తెలుగు నాట ఆబాల గోపాలాన్ని ఉర్రూతలూగించినవే. నారాయణరావు తుఫాను, కోనంగి, నరుడు, జాజిమల్లి, గోనగన్నారెడ్డి వంటి నవలలు పాఠకులకు సుప్రసిద్ధాలు.

బాపిరాజు వ్యక్తిగా ఎంత మహోన్నతుడో, ఆయన కృషీ అంతే మహోజ్వలంగా సాగినట్టు సంపాదకులు నాగసూరి వేణుగోపాల్ తెలుపుతారు. సతతం (బాపిరాజు) సమస్యలతో పోరాడుతూనే ఇంత విలక్షణంగా, ఇంత విస్తృతంగా, ఇలా సాధన చేయడం అబ్బురమనిపిస్తుందని నాగసూరి వివరిస్తారు.



బాపిరాజు సాహసం గురించి ప్రతి ఒక్కరూ ఒక్క విషయం తప్పక తెలుసుకోవాలి. భూమి కోసం, భుక్తి కోసం పీడిత ప్రజ విముక్తి కోసం సాగిన మహత్తర సాయుధ తెలంగాణ రైతాంగ పోరాటంలో రజాకార్ల దాష్టీకానికి ఎందరో అసువులు బాసిన విషయం విదితమే. అమాయక ప్రజలపై, స్త్రీలపై వారు చేసిన దుర్మార్గాలు, పెట్టిన చిత్రహింసలు చెప్పనలవి కాదు. పద్మజానాయుడు ఆ వివరాలతో పెద్ద నివేదికను సిద్ధం చేసారు. దానిని నిజాం తెలుగు పత్రిక యధాతథంగా ప్రచురించింది. నిజాం ప్రభుత్వ ప్రచార శాఖ మాత్రం దానిని తీవ్రంగా ఖండిస్తూ ప్రకటన చేసింది.

బాపిరాజు సంపాదకత్వంలో వెలువడే 'మీజాన్' పత్రిక ఈ రెండింటినీ ప్రక్కప్రక్కనే ప్రచురించింది. నిజాం ప్రభుత్వం ఇది ఎడిటింగ్ పద్ధతి కాదని విమర్శిస్తే, అంతకంటే ఘాటుగా బాపిరాజు ప్రతి విమర్శ చేసాడు. '(నిజాం) ప్రభుత్వ శాఖలో పని చేసే ఉద్యోగులు నేర్పవలసిన దుస్థితిలో మా సంపాదకులు లేరని, జాబు రాసి, ఆ జాబును యథాతథంగా 'మీజాన్'లో ప్రచురించారు.

'నేను చాలా కాలం క్రిందట జాతీయోద్యమంలో చేరుటకు న్యాయవాద వృత్తిని మానేశాను. ఎవరైనా తమపై కోర్టు అభియోగాలు మోపితే 'మీజాన్' చేస్తున్న సేవలను నిరూపించడానికి మరల నల్లకోటు ధరించడానికి వెనుకాడను' అని బాపిరాజు సవాల్ విసరడం గమనార్హం. అదీ బాపిరాజు తెగువ, ధర్మదీక్ష. వారి శిష్యగణంలో ఒకరైన తిరుమల రామచంద్ర 'ఆదర్శ పత్రికా సంపదుకుడు'గా ఈ విషయాన్ని వ్యక్త పరుస్తారు.

ఎవరు కుంచె పట్టుకుని వచ్చినా, కలం పట్టుకుని వచ్చినా వారిని చిత్రకారునిగా, రచయిగా ప్రసిద్ధులయ్యే వరకు ఉచిత శిక్షణ ఇచ్చేవారు. 'ఎప్పుడూ ఆనందంతో ఊహల్లో స్వేచ్ఛగా విహరించడం, సౌందర్యాన్ని నిత్యం అన్వేషించడం, అనుభవాన్ని పంచి పెట్టడం, కష్ట సమయంలో ప్రేమతో భుజం చరచడం- ఇదీ బాపిరాజు జీవితం పట్ల అలవరచుకున్న దృక్పథం. ఈ దృక్పథం సమాజానికి ఎంతైనా అవసరం. కనుకనే 'జీవితాంతం త్రిదశత్వాన్ని అనుభవించిన అదృష్టశాలి'గా రాంభట్ల కృష్ణమూర్తి చెప్పారు.


'కవితా హృదయం ఉన్న ప్రతి ఒక్కరికి బాపిరాజు రచనలు చదివిస్తాయి. కొన్ని వందల పేజీలు ఉన్న ఆ నవలలు ఒక్క రవ్వ కూడా విసుగు కలిగించవు. మనోహరమైన వర్ణన సంభాషణలతో చమత్కారం, సౌందర్యాన్వేషణ ఆయన నవలల్లో కన్పిస్తాయి. మంచే తప్ప చెడును చూడలేని ఒక భావకుని ఊహా ప్రపంచం ఆయన నవలల్లో కన్పిస్తుంది. అందుకే ఆయన నాయికా నాయకులు దోష రహితులు. ఆదర్శ జీవులు. ప్రణయ గాథ ఉదాత్తంగా ఉంటుంది. వర్ణనలు జుగుప్స కనిపించవు. ఉత్తేజపరుస్తాయి. ఒక్క మాటలో చెప్పాలంటే కళను ఊహ నుండి వాస్తవానికి దించాడు బాపిరాజు.

'బాపిరాజు పాడింది కవిత్వం. గీసిందల్లా చిత్రలేఖనం' అని విశ్వనాథ వారంటే 'బాపిరాజు మధురమూర్తి' అని చలం ప్రశంసించాడు.

తెలుగు సంస్కృతి, సంస్కారం, సత్సంప్రదాయం బాపిరాజు సాహితీ కళా జగత్తు కృషిలో నవీన రూపంలో మూర్తీభవించాయి. బాపిరాజు వేసిన చిత్రాలను అర్థం చేసుకుని, సక్రమంగా విశ్లేషించగల ప్రతిభామూర్తి కానరాలేదని బుద్ధవరపు కామరాజు అంటారు.

> **ఎవరు కుంచె పట్టుకుని వచ్చినా, కలం పట్టుకుని వచ్చినా వారిని చిత్రకారునిగా, రచయిగా ప్రసిద్ధుదయ్యే వరకు ఉచిత శిక్షణ ఇచ్చేవారు. 'ఎప్పుడూ ఆనందంతో ఊహల్లో స్వేచ్ఛగా విహరించడం, సౌందర్యాన్ని నిత్యం అన్వేషించడం, అనుభవాన్ని పంచి పెట్టడం, కష్ట సమయంలో ప్రేమతో భుజం చరచడం- ఇదీ బాపిరాజు జీవితం పట్ల అలవరచుకున్న దృక్పథం.**

'నా బ్రతుకొక పళిమరార్ద్ర నందనోద్యానము' అని బాపిరాజే తన గురించి తానే స్వయంగా వ్యాఖ్యానించుకున్నారు. స్వీయ రచనలూ వీటిలో చోటుచేసుకున్నాయి.




- కె.శాంతారావు
9959745723

'ఆంధ్రదేశానికి తెలంగాణానికి మధ్య స్నేహ సంబంధాలు అభివృద్ధి గావించి ఈ రెండు ప్రాంతాలను దగ్గరగా తీసుకుని వచ్చుటకు ప్రయత్నించిన మిక్కిలి కొద్దిమంది సారస్వత ప్రతులలో బాపిరాజు ముఖ్యంగా లెక్కింపదగినవారని' దేవుల పల్లి రామానుజరావు కొనియాడారు.

'ద్వేషమేనా బ్రతుకుమార్గం / వేషమేనా సత్య రూపం / మోసమేనా నిత్యకర్మం / మూర్తి మంతులకన్' వంటి కవితా వచనలు నేటి రాజకీయ పరిస్థితులకూ అద్దం పడ్తాయి. "ఫోనిక్సు పక్షిలా కొత్తదవుతూ / కొత్త భావాల్ కొత్త రుచులూ కొత్త లోకం పుట్టి వచ్చే" - జ్వాలలు గేయం చారిత్రక ఆశావహ దృక్పథాన్ని చాటుతుంది.

బాపిరాజు భాష వ్యవహారిక భాష. ఈ వాడుక భాష పుష్టిగా, ఆరోగ్యంగా, ఏపుగా రచనల్లో ఎదుగుతూనే ఉంటుంది. హద్దులు, సరిహద్దులు, సంకెళ్లు, చావు ఈ భాషకు ఉండదని కామరాజు చెప్పారు.



యువకుడుగా బాపిరాజు రాజమండ్రి ప్రభుత్వ కళాశాలలో చేరి, ఆనాటి బ్రిటిష్ విద్యాధికారి ఆస్వాల్టు కూర్టేకు ప్రియ శిష్యుడయ్యాడు. 1920లో పట్టభద్రులయ్యే సరికి గాంధీ మహాత్ముని సహాయ నిరాకరణోద్యమంలో పూర్తి అంకిత భావంతో దుమికాడు. ఏడాది జైలు జీవితం అనుభవించాడు. కడతారు జైలుకు వెళ్ళాడు. తర్వాత బందరు జాతీయ కళాశాలకు కులపతిగా పనిచేశాడు. సినిమాలకు ఆర్ట్ డైరెక్టర్‌గా వ్యవహరించాడు.

నారాయణరావు నవలా నాయకుడు బాపిరాజు ప్రతిబింబంగా చెప్పుకుంటారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం నిర్వహించిన నవలా పోటీలలో విశ్వనాథ వేయిపడగల నవలతో సమానంగా ఈ నవల ప్రథమ బహుమతి పంచుకున్నది. కళా సేవలో తన్మయమైనా బ్రతుకుతెరువుకై నాలుగేళ్ళు న్యాయవాద వృత్తిని కూడా చేపట్టారు. ఎక్కడైనా ఏ పనిలోనైనా తన ముద్రను బలంగా నాటాడు.

బాపిరాజుకు ముగ్గురు పిల్లలు శిశు దశలోనే దక్కకుండా పోయారు. పెద్ద కూతురు రాధ వసంత పసి వయసులోనే మైలయిటిస్ వచ్చి రెండు కాళ్ళు పడిపోయాయి. ఆయన భార్య నరాల వ్యాధి బారిన పడి చచ్చిపోతాననే ఫియర్ కాంప్లెక్స్‌తో బ్రతికింది. ప్రక్కనే ఇంత కష్టతరమైన బ్రతుకును పెట్టుకుని నిత్యం కళామతల్లి సేవలోనే ఆనందతాండవంతో తరించడం బాపిరాజుకే చెల్లించింది.



తొలకరి పలకరింపు!

రోజూ ఒక కలగంటాను
నే రాసిన ప్రతి పద్యమూ
పాఠకుని ఎదలో ఇంకే
అదను చూసి కురిసే వాన చినుకు కావాలని!

అరవైకి పైగా వానా కాలాల్ని చూశాను
ప్రతి వానా కాలమూ
నన్ను ఆశ్చర్య పరిచే
మహా కవి సరి కొత్త కావ్యమే!

తొలకరి మొదలైతే చాలు
ఇప్పటికీ నాలో ఒక పులకింత
కక్ష కట్టిన ఎండా కాలం క్షణంలో
ఎవరో మంత్రించినట్లు మాయం!

ఎదలో దాచుకున్న
బాల్యపు స్మృతి కెరటాలన్నీ
కాగితప్పడవలేసుకునిజి
జీవన మాధుర్యాలను మోసుకొస్తాయి!

జిన జిన వాన కురుస్తున్నప్పుడు
గుడిసె హొటల్లో నుంచొని మిత్రుల్తో
వేడి వేడి ఛాయిని ఆస్వాదిస్తుంటే
ఆ అనుభూతిని ఏ పద్యమూ వ్యక్తం చేయలేదు!

వానలో తడవొద్దూ తడవొద్దని
మనసూ ఆమే ఒకటే గోల
నేను కవిని కదా నిలువునా తడవందే
ఈ మట్టి పరిమళం నన్నంటుకోదు!

పొలాన్ని తడిపిన తొలకరి పలకరింపు
పదునైన కవితా పాదం
నిత్యం ఈ లోకానికి
సరికొత్త పంటను వాగ్దానం చేస్తాయి!!

- కోట్ల వెంకటేశ్వర రెడ్డి
9440233261


ఈ దేశపు రైతు వాడు!

ఋతువు రాగానే వాడు బడి గేటు ముందు
బెత్తానికి వెరవని బడి పిల్లాడిలా
పురుగుల్ని చంపలేని రంగు రంగు
పురుగు మందు డబ్బాకొట్టు ముందు
బుద్ధిగా నిలబడే వట్టి పిచ్చిమారాజు వాడు
ఈ దేశపు రైతువాడు

తొలకరి చినుకుల చురకలు
ఆచ్ఛాదన లేని దేహంపై
పలకరిస్తే చాలు పులకరించి పోతూ
అయిసు బండి వెంట పరుగెత్తే పసివాడిలా
మొలకెత్తని విత్తనాల కొట్టు ముందు
పదే పదే వాలిపోయే వాడు
ఈ దేశపు రైతువాడు

దున్నుతూ - తడుపుతూ - తడుస్తూ
ఎండుతూ - వాడుతూ - ఒడ్డుతూ
నిరంతరం ఓడుతూ బతుకు బండి లాగేవాడు

పండిన రాజనాల్లాంటి గింజల్ని



పంది కొక్కుల గాదెల్లో నింపే
పాలకడల్లాంటి మార్కెట్ యార్డులో
యే రాతి తల్పం మీదో
ఎంతకూ రాని వంతుకోసం
వేచి వుండే క్షుధానల దగ్ధమూర్తి వాడు
లక్ష్మీదేవి దరిచేరని విష్ణుమూర్తి వాడు

అడిగితే లేదనకుండా ఇవ్వడమే తెలిసిన వాడు
భూమితల్లి శపించిన కర్ణుడు వాడు

అలగడం మరిచిపోయిన ధర్మరాజు వాడు
వంటి మీదే కాదు ఇంటి మీదే కాదు
పండిన పంట మీద కూడా
ఇంత ఆచ్ఛాదనకు నోచుకోని
నిరుపేద రారాజు వాడు

ఈ దేశపు వెన్నుముకని
నిటారుగా నిలబెట్టడం కోసం
రోజూ వెన్ను విరుచుకు పోరాడే భూమిలేని
భూమీశుడు వాడు

నిరంతరం ఓడిపోతూ కూడా
ఈ దేశపు బతుకు కోసం
అనుక్షణం చచ్చేవాడు

ఈ దేశపు మెతుకు కోసం
కాడిని శిలువలా మోస్తూ
తిరిగే రక్షకుడు వాడు

ఋతువు రాగానే పునరుత్థానం పొందే
దేవుడు వాడు
ఈ దేశపు రైతువాడు

- వి. విజయకుమార్, 555802596

2న 'దాహం.. దాహం..' ఆవిష్కరణ

పెన్నా రచయితల సంఘం ఆధ్వర్యంలో చిన్ని నారాయణరావు రచించిన 'దాహం.. దాహం..' దీర్ఘకవితా సంపుటిని జులై 2న ఆదివారం సాయంత్రం 6 గంటలకు నెల్లూరు టౌన్ హాలు (మిద్దెపైన)లో సుప్రసిద్ధ నవలా రచయిత్రి డా॥ పెళ్ళకూరు జయప్రద సోమిరెడ్డి ఆవిష్కరిస్తారు. ప్రముఖ సాహితీ విమర్శకులు డా॥మేడిపల్లి రవికుమార్, సుప్రసిద్ధ కవులు డా॥సుంకర గోపాలయ్య, శ్రీరామకవచం సాగర్, ఏటూరి నాగేంద్రరావు, నవమల్లెతీగ సంపాదకులు కలిమిశ్రీ అతిథులుగా పాల్గొంటున్న ఈ కార్యక్రమంలో పెన్నా రచయితల సంఘం అధ్యక్షులు అవ్వారు శ్రీధర్ బాబు పుస్తక సమీక్ష చేస్తారు. కార్యక్రమానికి ముందు కవి సమ్మేళనం వుంటుంది.

- పెన్నా రచయితల సంఘం

ప్రముఖ కవి పి శ్రీనివాస్ గౌడ్‌కు


కొత్తపల్లి నరేంద్రబాబు సాహిత్య పురస్కారం

సాహితీ వార్తలు

కొత్తపల్లి నరేంద్రబాబు సాహిత్య పురస్కారానికి ప్రముఖ కవి పి శ్రీనివాస్ గౌడ్ రచించిన చిన్ని చిన్ని సంగతులు సంపుటి ఎంపికైనట్టు నిర్వాహకులు ఓ ప్రకటన ద్వారా పేర్కొన్నారు. కవి సమ్మేళనం సాహిత్య వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీ విజేతకు త్వరలో అనంతపురంలో పురస్కారం అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

బలవంతమైన సర్పము - చలి చీమలు

అద్దురా బిడ్డా అంటే
గాడు బాజాప్తా సేత్తా అంటడు
అది మనసుంటోల్ల అచ్చి రాదురా
లచ్చలతోటి పని అంటే ఇనడు
సదువు సాత్రం ఉన్నోనివి
ఆ గజ్జి నీకెందుకురా అన్నగానీ
సెవుటోని ముంగట శంఖూదినట్టే...
లొల్లులు కొట్లాటలుంటయి
పురుగుదిని పుట్టలుందాంరా అంటే...
ఇంకెన్ని రోజులు కాకా
గీ గులాం గిరి అంటడు...
తోకెంబట నారాయణా అని
ఎన్ని దినాలు తిరుగుదం...
పచ్చనోట్లకు, తప్ప సీసాలకు
ఎందుకమ్ముడు పోవాలే...
మనోల్లే మస్తు మంది ఉన్నరు గాదే...
అందరం ఒక్కటైతే
ఏ టికెట్ అవుసురం లేదు...
ఊల్లె ఇరువై ఇండ్లు లేని గాల్లు
ఇరువై ఏండ్ల సంది ఏలవట్రి...
గాల్ల మోసేతి కింది నీళ్లు తాగుడు
ఓల్లకు సుతం మంచిది కాదు...
వారం రోజులు స్వర్గం జూపిచ్చి
అయిదేండ్లు నరకంల పారేత్తుండ్రు..
ఇప్పటికైనా కండ్లు తెరిసి
ఇగురం తోటి ఒక్కటైదాం
ఇంటింటికి తిరుగుకుంట
ఇదంతా ఇప్పి సెప్తాం...



ఇగ ఎన్నకు పోవుడు లేదు
నిలవడుడు నిలవడుడే..
అంటే...
ఇగ నేనేంజేత్త...గాని
ఎన్న నడ్సి జై అనుడే..
సలి సీమలమై
బలమైన సర్పమును సంపుడే..!

- అల్లాడి శ్రీనివాస్, 8341663982

కవితో అక్షర ప్రయాణం - 'దుర్గాపురం రోడ్'

మనిషి నిరంతర పథికుడు. కారణాలేవైతేనేమి పుట్టిన ఊరు, ప్రాంతం వదిలి, చదువు, ఉద్యోగరీత్యా ప్రయాణం జీవితంలో భాగమైంది. మరికొందరైతే దేశాన్ని వదిలి మరో సంస్కృతిలోకి ప్రవేశించి మరీ వెళ్లి పోతున్నారు. ఈ 'ఫ్లక్స్' మనల్ని నీడలా వెంటాడుతుంది. ఆధునిక సమాజంలో ప్రయాణం తప్పనిసరి పరిస్థితి. అది కూడా ఒక 'ఎగ్జిస్టెన్స్'. దేశరాజు 'దుర్గాపురం రోడ్' ఒక కవిత్వ ప్రయాణం. ఆయన వేళ్ళు ఉత్తరాంధ్ర మట్టిలో, అడవిలో, జనజీవన స్రవంతిలో, ఊపిరి పోసుకున్నాయి. అక్కడ ప్రోది చేసుకున్న సామాజిక స్పృహ, రాజకీయ చైతన్యం ఆయనకు స్థిరమైన పునాది. ఆపైన ఆయన ప్రయాణం ఒక పక్క బుద్ధి జీవునిగా మరొక పక్క ఎరుక (అవేర్నెస్) ఉన్న వ్యక్తిగా సాగింది.

స్వాతంత్రం వచ్చాక ఎవరినీ నిందించలేని 'స్వయం పరాయి దౌష్ట్యం' దేశాన్ని అతలాకుతలం చేయడం కళ్ళారా చూస్తూ, అదే వ్యవస్థలో బతుకుతున్న ఒక సంక్లిష్ట తరానికి దేశరాజు కూడా చెందు తారు. అంతలోనే సాంకేతికత లోహపు చక్రాల కింద, ప్రతి నాలుగేళ్లకు పదేళ్ల మార్పుల్ని చూస్తున్నాం. అందుకే రైలు పట్టాల మీద పెట్టిన రూపాయి బిళ్ళలాగా ఆ ఘర్షణ వేడికి రూపం మారిపోయినా, ఎలాగో కరిగిపోకుండా అస్తిత్వాన్ని కాపాడుకునే తరం మాది. ఈ హృదయాలకు గొంతుకనిచ్చే కవిత్వమే 'దుర్గాపురం రోడ్'.

"భూగోళం పై మనిషి ఉనికిని
చాటిన వారిని అభినందిద్దాం" అంటూ తన ఆంతర్యాన్ని వివరిస్తాడు ఈ కవి. దేశరాజు అక్షర ప్రేమికుడు. కవి అంటే అతడే కదా!

"మనం చేసిన నినాదమే
జైలు గోడల మధ్య
పలకరింపు అవుతుంది
మనం నమ్ముకున్న అక్షరమే
మన ఆశలకు కొమ్ము కాసి కటకటాలను ఛేదిస్తుంది" అని నమ్ముతారు. ఈయనకు 'ఫ్రాగ్మెంటేషన్' అవలీలగా వచ్చిన విద్య. మన కన్ను చూసే రూపమే సెకండ్‌కి 10 మిలియన్ బిట్స్. ఇక కవిగా ఈయన అంతర్నేత్రం ప్రతి చోటా దాగి ఉన్న దోపిడీ, అవినీతి అసమానత, అసంబద్ధతలను తన అక్షరాలలో దర్శింపచేయగల శక్తి కలవారు. అందుకే ఆ వాక్యాలు ప్రత్యేకంగా అనిపిస్తాయి.

"న్యాయవ్యవస్థ హిపోక్రసీకి
ఆసేతు హిమాచలం నిదర్శనం"

"తప్పుని కప్పిపుచ్చుకోవడం కాదు
సాహసవంతంగా చేయడమే
హీరో ఇజం అవుతున్న వేళ
ప్రభుత్వాధినేతలను అనాల్సిన పనిలేదు" అంటూ నిర్భయంగా ప్రకటిస్తాడు.

ఈనాడు మార్కెట్ వస్తు వినిమయం నుంచి మేధో వినిమయం దాకా విస్తరించింది. ఇప్పుడు అంతా అమ్మకాలు, కొనుగోళ్లు. అప్పుడెప్పుడో యంత్రాలను నడిపేందుకు కార్మికులను ఫ్యాక్టరీ సైరన్ పిలిచేదనీ, మనుషుల్ని ముఖాలుగా కాదు పనిచేసే చేతులుగా లెక్క వేసేదనీ మనం అనుకోక్కర్లేదు. ఇప్పుడు 'లాగిన్' సమయం ఇచ్చి, మేధను పెట్టుబడిగా చేసి, ఇంకోటి... మరోటి... అంటూ ఆలోచనలని, సత్తువని, సంపదని 'స్ట్రా' వేసి పీల్చేస్తోంది పోటీ ప్రపంచం.


అందుకు తోడు కుటుంబాన్ని, సమాజాన్ని, విజయవంతంగా ముక్కలు చేయడం ఈనాటి సాంకేతికత 'హాల్ మార్క్'. కానీ ఇది మనిషిని ఒంటరిని చేసి, బహు కొద్దిమంది ప్రయోజనాలకు మాత్రమే కారణమౌతోంది. అందువల్లే ఈనాడు ఎటు చూసినా 'ఖెయాస్' కనబడుతుంది.

"పోరాటమైనా, ప్రేమైనా
అలవాటు పడిపోవడం లోని
హింస ఇదంతా" అంటూ ఈ కవి దుఃఖ స్వరూప స్వభావాలను పాఠకుడికి ప్రజెంట్ చేస్తారు. అనేక సందిగ్ధ సందర్భాలను ఒక్కోసారి వైయక్తిక మైన వాటిని సైతం, ఓర్పుగా పునః పరిశీలించడమే కవి చేసే మహోపకారం. కవిత్వ రూపం, ఎక్స్ప్రెషన్ ఎలా ఉన్నా చదివినప్పుడు వచ్చే సహానుభూతి పాఠకుడిని తన చుట్టూ ఉన్న గందరగోళ స్థితిని తడిమి చూసుకుని, అన్నింటినీ పక్కకు తోసి, మళ్లీ లేచి నిలబడేందుకు లోదృష్టిని ఇస్తుంది.

"ఇక్కడ ఎవరూ తప్పిపోలేదు.. ఎవ్వరూ,
కేవలం కొన్ని వాన చినుకులు
తమ నల్లదనాన్ని అద్దుతున్నాయి నేలపై
స్ఫోటకం మచ్చల గచ్చు పై తెలుపు నలుపుల ఊగిసలాట"

చాలా రోజులు వెంటాడే వాక్యాలు ఇవి. అందుకే
"మనిషికి మనిషి ఎదురు పడటం కంటే
మనిషికి మనసు ఎదురైతే
పెద్ద ప్రళయమే ఎప్పుడైనా" అనే వివరణ కూడా ఇచ్చారు. దేశరాజు అటూ ఇటూ వీగిపోని సుస్పష్ట రాజకీయ స్పృహ కలిగిన వారు.

"చేష్టలు ఉడిగిన నిస్సత్తువ లోంచి
నువ్వు ఒక ఆయుధాన్ని కలగంటావు
ఎ ా డ ం
ఎదురుగా వచ్చి
కాల్చేసి నిశ్శబ్దంగా
వెళ్ళిపోతాడు.
ఎందుకంటే
నిన్ను నక్సలైట్ అనో,
తీవ్రవాది అనో అనాల్సిన అవసరం వాడికి ఇప్పుడిక లేదు"



ఫిబ్రవరి 2002 లో వ్రాసిన వాక్యాలు ఇవి. కవి దార్శనికతకు ఇంతకన్నా గొప్ప రుజువు ఏమి ఉంటుంది?

వ్యక్తి చుట్టూ తిరిగే అభివృద్ధిలో పొంచి ఉన్న స్వార్థం, స్వాతిశయం విశ్వమంతా వ్యాపిస్తే తప్ప అర్థం కాదు. నేడు దీన్నే సర్వస్వం అంటూ ప్రచారంలోకి తీసుకొచ్చారు. నిజానికి మానవ సమూహం మొత్తంగా ప్రగతి పథంలో నడవాలి అనే మేలుకొలుపు వాక్యం కదా కావాలి-అందుకే,

"ఓటమి విజయానికి తొలి మెట్టు" అనే వాక్యాన్ని సవరించి

"పోరాటమే విజయానికి తొలిమెట్టు" అని రచించారు కవి.

ఈయన కవితల్లో "అమ్మానాన్న ఒక సంప్రదాయ నాటకం"- 76వ పేజీ, "అచ్చు తప్పు"- 105 పేజీ - ఈ రెండు కాన్సెప్టును కవిత్వీకరించడంలో కొత్త పొంత తొక్కుతూ నవీనత కలిగి ఉన్నాయనిపించింది.

సిపాయి శ్రమను 'నిశ్శబ్దం'గా, కవి అస్తిత్వాన్ని "తురాయి చెట్టు మీద కాకి"గా కవితలుగా మలిచారు. ప్రతీకల్లో కొత్తదనం ఉన్నప్పటికీ కొరుకుడుపడనంత క్లిష్టంగా మటుకు లేవు.

కవిత్వానికి ప్రయోజనం ఉండాలా వద్దా అన్న మీమాంసను పక్కనపెడితే, ఎవరికి వారు ద్వీపాలుగా మారిన నేపథ్యంలో, సమాచార విస్ఫోటనంలో ఏది నిజమో, ఏది అబద్ధమో, తెలియని పరిస్థితుల్లో ప్రతి మనిషిని ఒక ఓటుగానో, ఒక పొటెన్షియల్ కస్టమర్ గానో, చూస్తున్న వేళ, దాగి ఉన్న నిజాలను వెలికి తీసి భ్రమలను పోగొట్టే శక్తి కవిత్వానికి మాత్రమే ఉంటుందని చెప్పొచ్చు.

అలా చూస్తే, "ఆదివాసి" 96 పేజీ, "మూగ పాట" 107 పేజీ కవితలు ఈ సంకలనానికి తలమానికం వంటివి. తమ ఐడెంటిటీని కోల్పోతున్న అడవి బిడ్డను, అవని బిడ్డను, ఈ కవితల్లో సాక్షాత్కరింప చేశారు. ఇందుకు దేశరాజు అభినందనీయులు.

- కాళ్ళకూరి శైలజ

పట్నం మహేందర్ రెడ్డిని కలిసిన

రామ్మోహన్ గౌడ్, మాజీ కార్పొరేటర్లు



నవతెలంగాణ-వనస్థలిపురం

ఎల్బీనగర్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జి ముద్దగౌని రామ్మోహన్ గౌడ్, మాజీ కార్పొరేటర్లు సామ రమణా రెడ్డి , జిన్నారం విటల్ రెడ్డిలు ఆదివారం శాసన మండలి సభ్యులు పట్నం మహేందర్ రెడ్డిని బంజారాహిల్స్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మహేందర్ రెడ్డి ఎల్బీనగర్ నియోజకవర్గం లోని రాజకీయ పరిస్థితులపై, ఇటీవల ఎల్బీనగర్ లో జరిగిన పలు సంఘటనలపై వారితో చర్చించారు. వారి వెంట చంపాపేట డివిజన్ పార్టీ నాయకులు మెట్టు వెంకట రెడ్డి ఉన్నారు.

మార్నింగ్ వాక్ లో కార్పొరేటర్ నవ జీవన్ రెడ్డి



నవతెలంగాణ-హయత్‌నగర్

మార్నింగ్ వాక్‌లో భాగంగా డివిజన్‌లోని డిఫెన్స్ కాలనీలో ఆదివారం కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు భూగర్భ డ్రైనేజీ, మ్యాన్‌హోల్, పలు చోట్ల భూగర్భ డ్రైనేజీ, మంచి నీటి పైప్ లైన్ సౌకర్యం లేకపోవడం వంటి పలు సమస్యలను కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన కార్పొరేటర్ అధికారులతో మాట్లాడి వీలైనంత త్వరగా సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

'శ్రీ బాలాజీ నగర్ కాలనీని ఆదర్శంగా తీర్చిదిద్దుతా'



నవతెలంగాణ- సంతోష్ నగర్

శ్రీ బాలాజీ నగర్ కాలనీని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని కార్పొరేటర్ జంగం శ్వేతా మధుకర్ రెడ్డి అన్నారు. ఐఎస్‌సదన్ డివిజన్ శ్రీ బాలాజీ నగర్ కాలనీలో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఆదివారం కార్పొరేటర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని అధికారులకు, కాంట్రాక్టర్లకు సూచించారు. త్వరితగతిన పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షులు జంగం మధుకర్ రెడ్డి, సీనియర్ నాయకురాలు రేణుక ముదిరాజ్, కాలనీ అసోసియేషన్ నెంబర్ ప్రెసిడెంట్ అశోక్ రెడ్డి, యాదయ్య, పర్వత్ రెడ్డి, శ్రీమాన్, కైలాష్ పార్టీ శ్రేణులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవలో విద్యార్థులు ముందుండాలి



• ఉప్పల శ్రీనివాస్ గుప్త

నవతెలంగాణ-నాగోల్

సమాజ సేవలో విద్యార్థులు ముందు ఉండాలని రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్, ఐవీఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్ గుప్త అన్నారు. నగరం లోని కర్మన్ఘాట్‌లో గల శ్రీ లక్ష్మీ కన్వెన్షన్ హాల్లో వైశ్య వికాస వేదిక అధ్యక్షులు, వీ3 ఛానల్ మేనేజింగ్ డైరెక్టర్ కాచం సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన 2022-23లో ఇంటర్, పదవ తరగతిలో మెరిట్ సాధించిన వైశ్య విద్యార్థుల సన్మాన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి విద్యార్థి కష్టపడి చదివి మంచి ఫలితాలతో రాణిస్తూ జీవితంలో స్థిరపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్తా, విజయ డైరీ చైర్మన్ సోమ భరత్ కుమార్, మాజీ చైర్మన్ అమరావతి లక్ష్మీనారాయణ, అడిషనల్ ఎస్పీ విజయ్, జెడ్పీటీసీ సభ్యులు ఉప్పల వెంకటేశ్వర్లు, ఆర్యవైశ్య నాయకులు, కార్యవర్గ సభ్యులు, మేధావులు, వక్తలు, తదితరులు పాల్గొన్నారు.

వెనుకబడిన వారిని ఆదుకోవడమే వాసవీ వనిత క్లబ్ లక్ష్యం



నవతెలంగాణ- చైతన్యపురి

ఆర్థికంగా వెనుకబడిన వారిని ఆదుకోవడమే వాసవీ వనిత క్లబ్ లక్ష్యం అని ఆ క్లబ్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ విశ్వనాథన్ శ్రీనివాస్, ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ బొమ్మన జ్యోతిలు అన్నారు. డాన్ టూ డస్క్ ప్రోగ్రాం లో భాగంగా ఆదివారం డాక్టర్స్ కాలనీలో పేదలకు నిత్యావసర వస్తువులు అందజేశారు. తర్వాత మాజీ సైనికుడు వెంకటయ్యను, ఎన్‌టీఆర్ నగర్‌కు చెందిన లక్ష్మి లకు ఆర్థిక సహాయం అందజేసి, శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాసవీ సరస్వతి పథకం ద్వారా నిరుపేద విద్యార్థులకు నోట్ బుక్స్, ఫీజులు చెల్లిస్తున్నట్లు తెలిపారు. వైద్య శిబిరాలు నిర్వహించి పేదలను ఆదుకుంటున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో వాసవీ వనిత క్లబ్ డాక్టర్స్ కాలనీ ప్రతినిధులు బి. లక్ష్మి, పి. లావణ్య, ఎస్ ధనలక్ష్మి, మల్లికార్జున, పద్మజ తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ ఎన్రోల్మెంట్ కేంద్రం ప్రారంభం



నవతెలంగాణ - మీర్ పేట్

మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 45వ డివిజన్ పరిధిలోని డైనమిక్స్ కాలనీ కమ్యూనిటీ హాల్లో కార్పొరేటర్ అక్కి మాధవి ఈశ్వర్ గౌడ్ ఆధ్వర్యంలో ఆధార్ ఎన్రోల్మెంట్ క్యాంప్ కేంద్రాన్ని ఆదివారం డిప్యూటీ మేయర్ తీగల విక్రమ్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధార్ కార్డు కొత్తగా తీసుకోవాలని అనుకున్న ప్రతీ ఒక్కరు ఈ ఆధార్ కేంద్రాన్ని ఉపయోగించుకోవాలన్నారు. నూతన ఆధార్ కార్డు, ఆధార్ కార్డులో కరెక్షన్స్, మొబైల్ లింక్, ఫోటో మార్పిడి ఇతర సేవలను అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ నెల 29వ తేది వరకు నాలుగు రోజుల పాటు అందుబాటులో ఉంటారని చెప్పారు. కనుక ప్రతీ ఒక్కరు ఈ సేవలను సద్వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకుడు దీప్ లాల్ చౌహన్, కాలనీ అధ్యక్షుడు వెంకట్ రావు, నర్సింహ చారి, నర్సింహ రావు, లక్ష్మణ రావు పాల్గొన్నారు.

ఎస్ఐ ప్రభాకర్ కుటుంబానికి అండగా తోటి ఎస్ఐలు



నవతెలంగాణ-హయత్ నగర్

దుండిగల్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న 2014 బ్యాచ్‌కు చెందిన ప్రభాకర్ రెడ్డి ఈ నెల 8న గుండెపోటుతో మరణించారు. ఈ మేరకు ఆదివారం 2014 బ్యాచ్ (టీఎస్-ఏ పీ)వెల్ఫేర్ సొసైటీ తరపున ప్రభాకర్ రెడ్డి బ్యాచ్ మేట్స్ అందరు కలిసి ఆయన కుటుంబ సభ్యులకు 25 లక్షల రూపాయల చెక్కును హయత్ నగర్ లోని అతని అత్తగారి నివాసంలో అందజేశారు. ఈ 25 లక్షల రూపాయలలో 20 లక్షలను ప్రభాకర్ రెడ్డి కూతురు అక్షయరెడ్డి(3 సం..) పేరు మీద మ్యూచువల్ ఫండ్స్ రూపంలో ఫిక్స్ డ్ డిపాజిట్ చేశారు. మిగతా 5లక్షల రూపాయలను ప్రభాకర్ రెడ్డి తల్లిదండ్రులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రభాకర్ రెడ్డి భార్య లక్ష్మి ప్రసన్న, తల్లిదండ్రులు, ప్రభాకర్ రెడ్డి అన్న దయాకర్ రెడ్డి(ఎల్బీనగర్ ఎస్ ఐ) 2014 బ్యాచ్ (టీఎస్,ఏ పీ) వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు టాటా శ్రీధర్, రామకృష్ణ, శ్రీనివాసులు, చందర్ సింగ్, ఇతర ఎస్ఐలు పాల్గొన్నారు.

ముగిసిన 8వ గ్లోబల్ ఫార్మస్యూటికల్ నాణ్యతా సదస్సు

నవతెలంగాణ-హైదరాబాద్ : ఇండియన్ ఫార్మస్యూటికల్ అలయెన్స్ 8వ గ్లోబల్ ఫార్మస్యూటికల్ నాణ్యతా సదస్సును విజయవంతంగా ముగించింది. భారత ప్రభుత్వం రసాయనాలు, ఎరువులు, ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖా మంత్రి డా.మనసుఖ్ మాండవీయ ఈ ముగింపు వేడుక సందర్భంగా తమ ఉప న్యాసం అందించారు. ఈ సదస్సు ఇతివృత్తము, పేషెంట్ కేంద్రితం, తయారీ, నాణ్యత కొత్త నమూనా. ఈ సదస్సును టోరెంట్ ఫార్మస్యూటికల్స్ చైర్మన్, ఐపీఏ ప్రెసిడెంట్ సమీర్ శర్మ ప్రారంభించారు. ప్రారంభోత్సవ సందర్భంగా భారత ప్రభుత్వం, ఫార్మస్యూటికల్స్ డిపార్ట్మెంట్ సెక్రెటరీ ఎస్. అపర్ణ ప్రధానోపన్యాసం గావించారు. ఈసందర్భంగా డా. మనసుఖ్ మాండవీయ మాట్లాడుతూ... నాణ్యత, పరిశోధన, అభివృద్ధి, వినూత్నత అనేవి నేటి తక్షణ కర్తవ్యాలుగా ఉన్నాయన్నారు. కోవిడ్-19 సందర్భంగా ఇండియా ధ్యేయ రూపంలో ఉండిందన్నారు. ప్రపంచానికి నాణ్యమైన మందులు, టీకాలను నిరంతరాయంగా సరఫరా చేసేలా చూసుకోవడం ద్వారా ప్రపంచ ఔషధశాలగా మనం ఎంతో కీలకమైన పాత్ర పోషించామన్నారు. ప్రపంచ సంక్షోభంలో, ఇండియా పరిపక్వతను, బాధ్యతను సమర్థవంతమైన నాయ%ం% "త్వాన్ని ప్రదర్శించిందన్నారు. నాలుగు ప్రధానమైన కోవిడ్ టీకా మందులను తయారు చేయడానికై దేశీయ, అంతర్జాతీయ గిరాకీని తీర్చడానికి గాను లాభానికంటే విధ్యుక్త బాధ్యతను ఎగువన ఉంచి ప్రభుత్వంతో పూర్తి స్థాయిగా కలిసి పనిచేసిన మన ఔషధ పరిశ్రమ దిగ్గజాలను కూడా తాను ఎంతగానో ప్రశంసిస్తున్నానన్నారు. ఇండియన్ ఫార్మస్యూటికల్ అలయెన్స్ సెక్రెటరీ జనరల్ సుదర్శన్ జైన్ మాట్లాడుతూ... ప్రపంచ వ్యాప్తంగా రోగుల ఆరోగ్య ఫలితాలను రూపుదిద్దడంలో భారతీయ ఔషధ తయారీ పరిశ్రమ ఒక కీలకమైన పాత్రను పోషిస్తోందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా నాణ్యతా భరోసాతో కూడిన, స్థోమతకు తగిన మందులను అందించుటలో భారతదేశం సుప్రసిద్ధి చెందిందన్నారు.

మర్చంట్ లెండింగ్ కోసం ఫోన్పే నుండి కొత్త వేదిక ఆవిష్కరణ

నవతెలంగాణ-హైదరాబాద్ : తన మర్చంట్ లెండింగ్ వేదికను ఆవిష్క రించడం ద్వారా 35 మిలియన్లకు పైగా మర్చంట్లతో తనకున్న విస్తృతమైన మర్చంట్ పునాదికి పూర్తిగా డిజిటల్, నిరంతరాయ పద్ధతిలో బ్యాంకులు, ఎన్ బీఎఫ్సీలు (నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీలు) రుణాలు ఇచ్చే వీలును కల్పించామని ఫోన్ పే ప్రకటించింది. ఇది చిన్న, మధ్య తరహా పరిశ్రమల కోసం ఆర్థిక సమ్మిళితత్వాన్ని ముందుకు నడపాలనే ఫోన్ పే నిబద్ధతతను పునరుద్ఘాటించింది. ఈ ఆవిష్కరణ గురించి సంస్థ ఆర్థిక సేవల విభాగం వైస్ ప్రెసిడెంట్ హేమంత్ గలా మాట్లాడుతూ... ఆర్థిక సమ్మిళితాన్ని ప్రోత్సహించడం అనేది ఫోన్పే కార్యాచరణ ప్రణాళికలో కీలక మన్నారు. మార్కెట్ ప్లేస్ నమూనాను ఉపయోగించి, మన వేదికపై మర్చంట్ లెం డింగ్ను ఆవిష్కరించడం తమకు ఉత్సాహంగా ఉందన్నారు. ఎస్ఎంఈలు, ఎంఎస్ ఎంఈలకు సంస్థాగత రుణాలను అందుబాటులోకి తెచ్చి, తద్వారా వాటి వృద్ధికి తోడ్పాటు అందించనున్నామన్నారు. ఎంఎస్ఎంఈ అండ్ ఎస్ఎంఈల ఆర్థిక సాధికా రత కోసం ఉత్ప్రేరకంగా పనిచేయడం ద్వారా సంపూర్ణ ఆర్థిక వృద్ధికి, నిలకడైన పురో గతిని ముందుకు నడపడానికి దోహదపడడం ఫోన్ పే గర్వంగా భావిస్తోందన్నారు.

పురాతన ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

• మంత్రి సబితా ఇంద్రారెడ్డి



నవతెలంగాణ- బడంగ్‌పేట్

సీఎం కేసీఆర్ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పురాతన దేవాలయాల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారని బ్రాహ్మణుల సంక్షేమానికి పెద్ద పీట వేస్తున్నట్లు రాష్ట్ర విద్యా శాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాలాపూర్ లోని అతి పురాతనమైన శ్రీ సంతాన వేణుగోపాల స్వామి దేవాలయాలంలో ఆదివారం మంత్రి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహేశ్వరం నియోజకవర్గంలోని 8 పురాతన దేవాలయాలకు రెండు విడతలుగా సుమారు రూ.8కోట్ల నిధులు మంజూరైనట్లు తెలిపారు. ఇప్పటికే నియోజకవర్గ కేంద్రంలోని శివగంగా దేవాలయం, తుక్కుగూడ మున్సిపాలిటీ ఫాబ్ సిటీ శ్రీ వెంకటేశ్వర, ఆర్‌కే పురం డివిజన్ లోని ఖిలా మైసమ్మ, తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధి లోని జన్నాయి గూడ శ్రీ లక్ష్మి నరసింహ్మా స్వామి, జిల్లెల గూడ శ్రీ వెంకేశ్వర స్వామి ఆలయాలకు కోటి రూపాయల చొప్పున మంజూరు చేయించి పనులు ప్రారంభించినట్లు మంత్రి తెలిపారు. అదే విధంగా గట్ పల్లి శ్రీ వీరంజనేయ స్వామి మందిరానికి కోటి రూపాయలు, ఉప్పగడ్డ తండా శ్రీ సేవాలాల్ మహరాజ్ గుడికి కోటి రూపాయల చొప్పున నిధుల విడుదల అయ్యాయన్నారు.

దేశంలోనే ఎక్కడా లేనివిధంగా యాదాద్రి టెంపుల్ ను పునర్నిర్మాణం చేసి భక్తులకు అందుబాటులోకి తెచ్చిన ఘనత సీఎం కేసీఆర్ కే దక్కుతుందన్నారు. మహేశ్వరం నియోజకవర్గంలో కూడా బ్రాహ్మణ పరిషత్ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసినట్లు మంత్రి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఇబ్రహీం శేఖర్, పార్టీ అధ్యక్షులు రామిడి రాంరెడ్డి, కార్పొరేటర్ ఏనుగు రాంరెడ్డి, కో ఆప్షన్ సభ్యులు రఘునందన్ చారి, నాదర్ గుల్ సహకార బ్యాంక్ డైరెక్టర్ చిగిరింత శ్రీరాంరెడ్డి, నాయకులు వంగేటి లక్ష్మారెడ్డి, ఎల్లారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, తిమ్మని గిరీష్, రాజు, వెంకటాపూర్ మాజీ సర్పంచ్ జగన్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ దండు గణేష్, జెనిగ శ్రీనివాస్, మాజీ ఉప సర్పంచ్ వెంకట్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రికెట్ క్లబ్ జట్టుకు ఎంపికైన నితీష్ తివారీ



నవతెలంగాణ -వనస్థలిపురం

బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ వైదేహి నగర్‌లోని విజన్ క్రికెట్ అకాడమీలో శిక్షణ పొందుతున్న ప్రణీత్ రెడ్డి టుడే లీగ్ మెగా సిటీ ట్రోఫీ, నితీష్ తివారీ.. విశాఖ క్రికెట్ క్లబ్ జట్టుకు సెలక్ట్ అయ్యాడు. ఈ సందర్భంగా బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ జీహెచ్ఎంసీ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి నితీష్ తివారీని ఆదివారం శాలువాతో సత్కరించారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ క్రీడలు దేహదారుఢ్యానికి దోహదం చేస్తాయన్నారు. ప్రతి క్రీడాకారుడు గెలుపోటములను సమానంగా స్వీకరించాలని సూచించారు. తర్వాత క్రీడాకారులకు క్రికెట్ బ్యాట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్రికెట్ కోచ్ సుధీర్ రెడ్డి, వీరాంజనేయ కాలనీ అధ్యక్షులు సత్యనారాయణ, ఉపాధ్యక్షులు రామయ్య తదితరులు పాల్గొన్నారు.

సోచ్ స్టోర్లు, ఆన్లైన్లో ఉత్సాహపూరితమైన ఆఫర్లు

నవతెలంగాణ-హైదరాబాద్ :: దేశంలో అతిపెద్ద అకేషన్, ఈవెనింగ్ వేర్ బ్రాండ్ సోచ్, అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న రెడ్ డాట్ సేల్ ప్రారంభించింది. ఈనెల 8 నుంచి సోచ్ స్టోర్ల వద్ద, ఆన్లైన్లో ఈ అమ్మకాలు ప్రారంభమయ్యాయి. ఈ సేల్లో భాగంగా ఆకర్షణీయమైన రీతిలో 50 శాతం వరకూ రాయితీని విస్తృతశ్రేణిలో చీరలు, సల్వార్ సూట్లు, కుర్తీలు, టునిక్స్, డ్రెస్ మెటీరియల్స్పై పొందవచ్చు. వేసవి సీజన్లో సోచ్ యొక్క తేలికపాటి, శ్వాసించ తగిన వస్త్రాలపై కూడా సోచ్ రెడ్ డాట్ సేల్ ఇప్పుడు ప్రత్యేకమైన రాయితీలను అందిస్తుంది. విస్తృతశ్రేణి ఉత్పత్తులపై ప్రత్యేకమైన రాయితీలను అందించడంతో పాటుగా ఈ వేసవిని మరింత అందంగా, ప్రత్యేకంగా మలుచుకు నేందు కు అనువుగా అద్భుతమైన డీల్స్ను అందిస్తుంది.

ప్రైమ్ సబ్స్క్రిప్షన్ను ఆవిష్కరించిన యాత్ర

నవతెలంగాణ-హైదరాబాద్ : యాత్ర ఆన్లైన్, ఇంక్. (నాస్ డాక్, యాత్ర), దాని భారతీయ అనుబంధ సంస్థ యాత్ర ఆన్లైన్ లిమిటెడ్ (యా) ద్వారా భారతదేశంలోని ప్రముఖ కార్పొరేట్ ట్రావెల్ సర్వీస్ ప్రొవైడర్, భారతదేశంలోని ప్రముఖ ఆన్లైన్ ట్రావెల్ కంపెనీలలో ఒకటైన యాత్ర, యాత్ర ప్రైమ్ని పరిచయం చేసింది. ఈసందర్భంగా యాత్ర ఆన్లైన్, ఇంక్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, డైరెక్టర్ ధృవ్ శృంగి మాట్లాడుతూ... తమ విలువైన సభ్యుల కోసం అనేక ప్రయోజనాలతో క రీడిన తమ ప్రత్యేక సబ్స్క్రిప్షన్ ఆఫర్ యాత్ర ప్రైమ్ను పరిచయం చేయడం తమకు చాలా ఆనందంగా ఉందన్నారు. ట్రావెల్స్ విభాగం కోవిడ్-పూర్వ స్థాయికి తిరిగి వస్తుందని, కస్టమర్లు అత్యున్నత సేవలు, చిరస్మరణీయ అనుభవాలు, బ్రాండ్లతో వ్యక్తిగతీకరించిన అనుబంధాలను చురుకుగా కోరుతున్నారన్నారు. ఈ అభివృద్ధి చెందుతున్న డిమాండ్లను అర్థం చేసుకుని, అసాధారణమైన ప్రయాణానికి భరోసానిస్తూ అసమానమైన విలువను, సౌకర్యాన్ని అందించడం ద్వారా వారి అంచనాలను అధిగమించాలని యాత్ర ప్రైమ్ లక్ష్యంగా పెట్టుకుందన్నారు. వేసవి ట్రావెల్ బుకింగ్ పెరుగుదల మధ్య, యాత్ర ప్రైమ్ వ్యక్తులందరికీ, ప్రత్యేకించి కుటు ంబాలతో ప్రయాణించే వారి ప్రయాణ అనుభవాలను గణనీయంగా మెరుగుపరుస్తుందన్నారు. కస్టమర్లు తమ బుకింగ్లపై తక్షణ పొదుపును ఆశించవచ్చని, వారి ప్రయాణాలకు మరింత విలువను జోడించవచ్చన్నారు.

నిఫ్టీ మైక్రోక్యాప్ 250 ఇండెక్స్ ఫండ్ ప్రకటించిన మోతీలాల్ ఓస్వాల్

నవతెలంగాణ-హైదరాబాద్ : మోతీలాల్ ఓస్వాల్ అసెట్ మేనేజ్ మెంట్ కంపెనీ ఇండియాలో మైక్రోక్యాప్ స్టాక్స్కు బహిర్గతాన్ని అందజేసే ఏకైక ప్యాసివ్ ఫండ్ అయిన మోతీలాల్ ఓస్వాల్ నిఫ్టీమైక్రోక్యాప్ 250 ఇండెక్స్ ఫండు ప్రకటించింది. ఈసందర్భంగా మోతీలాల్ ఓస్వాల్ అసెట్ మేనేజ్మెంట్ కంపెనీ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ నవీన్ అగర్వాల్ మాట్లాడుతూ... తాము ఇం డియాలో అనేక ప్యాసివ్ ఫండ్స్ మార్గదర్శకులుగా ఉంటున్నామన్నారు. తమ అత్యంత ఇటీవలి మైక్రోక్యాప్ ఆధారిత ఇండెక్స్ ఫండ్ ఆఫరింగ్ తమ విస్తృత శ్రేణి ప్యాసివ్ ఫండ్లను మరింత ముందుకు పొడిగిస్తుంది. మోతీలాల్ ఓస్వాల్ నిఫ్టీ మైక్రోక్యాప్ 250 ఇండెక్స్ ఫండ్ను ప్రారంభించడం ద్వారా తాము తమ విస్తృత ఆధారితమైన ఇండెక్స్ ఫండ్స్ ప్రస్తుత శ్రేణికి ప్రోత్సాహాన్నిస్తూ మదుపరులకు మోతీలాల్ ఓస్వాల్ నిఫ్టీ 500 ఇండెక్స్ ఫండ్ సహజ పొడిగింపును అందిస్తున్నా మన్నారు. మోతీలాల్ ఓస్వాల్ అసెట్ మేనేజ్మెంట్ కంపెనీ లిమిటెడ్, ప్యాసివ్ ఫండ్స్ అధిపతి ప్రతీక్ ఓస్వాల్ మాట్లాడుతూ... మోతీలాల్ ఓస్వాల్ నిఫ్టీ మైక్రో లిక్యాప్ 250 ఇండెక్స్ ఫండ్, ఈ వైవిధ్యమైన పెట్టుబడి విభాగం వెలికితీయని సమర్థత, అవకాశాలను వెలికితీయడంతో తాము ముందు నిలుస్తున్నామన్నారు. ఈ విభాగం, పరిశ్రమలో అనేకులచే నిర్లక్ష్యం చేయబడిన అపారమైన సంభావ్యత, విశిష్టమైన పెట్టుబడి అవకాశాలను కలిగి ఉందని తాము నమ్ముతున్నామన్నారు.

ఎస్పీఎఫ్ 40 పీఏ ప్లస్ ప్లస్ ప్లస్ సన్ స్క్రీన్ జెల్ని విడుదల చేసిన దీపిక పదుకోనె

నవతెలంగాణ-హైదరాబాద్ : : బాలీవుడ్ స్టార్, గ్లోబల్ ఇండియన్ ఐకాన్ దీపిక పదుకోనె మోడ్రన్ సెల్ఫ్ కేర్ బ్రాండ్ 82ఈ ద్వారా చర్మ సంరక్షణకు ఎంతో ఉపకరించే లికోరైజ్ బీమ్ ఎస్ పీఎఫ్ 40 పీఏ ప్లస్ ప్లస్ ప్లస్ సన్ స్క్రీన్ జెల్ని విడుదల చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ సన్ జెల్లో చర్మానికి రక్షణను అదించే సెరామైడ్స్ కలిగిన లికోరైజ్ ఉంటుంది. ఇది చర్మాన్ని పొడిబారకుండా కాపాడుతుంది. ఈసందర్భంగా 82ఈ చీఫ్ మార్కెటింగ్ అధికారి కీర్తన రామకృష్ణన్ మాట్లా డుతూ... ఈ 82ఈ తో అవసరం ఉన్నా లేకపోయినా అన్నింటికి కలిపి, ఒకే పరిమా ణానికి సరిపోయే విధంగా ఇంతకుముందు సన్ జెల్లు తయారయ్యేవని గుర్తించామన్నారు. అందుకే తాము లైకోరైస్ బీమ్ ను పరిచయం చేస్తున్నందుకు చాలా ఆనందంగా ఉందన్నారు. జిడ్డుగా మారిన చర్మానికి ఇది అద్భుతంగా పనిచేస్తుందన్నారు. ఇప్పుడు ఈ జెల్ను సన్స్క్రీన్ల ప్యాలెట్కు జోడించడం ఆనందంగా ఉందన్నారు. 82ఈ రీసెర్చ్ అండ్ హెడ్ అంజలి ఘోలప్ మాట్లాడుతూ... లైకోరైస్ బీమ్తో తాము సన్ జెల్ మాత్రమే కాకుండా చర్మా నికి పోషణ, కాంతిని అందించే సన్స్కిన్ ను రూపొందించాలనుకుంటున్నామని పేర్కొన్నారు. లైకోరైస్ బీమ్ ను తీవ్ర పరిశోధన, అభివృద్ధి అనంతరం తయారు చేశా మన్నారు. ఈ వినూత్నమైన, జిడ్డు లేని జెల్ని వినియోగదారులకు అందుబాటు లోకి తీసుకు వస్తున్నందుకు తాము సంతోషిస్తున్నామని తెలిపారు.

తెలంగాణ అభివృద్ధి కేసీఆర్‌తోనే సాధ్యం

• మంత్రి నిరంజన్ రెడ్డి



నవతెలంగాణ- సంతోష్ నగర్

తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి సీఎం కేసీఆర్‌తోనే సాధ్యమని వ్యవసాయ, సహకార శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. జాతీయ వ్యవసాయ మార్కెట్ తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్పర్సన్ అంగోత్ అనితా నాయక్ ఆదివారం మంత్రి నివాసంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర చరిత్రలో ఏ ప్రభుత్వం చేయని విధంగా తెలంగాణ ప్రభుత్వం..సీఎం కేసీఆర్ అన్ని వర్గాల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారని కొనియాడారు. ప్రజలు సీఎం కేసీఆర్ ఆదరిస్తున్నారని మంత్రి తెలిపారు. వ్యవసాయ దారులకు అండగా, రైతన్నకు నేనున్నానంటూ భరోసా, 24 గంటలూ ఉచిత కరెంటు, వ్యవసాయ మార్కెట్లో అధిక ధరతో కొనుగోలు, మార్కెట్లు ఏర్పాటు చేయడం కేసీఆర్‌తోనే సాధ్యమన్నారు. కొట్లాడి సాధించుకున్న తెలంగాణను బంగారు తెలంగాణగా తీర్చిదిద్దడంలో సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో స్థానికులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రెసిడెన్షియల్ స్కూల్స్‌తో విద్యార్థులకు ఎంతో మేలు

• మాజీ డీజీపీ మహేందర్ రెడ్డి



నవతెలంగాణ-సిటీబ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం ప్రతి జిల్లా, మండలాల్లో రెసిడెన్షియల్ స్కూల్స్‌ను తీసుకురావడం వలన విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందని మాజీ డీజీపీ మహేందర్ రెడ్డి అన్నారు. లక్డికపూల్‌లోని ఎంఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రతిభ ఉన్న పేద విద్యార్థులకు చేయూత అందించేందుకు ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని కోరారు. పేద విద్యార్థులకు ఎంఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. పదో తరగతి, ఇంటర్‌లో 90 శాతం పైగా మార్కులు సాధించిన 300 మంది పేద విద్యార్థులకు ఎంఎస్ఆర్ ట్రస్ట్ రూ.10వేల ఆర్థిక సహాయం అందజేసినట్లు తెలిపారు. తర్వాత ప్రభుత్వం అందించిన ఆర్థిక సాయంతోనే విద్యాభ్యసం చేశానని మహేందర్ రెడ్డి అన్నారు. పీవీ నరసింహారావు స్థాపించిన గురుకుల పాఠశాల్లో చదువుకోవడం తన జీవితానికి ఒక పెద్ద మలుపు అని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ గురుకుల ప్రాధాన్యతను గుర్తించి.. వాటిని ఏర్పాటు చేయడం వలన అనేక మంది పేద, గ్రామీణ విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని వివరించారు.

ట్రస్ట్ వ్యవస్థాపకులు శివారెడ్డి మాట్లాడుతూ ఎంఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ప్రతీ ఏడాది కోటీ రూపాయలను 500 నుండి 1000 మంది పేద విద్యార్థులకు అందించాలన్నదే తన ధ్యేయమని అన్నారు. 90 శాతం పైగా మార్కులు వచ్చిన పేద విద్యార్థులు.. పై చదువుల కోసం ఎంఎస్ఆర్ ట్రస్ట్‌ను సంప్రదించాలని కోరారు. తొమ్మిది ఉమ్మడి జిల్లాలకు చెందిన విద్యార్థులు దీనికి అర్హులు అని తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఉన్న వారికి ఉచిత విద్య... పేదల ఆకలి తీర్చడం..పేదలకు సాయమందించడమే సంస్థ ప్రధాన లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ వ్యవస్థాపకులు శివారెడ్డి, ట్రస్ట్ సహ వ్యవస్థాపకులు శిరీషరెడ్డి, ధనుష్‌రెడ్డి పాల్గొన్నారు.

100,000కు పైగా పార్టిసిపెంట్లకు మెరుగైన ఉపాధిని కల్పించడం లక్ష్యంగా గ్రేట్ హెన్ఆర్

నవతెలంగాణ-హైదరాబాద్ : గ్రేట్ హెస్ఆర్ అకాడమీ ప్రారంభించిన కొత్త కోర్సులు 100,000కు పైగా పార్టిసిపెంట్లకు మెరుగైన ఉపాధిని కల్పించడం లక్ష్యంగా పెట్టుకున్నాయి. 1,00,000కు పైగా యువ నిపుణులు, విద్యార్థులను సర్టిఫై చేసే లక్ష్యంతో గ్రేట్ హెచార్ అకాడమీ కొత్త కోర్సులను ప్రారంభించినట్లు ప్రకటించింది. ఈసందర్భంగా గ్రేట్ హెచార్ సీఈఓ, సహ వ్యవస్థాపకుడు గిరీష్ రౌజీ మాట్లాడుతూ... గ్రేట్ హెచర్ అకాడమీ గొప్ప మార్పులో భాగమైనందుకు తాను అపారమైన గర్వంతో, ఆనందంతో నిండిపోయానన్నారు. ఇది హెచర్ శిక్షణను అందించడానికి ఒక గొప్ప ప్రయత్నంగా ప్రారంభిచబడిందన్నారు. ఇప్పుడు కీలకమైన విద్యా కార్యక్రమంగా అభివృద్ధి చెందిందన్నారు. సాధికారత సానుకూల మార్పునకు కానీ దారితీస్తుందని, తాను దృఢంగా విశ్వసిస్తున్నానన్నారు. పరిశ్రమ-నిర్దిష్ట ఉద్యోగ పాత్రల కోసం విద్యార్థులు, హెచార్ నిపుణులు ఎలా సిద్ధం అవుతారో సానుకూలంగా ప్రభావితం చేయడానికి తమ అకాడమీ సిద్ధంగా ఉందన్నారు.

'ఏఐఎస్ఎఫ్ శిక్షణ తరగతులు జయప్రదం చేయండి'



నవతెలంగాణ-హయత్ నగర్

ఈ నెల 26, 27, 28 తేదీలలో జరిగే అఖిల భారత విద్యార్థి సమైక్య రాష్ట్ర స్థాయి శిక్షణా తరగతులను జయప్రదం చేయాలని రంగారెడ్డి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శివ, క్రాంతిలు కోరారు. హయత్ నగర్ మండల కార్యాలయం ఆవరణలో ఆదివారం కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యార్థుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించాయన్నారు. కేంద్రంలోని బీజేపీ నూతన విద్యా విధానాన్ని తీసుకొచ్చి.. విద్య ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ, కాషాయీకరణ చేయడానికి కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బోడుప్పల్ బీఆర్‌కే కన్వెన్షన్ హాల్లో ఏఐఎస్ఎఫ్ రాష్ట్రస్థాయి రాజకీయ శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

గురునానక్ ఇంజినీరింగ్ కళాశాలలో 4000 మంది విద్యార్థులకు అన్యాయం జరిగినా ప్రభుత్వ అధికారులు చర్య తీసుకోక పోవటం సిగ్గు చేటని, వారికి న్యాయం జరిగే వరకూ పోరాడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి వంశీ వర్ధన్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు అరుణ్ కుమార్, నాయకులు ఉపేందర్, బన్నీ, భాను తదితరులు పాల్గొన్నారు.

'అక్రమ కట్టడాలను తొలగించాలి'



నవతెలంగాణ- సంతోష్ నగర్

అక్రమ కట్టడాలను తొలగించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం హైదరాబద్ కలెక్టర్, ఆర్‌డీవో, సైదాబాద్ మండల తహసీల్దార్లకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ సీనియర్ నాయకులు శంకర్ నాయక్ మాట్లాడుతూ కోర్టులో కేసు పెండింగులో ఉన్న రౌద్రీ సొసైటీ వారు సింగరేణి వాంబే కోటర్స్ పక్కన అక్రమంగా కట్టడాలను నిర్మిస్తున్నారని ఆరోపించారు. ఎన్నో అడుగులకు భూమిని తొవ్వుతున్నారన్నారు. దీని వలన అక్కడ నివసిస్తున్న దాదాపు 2000 కుటుంబాలకు ప్రమాదం ఉందన్నారు. అదేవిధంగా లారీలు ఇష్టానుసారంగా రోడ్డుపై మటి పడుతుందన్నారు. దీంతో చిన్న పిల్లలు, వృద్ధులు రోడ్డు దాటాలన్న భయంతో ఉన్నారన్నారు. ఉదయం పూటనే పెద్ద లారీలు చిన్న రోడ్డు పై నడిపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విధంగా ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న.. అదేవిధంగా కోర్టును ధిక్కరిస్తూ అక్రమంగా అపార్టమెంట్లు నిర్మిస్తున్న రౌద్రీ సొసైటీ, కట్టడాలకు సహకరిస్తున్న వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలనీ కోరారు. ఈ కార్యక్రమంలో షేక్ మహమూద్ సీపీఐ, ఐ.ఎస్.సదన్. డివిజన్ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఐసీ కాలనీలో క్రిశాంక్ బస్తీ నిద్ర కార్యక్రమం



నవతెలంగాణ-కంటోన్మెంట్

తిరుమలగిరి ఏడో వార్డు ఎల్ఐసీ కాలనీలో ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు రాష్ట్ర మినరల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మెన్ మన్నె క్రిశాంక్ శనివారం రాత్రి 14వ బస్తీ నిద్ర కార్యక్రమం నిర్వహించారు. భారీ వర్షాలు కురుస్తున్నప్పటికీ 500 మంది బస్తీ నిద్ర కార్యక్రమానికి వచ్చి వారి సమస్యలు చెప్పారు. ఈ కార్యక్రమంలో బోర్డ్ మాజీ సభ్యుడు పి.శ్యామ్ కుమార్ పాల్గొని స్థానికులు తెలిపిన సమస్యలు తెలుసుకున్నారు. బస్తీలో కమ్యూనిటీ హాలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరారు. అలాగే పింఛన్లు, దళిత బంధు ఇప్పించాలని కూడా స్థానికులు కోరారు అనంతరం క్రిశాంక్ ,శ్యాం కుమార్‌లు కార్యక్రమంలో పాల్గొన్న వారితో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. నందు, శ్రీను, ఈశ్వర్, బీ రాజు, లక్ష్మమ్మ, ఆనంద్, సునీత, డీ వెంకటేష్, రాజు, సాయి, రఘు, శేఖర్, బాబు, యువరాజ్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-మల్కాజిగిరి

ఈస్ట్ ఆనంద్ భాగ్ డివిజన్ పరిధిలోని పీవీఎన్ కాలని సాయి బాబా దేవాలయం దగ్గర రూ. 20 లక్షలతో సీసీ రోడ్డు పనులను ఎమ్మెల్యే మైనం పల్లి హన్మంత రావు కార్పొరేటర్ వై ప్రేమ్ కుమార్‌తో కలిసి ఆదివారం ప్రారంభిం చారు.. కార్యక్రమంలో ఏఈ శ్రీకాంత్,వర్క్ ఇన్‌స్పెక్టర్ రజినీ కాంత్, నాయకులు డివిజన్ అధ్యక్షుడు సత్యమూర్తి, బాబు, సత్యనారాయణ, సంపత్ రావు, ఉమాపతి, బ్రమ్మయ్య శంకర్ రావు, పోచయ్య భాస్కర్, బిక్షపతి, రవి, వేముల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

జవహర్‌నగర్‌ను మార్చిన ఘనత సీఎం కేసీఆర్‌దే..

- దేశమంతటా బీఆర్ఎస్ నినాదమే
- కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి
- జవహర్ నగర్‌లో ప్రగతి పనులకు శంకుస్థాపన



నవతెలంగాణ-జవహర్‌నగర్

స్వచ్ఛమైన జవహర్‌నగర్‌గా మార్చిన ఘనత సీఎం కేసీఆర్‌కు దక్కుతుందని కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. దేశమంతటా బీఆర్ఎస్ నినాదమే వినిపిస్తోందని, తెలంగా ణలో జరుగుతున్న అభివృద్ధిని చూసి దేశ ప్రజలు అబ్బురపడుతున్నారని, వారి రాష్ట్రాల్లో కూడా తెలంగాణలోని పథకాలు అమలు చేయాలని కోరుకుంటున్నారని అన్నారు. జవహర్ నగర్ కార్పొరేషన్‌లోని 14, 13, 12, 27, 11, 10, 22, 09, 20, 05 డివిజన్లలో రూ. 9 కోట్లతో చేపట్టనున్న ప్రగతి పనులకు మేయర్ మేకల కావ్య, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్‌లతో కలిసి ఆదివారం అండర్ గ్రౌండ్ డ్రయినేజీ, సీసీ రోడ్డు పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అభివృద్ధే పరమావధిగా తెలంగాణ ప్రభుత్వం పనిచేస్తుందని తెలి పారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిపెట్టిన చెత్త కుంపటితో జవహర్ నగర్ ప్రజలు నష్టపోయారని, కలుషితమైన నీటితో, దుర్వాసనతో ఉక్కిరిబిక్కిరయ్యారని తెలిపారు. రూ.500 కోట్లతో చెత్త కుంపటి నుంచి దుర్వాసన, రసాయనాలు రాకుండా లీచెట్ వంటి కొత్త టెక్నాలజీతో జవహర్ నగర్‌ను స్వచ్ఛమైన జవహర్‌నగర్‌గా మార్చిన ఘనత సీఎం కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. మిషన్ భగీరథ నీటితో కార్పొరేషన్‌లోని ప్రతీ ఇంటికి మంచినీరు అందించడంతోనే ప్రజల ఆరోగ్యాలు బాగుపడ్డాయని తెలిపారు. దేశంలో ఇంత పెద్ద ఎత్తున అభివద్ధి. సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టిన ముఖ్యమంత్రి ఎవరూ లేరని, సీఎం కేసీఆర్ దమ్మున్న ముఖ్యమంత్రి అని పేర్కొన్నారు. అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించేందుకు వచ్చిన మంత్రి మల్లారెడ్డికి ప్రతి డివిజన్‌లో ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ఏకే మురుగేష్, శారదామనోధర్‌రెడ్డి, జిట్టా శ్రీవాణిశ్రీనివాస్ రెడ్డి, కుతాడి శ్రీకాంత్, సంగీతారాజశేఖర్, మునిగల సతీష్ కుమార్, గండి రాంచందర్, లక్ష్మీకష్ణగౌడ్, రవి, సాయి, మేక లలితాయాదవ్, లావణ్యసతీష్ గౌడ్, కోఆప్షన్ సభ్యులు, బీఆర్ఎస్ స్థానిక అధ్యక్షుడు కొండల్ ముదిరాజ్, మున్సిపల్ సిబ్బంది, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మారిన తుమ్మ చెట్టు

- అల్వాల్ నుంచి లోతుకుంట వెళ్లే దారిలో వంగిపోయి ఉన్న చెట్టు



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

అల్వాల్ నుంచి లోతుకుంట వెళ్లే దారిలో ఓ తుమ్మ చెట్టు ప్రమాదకరంగా మారింది. ఒక వైపునకు వంగిపోయి ఉండడంతో ఎప్పుడు కింద పడుతుందోనని దారిన వెళ్ళే ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. అసలే, ఇది హైవే రోడ్డు. నిత్యం ఈ రోడ్డు పై తమ పనులు నిమిత్తం ప్రజలు రాక పోకలు సాగిస్తుంటారు. దాంతో వేల సంఖ్యలో వాహనాలు తిరుగుతూ ఈ రోడ్డు రద్దీగా ఉంటుంది. అసలే ఇది వర్షా కాలం...ఈదురు గాలులు ,ఉరుములు, మెరుపులతో వానలు బాగానే కురుస్తు న్నాయి. వంగి పోయి ఉన్న ఈ భారీ వక్షం ఎప్పుడు నేలరాలి పడుతుందో, ఏ ప్రమాదం తెచ్చి పెడుతుందోనని భయం భయంగా తమ వాహనాలు నడుపు కుంటూ వెళ్తున్నారు వాహనదారులు. ఇకనైనా పొంచి ఉన్న ఈ ప్రమాదం గుర్తించి ఎలాంటి ప్రమాదం జరగకముందే చర్యలు తీసుకోవాలని స్థానికులు, పలువురు వాహన చోదకులు, పాదచారులు కోరుతున్నారు.

శ్రీ శ్రీనివాస ఆఫీసర్స్ కాలనీ అభివృద్ధికి కృషి చేస్తా

- ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి



నవతెలంగాణ-కాప్రా

కాప్రా శ్రీ శ్రీనివాస ఆఫీసర్స్ కాలనీ అభివృద్ధికి అవసరమైన రోడ్లు, విద్యుత్ ,డ్రయినేజీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే నివాసంలో ఆదివారం కాప్రా శ్రీనివాస ఆఫీసర్స్ అసోసియేషన్ కమిటీ అధ్యక్షులు ఎస్. చంద్రమౌళీశ్వర రావు, ప్రధాన కార్యదర్శి ఏ.భాస్కర్ రెడ్డి, కోశాధికారి శంకర్రావుతో పాటు కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంబంధిత అధికారులతో మాట్లాడి సమ స్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు చంద్రమౌళి, ప్రధాన కార్యదర్శి భాస్కర్ రెడ్డి. కోశాధికారి శంకర్రావు. ఉపాధ్యక్షులు కష్ణారెడ్డి. కల్పనా కృష్ణారెడ్డి, సహాయ కార్యదర్శి ఎం సుబ్బా రావు, టి ఇంద్రారెడ్డి ఎస్ కొండల్ రెడ్డి లను సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ కాప్రా డివిజన్ అధ్యక్షులు మహేందర్ రెడ్డి పాల్గొన్నారు.

'జీవన పోరాటంలో.. జీవిత కథల సంకలనం' ఆవిష్కరణ

- పుస్తకాన్ని ఆవిష్కరించిన అడిషనల్ కలెక్టర్



నవతెలంగాణ-కాప్రా

తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో సౌత్ కమలానగర్ వెల్ఫేర్ అసోసియేషన్ హాలు లో జీవన పోరాటంలో.. జీవిత కథల సంకలనం ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా అడిషనల్ కలెక్టర్ ఏనుగు నరసింహారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఎస్ ఏ రహీం అధ్యక్షత వహించారు. సమావేశానికి హాజరైన వారిని వేదికపైకి గగన్ కుమార్ ఆహ్వానించారు. సమావేశానికి ప్రారంభ సూచికగా గురజాడ అప్పారావు రచించిన దేశభక్తి గీతాన్ని రుక్కయ్య ఆలపించారు. ఎస్ ఏ రహీం మాట్లాడుతూ.. సామాన్యుల జీవిత కథలు కూడా రాయవచ్చని తమకు స్ఫూర్తి గ్రూపు ప్రోత్సహించి నడిపించడం వలన ఈ పుస్తకం మీ ముందుకు వచ్చిందని తెలిపారు. అందరూ చదవాలని కోరారు.

అనంతరం అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ ఇటువంటి ప్రక్రియ చాలా అరుదుగా జరుగుతుందని.. ఇంతమంది తమ జీవితాలను కథలుగా అని కాకుండా పూర్తిగా యదార్థంగా రాశారని చెప్పారు. దీనికి బాధ్యుడు గుర్రం జాషువా.. చాలా గొప్పగా రాసి ప్రసిద్ధికెక్కారని చెప్పారు. ఇందులో ప్రతీ కథను చదవటం జరిగిందని, ముఖ్యంగా జ్యోతి తన జీవితాన్ని అద్భుతంగా ధైర్యంగా గొప్పగా చెప్పారని కొనియాడారు. అలాగే అనేక కథలోని సారాంశాన్ని వివరించి ఇది మంచి ప్రయత్నం అని చెప్పారు. ఇటువంటి కథల వలన ఆనాటి సామాజిక పరిస్థితులను అర్థం చేసుకోవచ్చని తెలిపారు. తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం కన్వీనర్ రాములు మాట్లాడుతూ ఎందరో ఆచరణలో పెట్టాలని ప్రయత్నిస్తారని కానీ స్ఫూర్తి గ్రూపు ప్రాప్తమే కాకుండా ఆచరించటం ఇటువంటి గొప్ప పుస్తకాన్ని తీసుకురావడం ఎంతో ప్రయోజనకరమని చెప్పారు. భూపతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఈ పుస్తకాన్ని చదివిన చాలా మంది ప్రముఖులు అరుదైన పుస్తకంగా వర్ణించారని చెప్పారని అన్నారు. పీ జ్యోతి మాట్లాడుతూ ఇందులో రాసిన ప్రతీ ఒక్కరు నిజాయితీతో నిబద్ధత క్రమశిక్షణతో జీవించిన విధానం చాలా గొప్పదని, అందులో నా జీవితంలో అంశాలను కూడా పుస్తకంలో రాయటం ఎంతో గర్వకారణంగా ఉందని చెప్పారు. అంతేకాకుండా పీబీ చారి రాసిన ప్రముఖ విజ్ఞాన వేత్త పద్మభూషణ్ డాక్టర్ ఎస్ రావు జీవితం ముందుగా ఉండటం, వారి కథకు సరసన తమ అందరి కథలు ఉండటం ఎంతో గౌరవాన్ని తెచ్చిపెట్టిందని చెప్పారు. కార్యక్రమంలో భాగంగా రచయితలు అందరికీ చేనేత కండువాలతో ఆత్మీయ సత్కారాన్ని అడిషనల్ కలెక్టర్ చే గౌరవించారు. అడిషనల్ కలెక్టర్‌ను భూపతి వెంకటేశ్వర్లు, జ్యోతి , ఆత్మీయ సత్కారం చేనేత కండువాతో చేశారు. 21 మంది రచయితలు మాట్లాడిన వీడియో రికార్డింగ్‌ను ప్రొజెక్టర్ ద్వారా ప్రదర్శించారు. అనంతరం అభ్యుదయ ఆర్ట్స్ ఈసీఐఎల్ వారిచే కలహాల కాపురం హాస్య నాటికను ప్రదర్శించారు. కార్యక్రమంలో 150 మంది పైగా పాల్గొన్నారు. శ్రీ జంపాల శ్రీమన్నారాయణ వందన సమర్పణ చేయటంతో సభా కార్యక్రమం ముగిసింది. కార్యక్రమంలో కోమటి రవి, ప్రసాద్ బాబు, జి శివరామకష్ణ నాగయ్య, వెంకటసుబ్బయ్య, ప్రముఖ కవి రాధశ్రీ గారు, ఆచార్యులు, రామి శెట్టి చైతన్య, గగన్ కుమార్, బంగారు నర్సింగరావు, మల్లేశం, పాష, పిల్లి వెంకటేశ్వర్లు, సురేష్, జయప్రకాష్, రుక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

నగరంలో వర్షాలు..
అప్రమత్తమైన జీహెచ్ఎంసీ అధికారులు

నవతెలంగాణ-సిటీబ్యూరో

నైరుతి రుతుపవనాలు రాష్ట్రవ్యాప్తంగా విస్తరించాయి. రాగల రెండు రోజుల పాటు రాష్ట్రంతోపాటు హైదరాబాద్‌లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని వివరించింది. ఈ క్రమంలో జీహెచ్ఎంసీ అధికారులు అప్రమత్తమయ్యారు. ఆదివారం నగరంలో పలు ప్రాంతాల్లో జల్లులు కురిసిన నేపథ్యంలో జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్, డీ.ఆర్.ఎఫ్ టీంలను మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అప్రమత్తం చేశారు. పగలు అంతా సాధారణ పరిస్థితి ఉన్నా సాయంత్రానికి వాతావరణం మారుతుందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు.



జస్టిస్ ఏ. సంతోష్ రెడ్డికి ఘన సన్మానం

నవతెలంగాణ-సిటీబ్యూరో

రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తిగా పదవీ విరమణ ను పురస్కరించుకుని జస్టిస్ ఏ. సంతోష్ రెడ్డిని తెలంగాణ న్యాయమూర్తుల సంఘం, న్యాయమూర్తుల హౌసింగ్ సొసైటీ ఘనంగా సన్మానించారు. హైదరాబాద్‌లోని లక్డీకపూల్‌లోని ఓ హోటల్‌లో తెలంగాణ న్యాయమూర్తుల సంఘం అధ్యక్షులు నందికొండ నర్సింగ్ రావు అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. న్యాయమూర్తుల సంక్షేమం కోసం, న్యాయమూర్తుల సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా జస్టిస్ సంతోష్ రెడ్డి చేసిన సేవలను పలువురు న్యాయమూర్తులు కొనియాడారు. ఈ సందర్భంగా జస్టిస్ ఏ. సంతోష్ రెడ్డి 32 సంవత్సరాల పాటు వివిధ హోదాలలో న్యాయమూర్తిగా పనిచేసారని, మేజిస్ట్రేట్ కోర్టు నుంచి జిల్లా కోర్టు న్యాయమూర్తిగా, న్యాయశాఖ కార్యదర్శిగా, తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ సభ్య కార్యదర్శిగా, తెలంగాణ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం న్యాయమూర్తిగా గొప్ప సేవలు అందించారని , ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ న్యాయమూర్తుల సంఘం లో పలు బాధ్యతలు చేపట్టి రాష్ట్ర న్యాయమూర్తుల సంఘం అధ్యక్షులుగా సమర్థవంతంగా పనిచేసి న్యాయమూర్తులు ఎదుర్కొనే అనేక సమస్యలపై ఎంతో కృషిచేసి న్యాయమూర్తుల అభ్యున్నతికి కృషి చేశారని వక్తలు అన్నారు. వేద పండితుల ఆశీర్వచనంతో ప్రారంభమైన కార్యక్రమంలో తెలంగాణ న్యాయమూర్తుల హౌసింగ్ సొసైటీ ఉపాధ్యక్షులు తిరుపతి, కార్యదర్శి జీవన్ కుమార్ రాష్ట్ర న్యాయమూర్తుల సంఘం ఉపాధ్యక్షులు కే ప్రభాకర్ రావు, సుదర్శన్, న్యాయమూర్తుల సంఘం ప్రధాన కార్యదర్శి కే మురళీమోహన్, సహాయ కార్యదర్శులు దశరథ రామయ్య సభ్యులు శ్రీవాణి, వెంకటేశ్వరరావు హౌసింగ్ సొసైటీ సభ్యులు కుంచాల సునీత కే పట్టాభిరామారావు సంతోష్ రెడ్డిని సన్మానించారు. ఏ సంతోష్ రెడ్డి మాట్లాడుతూ పదవి విరమణ పొందినప్పటికీ న్యాయమూర్తుల కష్టనష్టాలు తెలిసిన వ్యక్తిగా వారికి తన సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని హామీ ఇచ్చారు.పదవీ విరమణ తర్వాత కూడా న్యాయమూర్తుల సమస్యల పరిష్కారం కోసం న్యాయ మూర్తుల సంఘానికి గౌరవ బాధ్యతలు స్వీకరించాల్సిందిగా న్యాయమూర్తుల సంఘం, సొసైటీ చేసిన విజ్ఞప్తికి ఏ.సంతోష్ రెడ్డి సానుకూలంగా స్పందించారు.

శ్రీ ఉజ్జయిని మహంకాళి ఘటాల ఊరేగింపు ప్రారంభం



నవతెలంగాణ-బేగంపేట్

ఆషాఢ బోనాల ఉత్సవాల సందర్భంగా మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆదివారం సికింద్రాబాద్‌లోని శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి ఆలయం వద్ద ఘటాల ఊరేగింపును ప్రారంభించారు. ముందుగా ఆలయ పండితులు పూర్ణకుం భంతో మంత్రికి స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారిని మంత్రి దర్శిం చుకొని పూజలు నిర్వహించారు. ఘటాల ఊరేగింపునకు ముందు డప్పు చప్పుళ్ళు, పోతురాజుల నత్యాలతో ఆలయ పరిసరాలు ఎంతో సందడిగా మారింది. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ మనోహర్ రెడ్డి, ఆలయ చైర్మెన్, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలి

- జ.వి.వే రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాస్



నవతెలంగాణ-కాప్రా

జన విజ్ఞాన వేదిక కాప్రా, కీసర, మల్కాజిగిరి మండల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 94వ బీపీ షుగర్ మెడికల్ క్యాంపునకు జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. ప్రస్తు తం కురుస్తున్న వర్షాలతో వాతావరణం చల్లబడి సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. అందుకే సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తలు అవసరమని, వర్షాల వల్ల తాగు నీరు కలుషితమయ్యే ప్రమాదం ఉందని పతి ఒక్కరూ కాచి వడబోసిన తాగునీటినే తాగాలని, సీజన్‌లో వచ్చే రోగాలకి డాక్టర్ల సలహా మేరకు మందులు వాడాలని సూచించారు. జన విజ్ఞాన వేదిక కాప్రా, మల్కాజిగిరి, కీసర మండల కమిటీల ఆధ్వర్యంలో బిపి, షుగర్ పేషెంట్స్ కోసం మెడికల్ క్యాంపును చక్రిపురం లోని శ్రీచక్రి విద్యానికేతన్ హై స్కూల్ చక్రిపురం క్రాస్ రోడ్డులో నిరంతరంగా గత ఎనిమిది సంవత్సరాలుగా నిర్వహించడం ఎంతో హర్షించదగ్గ విషయమని, ఈ క్యాంపు నిర్వహణకు తోడ్పడుతున్న చక్రి స్కూల్ యాజమాన్యానికి జన విజ్ఞాన వేదిక మండల కమిటీలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం ఈ క్యాంపునకు హాజరైన బీపీ షుగర్ బాధితులకు డాక్టర్లు పరీక్షలు నిర్వహించి, మందులను పంపిణీ చేశారు. అదనంగా దంత వైద్య పరీక్షలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు విద్యాసాగర్, అనూష, జయరాజ్, జన విజ్ఞాన వేదిక మేడ్చల్ జిల్లా అధ్యక్షులు పి. నాగరాజు,నాయకులు జి.కరుణాకర్ రెడ్డి, సోమయ్యాచారి, శ్రవణ్ కుమార్, శివశంకర్ రెడ్డి, వెంకటరమణ, రమణారెడ్డి, నాగేశ్వరరావు, ఎంఎల్ చౌదరి, కష్ణ మూర్తి, ప్రభాకర్, జెన్నీ, వెంకయ్య, మున్నయ్య శశాంక, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

రూ. 3 కోట్ల వ్యయంతో ముస్లిం గ్రేవ్ యార్డ్‌ను నిర్మిస్తాం

- మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్



నవతెలంగాణ-బేగంపేట్

బేగంపేటలోని ఓల్డ్ కస్టమ్‌లో ముస్లీం గ్రేవ్ యార్డ్ (ఖబరస్తాన్) నిర్మాణ పనులను జులై 1న ప్రారంభించనున్నట్టు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. ఆదివారం వెస్ట్ మారేడ్ పల్లిలోని తన నివాసంలో బేగంపేటకు చెందిన ముస్లీం ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఖబరస్థాన్ నమూనాను జీహెచ్ఎంసీ ఈఈ సుదర్శన్ వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సుమారు రూ. 3 కోట్ల వ్యయంతో గ్రేవ్ యార్డ్‌ను నిర్మించి ఇస్తామని చెప్పారు. ఇంకా అదనంగా నిధులు అవసరమైనా మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. తమకు గ్రేవ్ యార్డ్ లేకపోవడం వల్ల అనేక ఇబ్బందులు పడేవారమని మంత్రికి ప్రతినిధులు తెలిపారు. ఎన్నో సంవత్సరాల నుండి కోరుతూ వస్తున్నా పట్టించుకోలేదని చెప్పారు. ఈ ప్రాంతం నుంచి గెలిచి ముఖ్యమంత్రి, మంత్రిగా పని చేసిన వారు కూడా సమస్యకు పరిష్కారం చూపలేకపోయారని అన్నారు. ఇబ్బందులను దష్టిలో ఉంచుకొని మంత్రి కేటీఆర్ సహకారంతో ఓల్డ్ కస్టమ్ లో 2 ఎకరాల భూమిని మంజూరు చేయించినట్టు మంత్రి వివరించారు. ఈ సందర్భంగా మంత్రిని శాలువాలతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బి.ఆర్.ఎస్ బేగంపేట డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, నాయకులు శ్రీహరి, నరేందర్, శేఖర్, ప్రతినిధులు సలీం ఖాన్, నవాబ్, మక్బూల్, అబ్బాస్, వాహీద్, ఆరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఏడుపాయల కనకదుర్గమ్మ ఆలయ పునర్నిర్మాణ పనులను ప్రారంభించిన మంత్రి

బన్సీలాల్ పేట డివిజన్ బోయగూడలోని డాన్ బోస్కో స్కూల్ సమీపంలో మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ వ్యక్తిగత నిధులతో చేపట్టనున్న శ్రీ ఏడుపాయల కనకదుర్గమ్మ ఆలయ పునర్నిర్మాణ పనులను ఆదివారం మంత్రి ప్రారంభించారు. వేదపండితుల మంత్రాలతో శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి ఆలయ నిర్మాణ పనులకు భూమిపూజ జరిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కుర్మ హేమలత, బీఆర్ఎస్ పద్మారావు నగర్ ఇన్‌చార్జి గుర్రం పవన్ కుమార్ గౌడ్, డివిజన్ అధ్యక్షుడు వెంకటేష్ రాజు, నాయకులు శ్రీనివాస్, రమణ, ప్రేమ్, లంక రాజు తదితరులు పాల్గొన్నారు.

రామంతపూర్‌లో బోనాల పండుగ సమావేశం

నవతెలంగాణ-సిటీబ్యూరో



రామంతపూర్‌లోని మహంకాళి అమ్మవారి ఆలయంలో గ్రామ పెద్దలు బోనాల పండుగ సమావేశం ఆదివారం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో వచ్చే ఆదివారం నల్ల పోచమ్మ టీవీ స్టూడియో అమ్మవారి ఆలయం నుంచి రామంతపూర్ మాహంకాళి టెంపుల్ వరకు ఘటం ఊరేగింపు కార్యక్రమం ఉంటుందని గ్రామ పెద్దలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరు కూడా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. బుర్ర రాజేశ్వర్, సుర్వి మురళి గౌడ్, కోలన్ రవీందర్ రెడ్డి, సర్వ బాబు యాదవ్, వల్ల సత్యనారాయణ, ముత్యాల జంగయ్య, జీడికపల్లి వెంకటేష్, ఎరుకల శకుంతలమ్మ , గ్రామ వృత్తిదారులందరు పాల్గొన్నారు

జర్నలిస్ట్ తులసిచందుపై బెదిరింపులను ఖండించండి

- కేవీపీఎస్ మేడ్చల్ జిల్లా కమిటీ

నవతెలంగాణ-కాప్రా

స్వతంత్ర జర్నలిస్ట్, సామాజిక విశ్లేషకురాలు తులసి చందును ఫోన్లు చేసి చంపుతామని బెదిరిస్తున్న ఆర్ఎస్ఎస్ మతోన్మాదుల ఆగడాలను ఖండిస్తున్నట్లు కేవీపీఎస్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం కృపా సాగర్, నాగనిగళ్ల బాలపీరులు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్వతం త్ర జర్నలిస్టుగా మతోన్మాదం, మనువాద ఆగడాలు అరాచ కాలను ప్రశ్నిస్తూ దేశంలో శాంతి మతసామరస్యాలను పెంపొందించాలనే దృఢ సంకల్పంతో అనేక సామాజిక మాధ్యమాలలో విశ్లేషణలు చేస్తున్న ఆమెపై బెదిరింపులకు పాల్పడటం ప్రజాస్వామిక హక్కును కాలరాయడమేనన్నారు. చంపుతామని బెదిరింపులకు పాల్పడడం ఆటవిక చర్య అన్నారు. తంలో ప్రశ్నించిన గౌరీ లంకేష్, కల్బుర్గి, పన్సారే, ధబోల్కర్‌లను హతమార్చిన ఈ మతోన్మాద గుండాలు ఇప్పుడు తులసి చందును హత్య చేస్తామంటూ బెదిరిస్తు న్నారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం తులసి చందుకు పూర్తిస్థా యి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు ఆమెకి ప్రాణ హాని జరిగితే రాష్ట్రంలోని ఆర్ఎస్ఎస్, బీజేపీ నేతలు బాధ్యత వహించాల్సి ఉంటుందని చెప్పారు తులసి చందుకు కేవీపీఎస్ పూర్తిగా అండగా నిలుస్తుందన్నారు. బెదిరింపులకు పాల్పడిన దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ప్రజలు తులసి చందుకు సంఘీభావంగా నిలబడాలని కోరారు.

బీఆర్ఎస్ నాయకులు తిరుపతి మృతి

- శాసనమండలి విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఈ.తిరుపతి అకాల మరణం బాధాకరమని శాసనమండలి విప్, ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు విచారం వ్యక్తం చేశారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారం డివి జన్ బాలయ్య నగర్‌కు చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు తిరుపతి ఇటీవల గుండె పోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ ఆదివారం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా తిరుపతి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, స్థానిక పార్టీ కుటుంబ సభ్యులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో రాష్ట్రస్థాయి ర్యాంకు సాధించిన నీలం జ్యోతిర్మయి



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

జూనియర్ ఇంటర్ బాలికల కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ప్రాంతానికి చెందిన నీలం జ్యోతిర్మయి అనే విద్యార్థిని రాష్ట్రస్థాయి ర్యాంక్ సాధించిన సందర్భంగా ఆదివారం కేపీహెచ్‌బీ కాలనీలోని శ్రీ రెసిడెన్సిలో గల బాపూజీ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సభ్యులు విద్యార్థినిని మెమెంటో అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రమశిక్షణతో చదువుతూ భవిష్యత్తులో కూడా ఉత్తమ ఫలితాలు సాధించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు డి.రవికుమార్, ఉపాధ్యక్షులు దున్నాల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి యం.విజయబాబు, కోశాధికారి జె. వెంకటరమణ, సభ్యులతోపాటు నిర్వాహకులు శ్రీనివాస్ గుప్తా, ఎం. ప్రవీణ్ కుమార్, పాల్గొన్నారు.

తెలంగాణ సంప్రదాయానికి ప్రతీక బోనాల పండుగ

- మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్యే ముఠా గోపాల్
- ఉత్సాహంగా ఘట్టాల ఎదుర్కోలు



నవతెలంగాణ-అడిక్‌మెట్

బోనాల పండుగ అంటేనే తెలంగాణ సాంప్రదాయానికి ప్రతీక అని తెలంగాణ రాష్ట్ర సినిమాటోగ్రఫీ పశుసంవర్ధక శాఖ మంత్రి, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. ఆషాడ మాసం బోనాల పండుగను పురస్కరించుకుని తెలంగాణ కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో కావడిగూడలోని జగదీష్ దేవాలయం నుంచి లోయర్ ట్యాంక్ బండ్ నుంచి కనకాల కట్ట మైసమ్మ ఆలయం వరకు 5000 మంది భక్తులు, 516 బోనాలతో ఆడపడుచులు ఘనంగా ఊరేగింపుగా వెళ్లే అమ్మవారికి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఊరేగింపులో మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ,ఎమ్మెల్యే ముఠాగోపాల్ హాజరై మాట్లాడుతూ బోనాల పండుగ తెలంగాణ సాంప్రదాయం ఉట్టిపడేలా ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రజలు సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో సుభిక్షంగా జీవించేలా అమ్మవారి ఆశీస్సులు కాలం కొనసాగాలని కోరారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ముషీరాబాద్‌లోని ప్రతి దేవాలయం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేయడం జరుగుతుందని తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై తెలంగాణ సాంప్రదాయ పండుగను ఘనంగా జరుపుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి నేదునూరి శ్రీనివాస్, కోశాధికారి నడి కూడా శంకర్, అసోసియేట్ అధ్యక్షులు నాగపురి నాగేశ్వర్, ఉపాధ్యక్షులు భూపాల్, నరసింహ, సత్యనారాయణ, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కలవ గోపి తదితర నాయకులు పాల్గొన్నారు.

బోనాల పండుగ ఉత్సవాలను ఘనంగా జరుపుకోవాలని మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్ రెడ్డి

బోనాల పండుగ ఉత్సవాలను ఘనంగా జరుపుకోవాలని మాజీ కార్పొరేటర్ వి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆషాడమాసం బోనాల పండుగ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో కవాడిగూడ జగదీష్ మందిర్‌లో బోనాల పండుగ ఉత్సవాలకు రాంనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాసరెడ్డి హాజరై బోనాల ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా బోనాల పండుగ ఉత్సవాలను ఘనంగా జరుపుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కుమ్మరి సంఘం స్టేట్ సెక్రెటరీ నగేష్ బోనాల కమిటీ చైర్మన్ శ్రీనివాస్, హనుమంతరావు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కలవ గోపి, సిరిగిరి శ్యామ్ కార్తిక్ యాదవ్ అజూ, శివ, మధు, వెంకటేష్, అమిత్, వంశీ ,రాజేష్, త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రతి కాలనీలో మెరుగైన సౌకర్యాలే ధ్యేయం



- ఎమ్మెల్యే కేపి వివేకానంద్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని ప్రతి కాలనీలలో, బస్తీలలో మెరుగైన సౌకర్యాలు కల్పించడమే తన ధ్యేయమని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద అన్నారు. ఆదివారం గాజులరామారం డివిజన్ పరిధిలోని విష్ణుప్రియ ఎంక్లేవ్ (ఆర్కే లేబౌట్) లో రూ.1.95 కోట్లతో నూతనంగా చేపడుతున్న భూగర్భడ్రైనేజీ నిర్మాణ పనులను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వాలు చేయని విధంగా బీఆర్ఎస్ ప్రభుత్వ హాయంలో కోట్లాది నిధులను వెచ్చించి ప్రజా అవసరాలను తీర్చుతుందని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రజల సహాయ సహకారాలతో రాజకీయాల కతీతంగా పరిష్కరిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి డీజీఎం. అప్పల నాయుడు, మేనేజర్ రోహిణి కాలనీ అసోసియేషన్ సభ్యులు, స్థానిక కాలనీ వాసులు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అడ్డా హోటల్‌ను ప్రారంభించిన ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, గాజులరామారం డివిజన్ మహాదేవపురం ప్రాంతంలో జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు, స్థానిక కార్పొరేటర్ రావుల శేషగిరి రావు బంధువులు ఏర్పాటు చేసిన "అడ్డా 125" హోటల్ ను ఆదివారం శాసనమండలి విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కస్టమర్లకు నాణ్యమైన వంటకాలను అందుబాటులోకి తీసుకువచ్చి మన్ననలను పొందాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కొలుకుల జగన్, మంత్రి సత్యనారాయణ ,మాజీ కార్పొరేటర్ గుడిమెట్ల సురేష్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయాలి



- ప్రజాసంఘాల జిల్లా నాయకులు

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అర్హులైన పేద ప్రజలందరికీ డబల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయాలని ప్రజాసంఘాల జిల్లా నాయకులు ఎం.శంకర్ డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక కూకట్‌పల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం కేపీహెచ్‌బీ రోడ్ నెంబర్ 1 గాంధీ విగ్రహం వద్ద రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ రిలే నిరాహార దీక్షలో ఆయనతో పాటు సీఐటీయు కూకట్‌పల్లి మండల కార్యదర్శి కే.కృష్ణ నాయక్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రంగారెడ్డి , మహిళా సంఘం నాయకురాలు నర్సమ్మ, విజయ, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఎస్. బాలు, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి రంజిత్‌లు ముఖ్యఅతిథిలుగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ ఇల్లులేని పేదలకు ఇంటి నిర్మాణానికి రూ. 10 లక్షల మంజూరు చేయాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో డబల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మించింది సంవత్సరాలు గడుస్తున్న పేదలకు ఇవ్వడానికి ప్రభుత్వం ముందుకు రావడం లేదన్నారు మేడ్చల్ జిల్లాల్లో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో 50 శాతం జిల్లా వాసులకు ఇ వ్వాలని డిమాండ్ చేశారు. సొంత ఇంటి స్థలం ఉన్న వాళ్ల కు ఇల్లు కట్టుకోవడానికి రూ. 5లక్షలు ఆర్థిక సాయం చేయాలని గృహలక్ష్మీ పథకాన్ని ముందుకు తీసుకెళ్లాలన్నా రు. పేదలందరికీ ఇంటి స్థలం లేని పేదలకు స్థలం కేటాయి ంచి నిర్మాణ వ్యయం ఇవ్వాలని కోరారు. వేలాదిమంది ధర ఖాస్తులు చేసుకుంటే కొద్ది మందికే రెగ్యులరైజ్ చేశారు అని అన్నారు. అధిక ధరలు పేదలపై భారం మోపుతున్నారన్నా రు. ఇప్పటికైనా ప్రభుత్వం ఇండ్ల స్థలాలు, డబుల్ బెడ్ రూమ్‌ఇండ్లు, బీసీ రుణాలు పట్టాలు, గిరిజన బంధు, దళిత బంధు, పెన్షన్లు, రేషన్ కార్డులు వెంటనే ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నాయకులు శివ, నరసింహ రావు, రాములు, రాఘవరావు , సీసీఐ మండల నాయకులు శివప్రసాద్ పాల్గొన్నారు.

మోకాళ్లు కీళ్ల నొప్పులకు కాలం చెల్లు

- ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన



నవతెలంగాణ-సిటీబ్యూరో

నడి వయసు దాటిన తర్వాత వచ్చే మోకాళ్ల కీళ్ల నొప్పులకు కాలం చెల్లిందని శ్రీకర హాస్పిటల్స్‌కు చెందిన ప్రముఖ కీళ్ల తుంటి వైద్య నిపుణులు డాక్టర్ అభిషేక్ బర్లి అన్నారు. శ్రీపురం కాలనీ కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం ఆర్ఆర్ ఫౌండేషన్ నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ బార్లీ పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఆర్ ఫౌండేషన్ అధ్యక్షులు వేణు మాధవ్ మాట్లాడుతూ కరోనా సమయంలో సమాజంలో చోటు చేసుకున్న హృదయ విదారక ఘటనలు చూసి తన మనస్సు చలించిందన్నారు. అప్పుడే తోటి వారికి సహాయం చేయాలని ఆలోచన కలిగిందని వెంటనే తన తల్లితండ్రుల పేరుమీద ఆర్ఆర్ ఫౌండేషన్ స్థాపించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీపురం కాలనీ కార్యదర్శి రామారావు, అధ్యక్షులు కొండల్ రెడ్డి, దిల్సుక్నగర్ కాలనీ సంక్షేమ సంఘం నాయకులు విజయ వర్ధన్ రాజు, రిటైర్డ్ లెక్చరర్ మాధవ రాజు కాంగ్రెస్ నాయకులు బక్క పాల్సన్ రాజు,, సామాజికవేత్త సతీష్ రెడ్డి, ప్రముఖ న్యాయవాదులు రవి, ఆర్ఆర్ ఫౌండేషన్ కార్యదర్శి చేపూరి రవీంద్రరావు, సభ్యులు అశోక్ రెడ్డి, శ్యాంసుందర్, పండుగల మహేష్, ప్రసాద్ వేణు పాల్గొన్నారు.

జగన్నాథ్ రథ యాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే



నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి లోని నిజాంపేట్ రామాలయం భాగవతం గ్రూప్ వారి ఆధ్వర్యంలో ఆదివారం నిజాం పేట్ రామాలయం నుండి బాచుపల్లి జయదీపిక ఎస్టేట్స్ వరకు ఏర్పాటు చేసిన జగన్నాథ్ రథ యాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే కేపి వివేకానంద్ పాల్గొని స్థానిక మేయర్ కొలన్ నీలా గోపాల్ రెడ్డి , డిప్యూటీ మేయర్ దన్ రాజ్ యాదవ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో, కార్పొరేటర్లు సురేష్ రెడ్డి, ఆగం రాజు ముదిరాజ్, రవి కిరణ్, ఆవుల పావని జగన్ యాదవ్, గాజుల సుజాత, కొలన్ వీరేందర్ రెడ్డి, కొలన్ సునీల్ రెడ్డి, మహిళా నాయకురాలు సబిత జలంధర్ రెడ్డి నాయకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

75 దేవాలయాలకు మంజూరు పత్రాలు అందజేత



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

జీహెచ్ఎంసీ పరిధిలో ఉన్న 100 దేవాలయాలకు ధూప దీప నైవేద్య పథకం మంజూరైన నేపథ్యంలో అందులో కుత్బుల్లాపూర్ నియోజకవ ర్గంకు చెందిన 75 దేవాలయాలకు మంజూరు పత్రకాలను ఆదివారం ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ పేట్ బషీరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో అర్చకులకు అందజేశారు. ఈ సందర్భంగా జీహెచ్ఎంసీ ధూప దీప నైవేద్య అర్చక సంఘం సభ్యులు ఎంతో హర్షం వ్యక్తం చేస్తూ బీఆర్ఎస్ ప్రభుత్వానికి ,ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ధూప దీప నైవేద్య అర్చక సంఘం అధ్యక్షుడు శ్రీరంగ గోపికృష్ణమాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాస్ నగర్‌లో కుంగిపోయిన భవనం

- పరిశీలించిన ఎమ్మెల్యే కేపీ వివేకనంద్



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని చింతల్ శ్రీనివాస్ నగర్‌లో హైడ్రాలిక్ జాక్‌ల సహాయంతో పురాతన బిల్డింగ్‌ని పైకి ఎత్తే ప్రయత్నంలో విఫలమై బిల్డింగ్ కూలిపోయి 10 మీ. మేర పక్కనున్న బిల్డింగ్‌కి అనుకొని ఒరగడంతో విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ఆదివారం వెంటనే అక్కడికి చేరుకొని పరిస్థితిని పరిశీలించారు. డీఆర్ఎఫ్ బృందం, టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్ అధికారులతో కలిసి ఎమ్మెల్యే బిల్డింగ్ వద్ద చేపట్టవలసిన చర్యలను సమీక్షించారు. శ్రీనివాస్ నగర్ ఒకప్పుడు వ్యవసాయ భూమి అని, పాక్స్ సాగర్ నుండి వచ్చే నాలాకి సమీపంలో ఈ పురాతన ఇల్లు ఉండటం యజమానికి అవగాహన లేకుండా హైడ్రాలిక్ జాక్ ద్వారా ఇంటిని పైకి ఎత్తే ప్రయత్నం చేయడంతో ఈ ఘటన చోటు చేసుకుందని ఎమ్మెల్యే అన్నారు. ప్రజలు భయాందోళన చెందవలసిన అవసరం లేదని అధికార యంత్రాంగం సమస్య పరిష్కారానికి ఇప్పటికే చర్యలు చేపడుతుందని అన్నారు. నిపుణులైన జేఎన్టీయూ ఇంజనీరింగ్ బృందం బిల్డింగ్‌ను సౌండ్ టెస్ట్ చేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపడుతుందని అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ఇటువంటి ప్రమాదాలు జరగకుండా గతంలో ముందుగానే శిథిలావస్థకు చేరుకున్న ఇండ్లను తొలగించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కాలనీ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నైకా మ్యాట్ టు - లాస్ట్ పోర్ మినిమైజింగ్

- 15 నిమిషాల్లో ఇన్స్టంట్ పోర్లెస్ మ్యాట్ ఫినిష్

నవతెలంగాణ-సిటీబ్యూరో

మ్యాటీ టు లాస్ట్ లిక్విడ్ లిప్స్టిక్ కోసం 2018లో పొందిన అభిమానం తర్వాత, నైకా కాస్మెటిక్స్ సరికొత్త మ్యాట్ టు లాస్ట్ ఫౌండేషన్ శ్రేణితో దేశాన్ని చుట్టేయటానికి సిద్ధంగా ఉంది. దాని విప్లవాత్మక లిక్విడ్ నుంచి పౌడర్ టెక్నాలజీతో ఉదయం నుండి సాయంత్రం వరకు ఒకరిని తీసుకువెళతామనే వాగ్దానం చేస్తూ, ఈ ఫౌండేషన్ పోర్ లెస్ మ్యాటీ ఫినిష్‌ను అందిస్తుంది. ఈ సందర్భంగా నైకా బ్రాండ్స్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ విశాల్ గుప్తా మాట్లాడుతూ విపరీతమైన వాతావరణ పరిస్థితులు సజనాత్మక బ్యూటీ సొల్యూషన్లకు పిలుపునిస్తున్నాయన్నారు. దీన్ని దష్టిలో ఉంచుకుని తమ కొత్త అధునాతన సాంకేతికతతో అసాధారణమైన లిక్విడ్-టు-పౌడర్ ఫార్ములాతో మ్యాటీ టు లాస్ట్ ఫౌండేషన్‌ను విడుదల చేశామన్నారు. ఇది చాలా కాలం పాటు ఉండేలా తయారు చేయబడిందన్నారు. ఇప్పటికే ఉన్న ఫౌండేషన్ శ్రేణికి మరొక ముఖ్యమైన అదనంగా ఉందని, భారతీయులు షేడ్ వైవిధ్యాన్ని తీర్చడానికి మరిన్ని ఆవిష్కరణలను ప్రారంభించాలని తాము ఎదురుచూస్తున్నామన్నారు.

నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ 12వ డివిజన్ పరిధిలోని బాలాజీ హిల్స్ కాలనీకి చెందిన ప్రజలు ప్రభుత్వ విప్, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుని ఆదివారం శంభీపూర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. సమస్యలను పరిష్కరించాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్సీ గారు మాట్లాడుతూ సంబంధిత అధికారులతో చర్చించి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

నవతెలంగాణ-దుండిగల్



కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పనిచేస్తాం: డాక్టర్ రొండ మల్లారెడ్డి



నవతెలంగాణ-మేడ్చల్

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేస్తానని డాక్టర్ రొండ మల్లారెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ దేశ, రాష్ట్ర వ్యాప్తంగా రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయడానికి అఖిల భారతీయ కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా ఎస్సీ, ఎస్టీ పార్లమెంట్, అసెంబ్లీ నియోజ కవర్గాలలో లీడర్షిప్ డెవలప్మెంట్ మిషన్ అనే ప్రోగ్రాంను తీసుకువచ్చిందని వెల్లడించారు. ఇందులో భాగంగా సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గానికి లీడర్షిప్ డెవలప్మెంట్ ప్రోగ్రాం కోఆర్డి నేటర్‌గా మేడ్చల్ మండల పరిధిలోని పూడూరు గ్రామానికి చెందిన డాక్టర్ ఆర్.మల్లారెడ్డిని నియమించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ మల్లారెడ్డి మాట్లాడుతూ తన పై నమ్మకంతో అత్యున్నత బాధ్యతలు అప్పగించిన ఏఐసీసీ అధిష్టానానికి ప్రత్యేక ధన్యవాదా లు తెలియజేశారు. కంటోన్మెంట్ నియోజక వర్గంలో కాంగ్రెస్ పార్టీ గెలిపే లక్ష్యంగా పనిచే స్తానని వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా 31 అసెంబ్లీ, 5పార్లమెంట్ స్థానాలకు నూతన కోఆర్డినేటర్ లను ఏఐసీసీ నియమించిందని పేర్కొన్నారు.

నూతన సీసీ రోడ్డును ప్రారంభించిన మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

సీఎం కేసీఆర్ ఆదేశానుసారం రోడ్ల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని మాజీ కార్పొరేటర్ గుడిమెట్ల సురేష్ రెడ్డి అన్నారు. సుభాష్ నగర్ 130 డివిజన్ పరిధిలోని సూరారం కాలనీలో రూ. 50 లక్షల నిధులతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును స్థానికులతో కలిసి ఆదివారం ప్రారంభించారు. డివిజన్‌లోని అన్ని బస్తీలలో, కాలనీలలో సమస్యలను పరిష్కరించడంలో తను ఎల్లప్పుడూ ముందుం టానన్నారు. వర్షాకాలంలో ప్రయాణికులకు, కాలినడకన వెళ్లే వారికి ఈ రోడ్డు చాలా ఉపయోగపడుతుందన్నారు. డివిజన్ అభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేస్తున్నా మని, ఆదర్శ డివిజన్ గా తీర్చిదిద్దడమే తన లక్ష్యమన్నారు. త్వరలోనే ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే సహాయ సహకారాలతో సర్వే నంబర్లు 49 ,107 లలో గల ఇండ్లకు పట్టాలు ఉచితంగా పంపిణీ చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, మహిళలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

ఊపిరితిత్తులు మానవ శరీరంలో అతి ముఖ్యం

- డాక్టర్ రావుస్ ఈఎన్టీ హస్పటల్ చైర్మన్ డాక్టర్ జీ.వి.ఎస్.రావు



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

ఊపిరితిత్తులు మానవ శరీరంలో అతి ముఖ్యమైనవని డాక్టర్ రావుస్ ఈఎన్టీ హస్పిటల్ చైర్మెన్ డాక్టర్ జీ.వి.ఎస్.రావు అన్నారు. కేపీహెచ్‌పీ కాలనీలో డాక్టర్ రావూస్ ఈఎన్టీ ఆసుపత్రిలో ఉచితంగా బ్రిత్ ఉచిత క్యాంపు నిర్వహించారు. మన జీవిత కాలం మన ఊపిరితిత్తుల మీద ఆధారపడి ఉంటుందని, వాటిని కాపాడుకోవడం మన భాధ్యత అన్నారు. అనంతరం 60 సంవత్సరాలు పై బడిన వారికి ఊపిరి సంబంధించిన వ్యాయమం చేయడానికి రూ.500 విలువ గల స్పైరోమీటర్ పరికరాన్ని ఆయన చేతుల మీదుగా ఉచితంగా 350 మందికి అందజేశారు.

ఎమ్మెల్సీ కౌశిక్ రెడ్డి ముదిరాజ్ సమాజానికి క్షమాపణలు చెప్పాలి



- మేడ్చల్ ముదిరాజ్ సంఘం నాయకులు

నవతెలంగాణ-మేడ్చల్

ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డి ముదిరాజ్ సమాజానికి వెంటనే క్షమాపణ చెప్పాలని మేడ్చల్ మండల ముదిరాజ్ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు పుట్నాల భుజంగం ముదిరాజ్ ఆధ్వర్యంలో ఆదివారం మేడ్చల్ పట్టణంలోని ముదిరాజ్ సంఘం నుండి అంబేద్కర్ విగ్రహం వరకు నిరసన ర్యాలీ ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. అనంతరం కౌశిక్ రెడ్డి పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా పుట్నాల భుజంగం ముదిరాజ్ మాట్లాడుతూ హుజూరాబాద్‌లో జెఎస్ఆర్ టీవీ కెమెరామెన్ రంజిత్ ముదిరాజును అకారణంగా కిడ్నాప్ చేసి దాడి చేస్తూ యావత్ ముదిరాజ్ సమాజాన్ని కించపరిచే విధంగా మాట్లాడారని అన్నారు .గౌరవప్రదమైన ఎమ్మెల్సీ స్థానంలో ఉన్న వ్యక్తి ఒక సామాజిక వర్గాన్ని కించపరిచే విధంగా మాట్లాడడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డి తక్షణమే ముదిరాజులకు క్షమాపణ చెప్పాలని లేనిపక్షంలో పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు బాల మల్లేష్, శ్రీకాంత్ ముదిరాజ్, బి.రవి, గువ్వ రవి ముదిరాజ్, కొరుపత్తి రామకృష్ణ, నగేష్, పోచయ్య ముదిరాజ్, శంకర్, రమేష్, సత్య నారాయణ, నర్సింహ ఉన్నారు.

సమస్యలను పరిష్కరించాలని అధికారులను కోరిన భరత సింహారెడ్డి



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

జీడిమెట్ల 132 డివిజన్ పరిధిలోని వెన్నెల గడ్డలో ఎల్జి అపార్ట్మెంట్ వాసులు, వాసవి స్క్వేర్ అపార్ట్మెంట్ వాసులు శానిటైజర్ (గార్బేజ్), అండర్ గ్రౌండ్ యూజీడి లైన్, రోడ్డు సమస్యలతో ఇబ్బంది పడుతున్నారని తెలియడంతో బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత సింహా రెడ్డి అపార్ట్మెంట్ వాసులతో కలిసి వెన్నెల గడ్డలో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి వెంటనే పరిష్కరించాలని కోరారు. సుభాష్ ,రాజేష్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, దేవేందర్ ,రాజేశ్వర్ ,విశ్వనాథ్, శశికాంత్ రెడ్డి ,కిషోర్ కుమార్, సురేష్ ,చిన్నారెడ్డి, శ్రీధర్ రెడ్డి ,సందీప్ ,అశోక్ రెడ్డి ,వినోద్ తదితరులు పాల్గొన్నారు.

సౌకర్యాలు కల్పించకుండా నందనవనం కాలనీ పై వివక్ష ఎందుకు..?



నవతెలంగాణ-దుండిగల్

నిజాంపేట్ కార్పొరేషన్ 18వ డివిజన్ నందనవనం కాలనీలో దాదాపు 160 అపార్ట్మెంట్ కొత్తగా నిర్మాణం జరిగింది. మౌలిక వసతులైన మట్టి రోడ్లు, డ్రైనేజీ ,స్ట్రీట్ లైట్లు, స్పీడ్ బ్రేకర్లు, కాలనీ కి చేరుకోవడానికి 40 ఫీట్ల రోడ్డు అక్రమణాలపై పాలకవర్గం, అధికారులకు చిత్తశుద్ధి కరువైందని బీజేపీ స్థానిక అధ్యక్షులు ఆకుల సతీష్ తెలిపారు. ఈ సందర్భంగా కాలనీ ప్రజలు, అకుల సతీష్ మాట్లాడుతూ 1988 నరసింహారావు లేఅవుట్ లేఅవుట్ పలు సమస్యలు కాలనీ ప్రజలు మా దృష్టికి తీసుకురాగా, క్షేత్రస్థాయిలో పర్యటించి, నూతనంగా ఏర్పడిన 165 పై చిలుక అపార్ట్మెంట్ల కాలనీలో నందు గత మూడు సంవత్సరాలుగా మౌలిక వసతుల కల్పనలో పలు సమస్యలు ఎదుర్కొంటున్నమన్నారు. ఫిర్యాదు చేసిన రెవెన్యూ, మున్సిపల్ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ప్రజల కనీస అవసరాలు పరిష్కారం వచ్చే శనివారం లోపు తీర్చుకుంటే మున్సిపల్ కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ కార్పొరేషన్ ప్రధాన కార్యదర్శి జిల్లా ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యులు కాశి, ట్రేడర్ సెల్ సీనియర్ నాయకులు, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

"బలగం" సినిమా నటులకు ఘన సన్మానం



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

ఇటీవల విడుదలై సంచలనం సృష్టించి రాష్ట్రవ్యాప్తంగా ప్రేక్షకదారణ పొందిన "బలగం" సినిమాలో నటించిన ఇద్దరు నటులకు అరుదైన గౌరవం లభించింది. ఈ మేరకు ఆదివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం రంగారెడ్డి నగర్ డివిజన్ పరిధి, ఏపీహెచ్‌బీ కాలనీలోని గీతాంజలి కళాశాల సమీపంలోని శ్రీ రెసిడెన్సిలో గల బాపూజీ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయ ఆవరణలో పలువురు సభ్యుల పుట్టినరోజులు సందర్భంగా కేక్ కట్ చేసి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. అనంతరం బలగం సినిమాలో కొమురయ్య తమ్ముడు అంజన్న పాత్రధారి గుడిబోయిన బాబుతో పాటు, పోశవ్వ పాత్రదారిణి వి.విజయలక్ష్మి ని బాపూజీ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సంస్థ ఆధ్వర్యంలో సభ్యులు ఇద్దరు నటులను శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో డి.రవి కుమార్, దున్నాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మానేపల్లి జ్యువెలర్స్ బంగారు బోనం తయారుచేసి ఆరేండ్లు



నవతెలంగాణ-బేగంపేట్

ఆరు సంవత్సరాల కింద శ్రీఉజ్జయిని మహంకాళి దేవాలయంలో బంగారు బోనం లేకపోవడం ఎంతో బాధాకరంగా ఉందని, అప్పట్లో భక్తులు వేదపండితులు, దాతలు తప్పనిసరిగా బంగారు బోనం ఉండాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు బంగారు బోనం తయారు చేయడానికి కొన్ని సంస్థలు ముందుకు రాగా నియమనిష్ఠలతో బంగారు బోనం తయారు చేయాలని చెప్పడంతో మానేపల్లి జ్యువెలర్స్ వారు ముందుకు వచ్చారు. తాము తయారు చేయిస్తామని సీఈవో రామారావు, ఎండీలు మురళీకృష్ణ, గోపికృష్ణ తెలిపారు. తయారీ విషయంలో ఎటువంటి రాజీ లేకుండా దాతలు ఇచ్చిన బంగారాన్ని కరిగించి బంగారు బోనం తయారు చేయించారు. 2018లో జూలై 25న బంగారు బోనం తయారు చేశారు. మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ బంగారు బోనాన్ని చూసి ఎంతో అద్భుతంగా ఉంది అని మానేపల్లి జ్యువెలర్స్ వారిని అభినందించారు.

జూన్ 26న ఇంటర్నేషనల్ యాంటీ నార్కొటిక్స్ డే సందర్భంగా ఆదివారం జూబ్లీహిల్స్‌లో అవగాహన కార్యక్రమంలో నగర సీపీ సీవీ ఆనంద్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ, జేఎన్‌టీయూ, డాక్టర్ బీ.ఆర్. అంబేద్కర్ యూనివర్సిటీ విద్యార్థులు పాల్గొన్నారు.
నవతెలంగాణ-సిటీబ్యూరో



ఆర్థిక సంక్షోభంలో అనుబంధ కళాశాలాలు

- రెండేండ్లుగా విడుదల కాని స్కాలర్ షిప్స్
- పట్టించుకోని ఓయూ.. తలలు పట్టుకుంటున్న ప్రిన్సిపాల్స్,
- విద్యార్థులకు తప్పని తిప్పలు..వేతనాల కోసం రోడ్డెక్కిన ఉద్యోగులు, విద్యార్థులు
- ఆవిరైన ఎఫ్‌డీలు..అగమ్యగోచరంగా నిజాం, సైదాబాద్, సికింద్రాబాద్ పీజీ కళాశాలాలు
- పూర్వ విద్యార్థి మంత్రి కేటీఆర్ చేయూత కోసం ఎదురు చూపులు



నవతెలంగాణ, ఓయూ

ఉస్మానియా విశ్వవిద్యాలయనికి వెన్నెముకగా వెలుగొందు తున్న అనుబంధ కళాశాలలైన సికింద్రాబాద్ పీజీ కాలేజ్, నిజాం కాలేజ్, సైఫాబాద్ సైన్స్ కాలేజ్ నిధులేక ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటు ఆర్థిక సంక్షోభం దిశగా అడుగులు వేస్తు న్నాయి.మరోవైపు స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదలకాకపోవడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు ఓయూ, దాని అనుబంధ కళాశాలల్లో ఉన్నత విద్యను అభ్యసించేందుకు స్కాలర్ షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట ఎంతగానో చేయూతనిస్తాయి. ఉపాధి కల్పన, పరిశోధనలు క్రీడా, సాంస్కృతిక రంగాలతో పాటుగా వివిధ రంగాల్లో ఎంతో మంది మేధావులు, నిపుణులను అందజేసిన ఈ 3 కళాశాలాలు నేడు ఆర్థిక సమస్యలతో, ప్రిన్సిపాల్స్‌తలలు పట్టుకున్న ఉద్యోగులు వేతనాలు ఇవ్వాలని గత వారం రోజుల నుండి నిత్యం నిరసన కార్యక్రమలు నిర్వాహిస్తున్నారు.

సకాలంలో వేతనాలు ఇవ్వలేని దుస్థితి..ఎదుర్కొంటున్న ఇబ్బందులు..

ఇక ఈ కళాశాలలో వివిధ రకాల రెగ్యులర్, సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సుల్లో బోధిస్తున్న కాంట్రాక్టు, పార్టు టైమ్ అధ్యాపకులకు, డైలీ వేజ్ వర్కర్స్ సకాలంలో వేతనాలు ఇవ్వలేని పరిస్థితి నెలకొంది.దీంతో వారు ఇబ్బంది పడుతున్నారు.

గుదిబండగా సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సుల నిర్వహణ

ఈ 3 కళాశాలల్లో పలు సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులు బోధించే కాంట్రాక్టు టీచర్స్, పార్ట్ టైమ్ టీచర్స్, సెల్ఫ్ ఫైనాన్స్ కాంట్రాక్టు టీచర్స్, నాన్ టీచింగ్ ,ఔట్ సోర్సింగ్ ,బోధనేతర కాంట్రాక్టు ఉద్యోగులకు వేతనాల చెల్లింపు ప్రిన్సిపాల్స్ తల నొప్పిగా మారింది. సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సుల నిర్వహణ, ఆర్థిక భారంగా కొంత ఇబ్బందిగా ఉందంటూ ప్రిన్సిపాల్స్ సన్నిహి తుల వద్ద వాపోతున్నారు. వీరికి నెలకు సైఫాబాద్ సైన్సు కళాశాల రూ 18 లక్షల 50 వేలు, సికింద్రాబాద్ పీజీ కాలేజ్ 21 లక్షలు, నిజాం కాలేజ్ 42 లక్షలు వేతనాలు చెల్లిస్తున్నారు. వీటిని సర్దుబాటు ప్రిన్సిపాల్స్ కష్ట తరంగా మారింది. ఇక ఈ మూడు (సికింద్రాబాద్ పీజీ కాలేజ్, నిజాం కాలేజ్, సైఫాబాద్ సైన్స్ కాలేజ్) కళాశాలల్లో రాష్ట్ర ప్రభుత్వం నుండి విడు దల కావాల్సిన స్కాలర్షిప్స్, ఫీజు రీయింబర్స్మెంట్స్ విడుదల కాకపోవడంతో ఈ ఆర్థిక పరిస్థితులు మరింతగా జఠిలంగా మారింది. కొన్ని సందర్భాల్లో గత్యంతరంలేక అత్యవసర పరిస్థితుల్లో ఉన్న భవిష్యత్తు కోసం ఉన్న " ఫిక్స్డ్ డిపాజిట్స్ " (ఎఫ్ డి),లు కూడా గత్యంతరం లేక వినియోగించు కోవడం తో ఎఫ్ డి లు సహితం ఆవిరై పోయిన దుస్థితి నెలకొంది. పెండింగ్ లో స్కాలర్ షిప్స్ వివరాలు: 2021-2022 విద్యా సంవత్సరం, సైఫబాద్ పీజీ కాలేజ్ 45 లక్షలు, సికింద్రాబాద్ పీజీ కాలేజ్ కి 48 లక్షలు, నిజాం కాలేజ్ కి 6 కోట్లు, 2022-2023 విద్య సంవత్సరం, సైఫాబాద్ సైన్సు కాలేజ్ 2 కోట్లా 20 లక్షలు, సికింద్రాబాద్ పీజీ కాలేజ్ 2 కోట్ల 40 లక్షలు, నిజాం కాలేజ్ 8 కోట్లు. ఇక 2022-2023 విద్య సంవత్సరం స్కాలర్ షిప్స్‌కు సంబంధించిన " ప్రొసీడింగ్స్ విడుదల " నేటికి చేయని దుస్థితి నెలకొంది. ఇది ఇలా ఉంటే జులై మెదటి వారం లో నిజాం కాలేజ్ డిగ్రీ వసతి గృహాలు ప్రారంభించాల్సి ఉంది.మరి ఇవి ఇప్పుడు ఉన్న పరిస్థితి దృష్ట్యా తెరుస్తారా ? లేదా అన్నది కూడా ప్రశార్థంకంగా మారింది. రాష్ట్ర ప్రభుత్వం నుండి స్కాలర్ షిప్స్ వచ్చేలా సదరు కార్యాలయల, అధికారులు వెంట తిరిగేందుకు ఒక కో ఆర్డినేటర్ ను నియమించాలని, రాష్ట్ర ప్రభుత్వ పెద్దలను ఒప్పించి స్కాలర్ షిప్స్ విడుదల కు వీసీ చొరవ చూపాలని కోరుతున్నారు.

నిరుపేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు



నవతెలంగాణ -సుల్తాన్ బజార్

నిరుపేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించాలని ఉద్దేశంతో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హైదరా బాద్ శాఖ ఆధ్వర్యంలో శివాజీ బ్రిడ్జిస్లం ఏరియాను దత్తత తీసుకోవడం జరిగిందని ఐఎంఏ జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ రవీందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం అఫ్జల గంజ్ రాష్ట్ర కేంద్ర గ్రంథాలయం ఎదురుగా ఉన్న స్లమ్ ఏరియాను ఐఎంఎస్ సిటీ శాఖ అధ్యక్షుడు డాక్టర్ దయ్యాల్ సింగ్ ఆధ్వర్యంలో ఆవ్‌గావ్‌చలో కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఆయన అన్ని విభాగాల వైద్యులతో కలిసి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పేద ప్రజలకు, మురికివాడలలో జీవిస్తున్న ప్రజలకు వైద్యంపై అవగాహన పెంచడంతోపాటు వారికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేయను న్నట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా ఉన్న అన్ని మురికి వాడలను దత్తత తీసుకొని వారికి మెరుగైన వైద్య సేవలు అందించి జీవితాంతం ఆరోగ్యంగా ఉండేలా నిరంతరం కృషి చేస్తుందన్నారు. ఐఎంఏ సిటీ శాఖ అధ్యక్షుడు డాక్టర్ దయ్యాల్ సింగ్ మాట్లాడుతూ.. మురికి వాడల లోని ప్రజలు చెత్తాచెదారం మయమైన ప్రాం తాలలో నివసిస్తుండడం వలన వారి ఆరోగ్యాలు పూర్తిగా చెడిపోయే ప్రమాదం ఉందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని ఐఎంఏ సిటీ శాఖ ఆధ్వర్యంలో శివాజీ బ్రిడ్జి స్లం ఏరియాను దత్తత తీసుకోవడం జరిగిందన్నారు. ప్రతినెల 4వ ఆదివారం ఈ ప్రాంతంలో వైద్య శిబిరం నిర్వహించి వైద్య పరీక్షలతోపాటు మందులను ఉచితంగా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. అత్యవసరమైన వారికి ఉస్మానియా. గాంధీ, నీలోఫర్, మెటర్నటీ దావాఖానాలలో వైద్య సేవలు అందించేందుకు ఐఎంఏ తగిన చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ సిటీ శాఖ సభ్యులు ప్రొఫెసర్ డాక్టర్ టి వి శ్రీనివాస్. ప్రొఫెసర్ డాక్టర్ పరహాజ్. పరిషిత. డాక్టర్ బి.ఎస్ శ్రీకాంత్. డాక్టర్ ఆశ. డాక్టర్ వివేక్ కందర్ కార్. డాక్టర్ రహమత్. డాక్టర్ వి ఎస్ గన శ్రీ నాయుడు. డాక్టర్ రామదాస్. డాక్టర్ అనర్ కార్. డాక్టర్ విజయ్ కుమార్. డాక్టర్ జహీరా కన్నన్. డాక్టర్ ఈ రవీందర్ రెడ్డి. డాక్టర్ దిలీప్ భానుశాలి. ఖలీల్ అహ్మద్. అమరావతి. సుభద్ర తదితరులు పాల్గొన్నారు.

పార్ట్ టైమ్ టీచర్స్‌ను రెగ్యులరైజ్ చేయాలని మంత్రికి వినతి



నవతెలంగాణ-ఓయూ

వివిధ యూనివర్సిటీలలో పనిచేస్తున్న పార్ట్ టైం టీచర్లను రెగ్యులరైజ్ చేయాలని తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డిని ఆదివారం పార్ట్ టైం టీచర్స్ అసోసియేషన్ నేతలు కలిసి వినతిపత్రం అందజేశారు. మంత్రి స్పందిస్తూ యూనివర్సిటీలలో పనిచేస్తున్న పార్ట్ టైం టీచర్ల సమస్య ప్రభుత్వం దృష్టిలో ఉందని మరోసారి ఈ విషయాన్ని సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి పార్ట్ టైం టీచర్లను రెగ్యులరైజ్ చేసే ప్రయత్నం చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ పార్ట్ టైం టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ సోమే శ్వర్ బోనకుర్తి,తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయ పార్ట్ టైం టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ వరలక్ష్మి, పాలమూరు యూనివర్సిటీ పార్ట్ టైం టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ శివ శంకర్,మహాత్మా గాంధీ యూనివర్సిటీ పార్ట్ టైం టీచర్స్ అసోసియేషన్ ప్రతినిధులు మహమ్మద్ షరీఫ్,ఉస్మానియా యూనివర్సిటీ పార్ట్ టైం టీచర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ డాక్టర్ జూలు నాగేశ్వర్, వివిధ యూనివర్సిటీల నుంచి వచ్చిన వందలాది మంది పార్ట్ టైం టీచర్స్ పాల్గొన్నారు.

దేశ సంపద అమ్ముకోవడంలో బీజేపీ విజయం'

ఆప్ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ ఆరోపణ



నవతెలంగాణ-హిమాయత్ నగర్

తొమ్మిది ఏండ్ల పాలనలో దేశ సంపదను అమ్ము కోవడంలో బీజేపీ విజయం సాధించిందని ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ ఆరోపించారు.ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను అడ్డగోలుగా విక్రయిస్తూ ఉద్యోగ భద్రతను దెబ్బతీసి, 9ఏండ్ల కాలంలో ఉద్యోగాలు కల్పించకుండా దేశాన్ని నిరుద్యోగ భారత్ గా రూపాంతరం చెందేలా మోడీ ప్రభుత్వం చేసిందని ఆయన విమర్శించారు.ఆదివారం హిమాయత్ నగర్, లిబర్టీలోని ఆప్ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వివిధ పార్టీలకు చెందిన ఆటో రంగ కార్మిక సంఘాల నేతలు దిడ్డి సుధాకర్ సమక్షంలో ఆమ్ ఆద్మీ పార్టీలో చేరారు.ఈ సందర్భంగా వారికి ఆప్ ఖండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానిం చారు.అనంతరం ఆయన మాట్లాడుతూ..ఆకాశం పైకెగిసిన పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలు, నిరుద్యోగం, ఘోరమైన ద్రవ్యోల్బణం, కార్పొరేట్లకు వేల కోట్ల రుణ మాఫీ, లెక్కలేనన్ని అబద్ధపు హామీలు, ద్రోహాలు బీజేపీ సాధించిన 'నిజమైన విజయాలు' అని ధ్వజమెత్తారు.ప్రజలను అసత్యాలు, అబద్ధాలతో బురిడీ కొట్టించేందుకు ప్రయత్నం చేస్తే తగిన బుద్ధి చెపుతారని హెచ్చరించారు.ఆప్ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు ఎండి.మజీద్, డా.సాల్మన్‌రాజ్, ఆప్ తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షులు రుద్రాక్ష మల్లేష్, ప్రధాన కార్యదర్శి ఫరూక్, ఆప్ అధికార ప్రతినిధి ప్రవీణ్ యాదవ్, నేతలు టి.రాకేష్ సింగ్, హైదర్, ఇస్మాయిల్, తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ విరుద్ధంగా తొలగించిన 26 కులాలను బీసీ జాబితాలో చేర్చాలి

26 బీసీ కులాల జేఏసీ చైర్మెన్ ఆళ్ల రామకృష్ణ



నవతెలంగాణ-అడిక్‌మెట్

రాజ్యాంగ విరుద్ధంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తొలగించిన 26 బీసీ కులాలను వెంటనే బీసీ జాబితాలో కలపాలని 26 బీసీ కులాల జేఏసీ చైర్మన్ ఆళ్ల రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు తొలగించిన బీసీ కులాల ఆధ్వర్యంలో విద్యానగర్ లో ఆత్మగౌరవ సభ నిర్వహించారు. ఈ సభకు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఎంపీ ఆర్ కృష్ణయ్య, 26 బీసీ కులాల జేఏసీ చైర్మన్ ఆళ్ల రామకృష్ణ హాజరై మాట్లాడుతూ.తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే వివక్షతతో ఏకపక్షంగా రాజ్యాంగ విరుద్ధంగా బీసీ/ఓబీసీ జాబితా నుండి తొలగించడం ద్వారా 26 కులాలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు.విద్యార్థులకు స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్ మెంట్, అడ్మిషన్స్, వివిధ రంగాలలో జరిగిన ఉద్యోగ నియామకాలలో తీవ్ర నష్టం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు.బీసీ రిజర్వేషన్తో పాటుజాతీయస్థాయిలోఓ.బి.సి. రిజర్వేషన్ కూడా రద్దుచేశారు. త్వరలో ప్రభుత్వం విడుదల చేస్తున్న ఉద్యోగ నియామకాలలో తొలగించిన 26 బీసీ కులాలకు న్యాయం జరిగేలా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. బీసీ కమిషన్ సిఫార్సులు లేకుండ ప్రభుత్వం ఈ కులా లను కక్షపూరితంగా తొలగించారు. కులాలను కలుపకపోతే పెద్దయెత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు పాల్గొన్నారు.

పల్లెకు పోదాం వైద్యం అందజేస్తాం

-వైద్యం అందించేందుకు 200 గ్రామాలు దత్తత..
-ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బిఎన్‌రావు



నవతెలంగాణ-సుల్తాన్ బజార్

తెలంగాణలోని మారుమూల ప్రాంతాలకు వెళ్లి ఉచితంగా ప్రజలకు వైద్యం అందించేందుకు ఐఎంఏ పల్లెకు పోదాం వైద్యం అందజేస్తాం అనే కార్యక్రమం చేపట్టిందని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బిఎన్‌రావు అన్నారు. ఆదివారం కోఠిలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యాలయంలోని డాక్టర్ జీకే కిర్లోస్కర్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నేషనల్ ఐఎంఏ పిలుపుమేరకు దేశవ్యాప్తంగా రెండు వేల ఐఎంఏ బ్రాంచీలు ఉన్నాయని చెప్పారు. అన్ని రాష్ట్రాల్లో ఆవోగాం ప్రోగ్రాం తో ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించేందుకు ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కూడా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ముందుకు వచ్చి మారుమూల ప్రాంతాల్లో ఆవోగాం పేరిట పల్లెల్లో వైద్య సేవలు అందించేం దుకు శ్రీకారం చుట్టామని ఆయన తెలిపారు. గ్రామాలను దత్తత తీసుకొని అక్కడి ప్రజలకు వైద్య సేవలు అంది స్తామన్నారు. ఎంపిక చేసుకున్నదత్తత గ్రామాలలో ఐఎంఏ తరపున మెడికల్ క్యాంపులు నిర్వహించి గ్రామ ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ జె విజయ్ రావు. స్టేట్ ఫైనాన్స్ సెక్రటరీ డాక్టర్ రాజేందర్ కుమార్ యాదవ్. ఫాస్ట్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎం సంపత్ రావు. డాక్టర్ కిషన్. డాక్టర్ భవాని. డాక్టర్ గుత్తా సురేష్. డాక్టర్ కృష్ణారెడ్డి. డాక్టర్ జి సంపత్ డాక్టర్ సంతోష్ పాల్గొన్నారు.

'సైద్ధాంతిక అవగాహన పెంచుకుంటూ కార్మిక హక్కులకై పోరాడుదాం'



ఏఐటీయూసీ

నవతెలంగాణ-హిమాయత్‌నగర్

దేశంలో అధికారం ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్మిక హక్కులను హరిస్తూ, కార్మికుల శ్రమను దోచుకుంటూ బడా పారిశ్రామికవేత్తలకు మేలు చేస్తూ సామాన్య ప్రజానీకానికి దేశభక్తి, హిందూమతం అని తప్పుడు విధానాలు బోధిస్తూ ప్రజలు, కార్మికులను పోరాటాల వైపు చైతన్యం కాకుండా మతమౌఢ్యాన్ని నూరిపోస్తుందని, దానికి వ్యతిరేకంగా కార్మిక వర్గాన్ని చైతన్య పరచవలసిన అవసరం ఎంతైన ఉందని ఏఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు యం.డి.యూసుఫ్, ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్‌లు తెలిపారు.ఆదివారం హిమాయత్‌నగర్‌లోని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయంలో గత రెండు రోజులుగా జరుగుతున్న కార్మికుల రాష్ట్ర స్థాయి శిక్షణా తరగతుల ముగింపు సందర్భంగా వారు మాట్లాడుతూ.. భారతదేశంలో ప్రజలు గత అనేక సంవత్సరాలుగా చైతన్యం లేకుండా నిర్జీవంగా కొనసాగుతున్నారని వారికి మానవ పరిణామక్రమ విషయాలపై పూర్తిస్థాయి అవగాహన కల్పించేందుకు ఈ శిక్షణా తరగతులు ఉపయోగపడుతాయని వివరించారు. కార్మిక సమస్యలపై, కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను మార్చి యజ మానులకు అనుకూలంగా తీసుకురాబోతున్న కార్మిక కోడ్‌లకు వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహించేందుకు రాజకీయ చైతన్యంతో ముందుకు వెళ్ళాల్సిన అవసరం ఉందన్నారు.ఆగస్టు8,9వ తేదీలలో కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక వి ధానాలను వివరిస్తూభారీ ఎత్తున మహాపడావ్ కార్యక్ర మాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఏఐటియుసి సీనియర్ నాయకులు వి.రత్నాకర్‌రావు మాట్లాడారు. ఏఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నర్సింహ్మా, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పి.ప్రేం పావని, నాయకులు బోగే ఉపేం దర్, జంపాల రవీందర్, కమతం యాదగిరి, సిర్ర దేవేందర్, బోయిన ప్రసాద్, చెట్టుకింది శ్రీనివాస్, శ్రీరాములు పాల్గొన్నారు.

సంగీత సాగరం లో ఓలలాడించిన హైదరాబాద్

నవతెలంగాణ-హైదరాబాద్ : ప్రపంచ సంగీత దినోత్సవాన్ని పురస్కరించుకుని, ప్రతిభను పెంపొందించడానికి అంకితమైన ప్రముఖ సంగీత శిక్షణా సంస్థ ముజిగల్ అకాడమీ, విశేష కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమంలో ప్రముఖ నేపథ్య గాయకులు సాయి శ్రీ చరణ్ , సాయి వల్లి శివాని పాల్గొని మంత్రముగ్ధులను చేసే సంగీత కచేరీని చేశారు. వీరితో పాటుగా , ఓపెన్ మైక్ సెషన్ లో సరేగమప విజేతలు, గాయకులు వాగ్దేవి, శశాంక్‌ల సమక్షంలో సాయంత్రం సంగీత వైభవానికి అదనపు కోణాన్ని జోడించారు. అన్ని మూజిగల్ అకాడమీలలో జరిగిన ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు, విద్యార్థులు మరపురాని ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. మరపురాని కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనందంగా ఉందని ముజిగల్ అకాడమీ వ్యవస్థాపకులు లక్ష్మీనారాయణ అన్నారు. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు, విద్యార్థులు, సంగీత ఔత్సాహికుల ఉత్సాహంగా పాల్గొన్నారు.

మున్నూరుకాపులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు శ్రీనివాస్ పటేల్

నవతెలంగాణ-అడిక్‌మెట్

రాష్ట్ర జనాభాలో 23 శాతం కలిగిన మున్నూరు కాపులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి, ఈ సామాజిక వర్గ ప్రజల అభివృద్ధి కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు ఉగ్గె శ్రీనివాస్ పటేల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఇందిరాపార్క్ ధర్నాచౌక్ వద్ద తెలంగాణ మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో సంఘం అధ్యక్షులు ఉగ్గె శ్రీనివాస్ పటేల్ హాజరై మాట్లాడుతూ ప్రభుత్వం మున్నూరు కాపులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, మున్నూరు కాపు బంధు ప్రకటించాలని, బీసీ'డీ' నుంచి బీసీ 'ఏ' జాబితా లోకి మార్చాలని లేదా ఇడబ్ల్యూఎస్ రిజర్వేషన్ మాదిరిగానే ప్రత్యేకంగా 10 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. రూ.5వేల కోట్లతో ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయడం వలన వివిధ యూనిట్ల ద్వారా ఆర్థికంగా ఎదిగేందుకు దోహదపడుతోందన్నారు. రైతులకు కాకుండా, పండించిన పంటకు బీమా చేయాలన్నారు. నామినేటెడ్ పదవులను 30 శాతం కేటాయించాలని, కాచిగూడలోని రూ.200 కోట్ల ఆస్తిని మున్నూరు కాపులకు కేటాయిం చాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్లను నెరవేర్చకపోతే రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్‌కి వ్యతిరేకంగా పనిచేస్తామని హెచ్చరించారు.ఈ ధర్నాలో కార్పొరేటర్ లు రాజ్యలక్ష్మీ, దీపికి, లక్ష్మీ నారాయణ, మామిండ్ల శ్రీనివాస్, కంటె సాయన్న తదితరులు పాల్గొన్నారు.

యాదవులకు సీట్లు ఇవ్వని పార్టీలకు ఓట్లు వేయం

యాదవ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు చలకాని వెంకట్ యాదవ్



నవతెలంగాణ-అంబర్‌పేట

రానున్న శాసనసభ, పార్లమెంటు ఎన్నికలలో యాదవులకు తగిన ప్రాతినిధ్యం కల్పించని రాజకీయ పార్టీలకు ఓట్లు వేయబోమని యాదవ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు చలకాని వెంకట్ యాదవ్ హెచ్చరించారు. ఈ మేరకు ఆదివారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో యాదవ విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. "సీట్లు - వాటా - ఆర్థిక వాటా - రాజ్యాధికారం అంతిమ బాట " అంశంపై నిర్వహించిన సమావేశంలో పలు సంఘాల ప్రతినిధులు, వివిధ రంగాల ప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్భంగా చలకాని వెంకట్ యాదవ్ మాట్లాడుతూ తెలుగు నేలపై యాదవ, యాదవ ఉపకులాల జనాభా 18 శాతం ఉందని తెలిపారు. కాగా జనాభా దామాషా ప్రకారం అన్నీ రంగాలలో ప్రాతినిధ్యం కరువైందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో ఆర్టీఐ మాజీ చీఫ్ కమిషనర్ వర్రె వెంకటేశ్వర్లు, యాదవ సంఘ నేతలు గుండేబోయిన అయోధ్యా యాదవ్, శ్రీశైలం యాదవ్, ద్రవిడ దేశం పార్టీ జాతీయాధ్యక్షులు కృష్ణారావు, కోన గురవయ్య, సినీనటి కరాటే కల్యాణి, పాల్గొన్నారు.

కలుపుపై గెలుపు

నవతెలంగాణ-హైదరాబాద్ :: వరి పొలాల్లో విస్తృత శ్రేణి బ్రాడ్లీఫ్, గడ్డి కలుపు మొక్కలు, కష్టమైన కలుపు జాతులను నియంత్రించడానికి గ్లోబల్ ప్యూర్-ప్లే అగ్రికల్చర్ కంపెనీ Corteva Agriscience® Novlect ను ప్రారంభించింది. డైరెక్ట్ సీడెడ్ రైస్ (డిఎస్ఆర్) తో సహా సమర్థవంతమైన కలుపు నిర్వహణలో Novlect రైస్ హెర్బిసైడ్ యొక్క ప్రత్యేకమైన కలయిక Rinskor యాక్టివ్ చాలా ప్రయోజనకరంగా ఉంది. ఇది అనుకూలమైన టాక్సికాలజీ, ఎకోటాక్సికాలజీ ప్రొఫైల్ ను కలిగి ఉంది. ఇది నేల ఆరోగ్యానికి మరియు పర్యావరణానికి ప్రయోజనం చేకూరుస్తుంది. అధునాతన సూత్రీకరణ సులభంగా నిర్వహించడానికి కలపడానికి, అనువర్తనానికి అనుమతిస్తుంది. వేరియబుల్ వాతావరణ పరిస్థితులు, నీటి నిర్వహణ వాతావరణాలలో సమర్థవంతంగా పనిచేసే ఒక విలక్షణమైన ఉత్పత్తిగా ఇది పనిచేస్తుంది

వచ్చే ఎన్నికల్లో రాష్ట్రీయ లోక్ జనశక్తి పార్టీ పోటీ'

రాష్ట్రీయ లోక్ జనశక్తి పార్టీ అధ్యక్షులు ఇనుగాల భీమారావు



నవతెలంగాణ-హిమాయత్ నగర్

వచ్చే ఎన్నికల్లో రాష్ట్రీయ లోక్‌జనశక్తి పార్టీ అన్ని అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గ స్థానాల్లో పోటీ చేయనున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఇనుగాల భీమారావు తెలిపారు.ఆదివారం నారాయణగూడలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో భీమారావు మాట్లాడుతూ..కేంద్రమంత్రి పశుపతి కుమార్ పారస్ నేతృత్వంలో రాష్ట్రీయ లోక్‌జనశక్తి పార్టీ తెలంగాణలో బలోపేతం చేయనున్నట్లు ఆయన తెలిపారు. వచ్చే ఎన్నికల్లో పోటీ చేయడానికి వివిధ నియోజక వర్గాల నుంచి వస్తున్న విజ్ఞప్తుల నేపథ్యంలో పార్టీ సభ్యత్వం ఆధారంగా మాత్రమే అభ్యర్థుల ఎంపిక జరుగుతుందన్నారు. 119 అసెంబ్లీ, 17 ఎంపీ స్థానాల్లో, జీహెచ్ఎంసి పరిధిలో 4 పార్లమెంట్, 24 అసెంబ్లీ స్థానాల్లో ముఖ్యంగా దృష్టి కేంద్రీకరించినట్లు ఆయన పేర్కొన్నారు.ఈ సమావేశంలో పార్టీ ఉపాధ్యక్షులు పెండ్యాల నర్సింగరావు, ప్రధాన కార్యదర్శి బాల భానుమూర్తి, కార్యదర్శి బోయినీ శ్రీనివాస్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు డాక్టర్ ఎఎస్.శ్రీనివాస్, విద్యార్థి విభాగం అధ్యక్షులు కృపా ప్రసాద్, హైదరాబాద్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ లయన్ మేడిశెట్టి వెంకటేశ్వర్లు, వికారాబాద్ జిల్లా అధ్యక్షులు ఎం.నాగేందర్, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఉపయోగపడేలా సేవా కార్యక్రమాలలో పాల్గొనాలి

ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్



నవతెలంగాణ-అంబర్ పేట:

పేద ప్రజలకు ఉపయోగపడేలా జన్మదిన వేడుకలు చేసేటప్పుడు సేవ కార్యక్రమాలు నిర్వహించాలని అంబర్ పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. ఆదివారం బీఆంటీ యు అనుబంధ వీధి వ్యాపారుల సంక్షేమ సంఘం అధ్యక్షులు నరేందర్ జన్మదిన సందర్భంగా అంబర్ పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సం దర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నరేందర్ జన్మదిన సందర్భంగా ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలు చేయాలని, అంబర్‌పేట నియోకవర్గం పర్యావరణం కాపాడే విధంగా మీ కార్యక్రమాలు ఉండాలని ఆదేశించారు. తన జన్మదిననీ పురస్కరించుకొని బాగ్ అంబర్ పేట గల వృద్ధుల ఆశ్రమంలో కాలేరు ఆర్మీ ఆధ్వర్యంలో వృద్ధులకు పండ్ల పంపిణీ కార్యక్రమం జరిగింది ఎమ్మెల్యే ఆదేశించిన విధంగా అంబర్ పేట లోని మోహిని చెరువులో ఒక మొక్కలు నాటి పర్యావరణానికి తోడ్పడే విధంగా నాకు సహకరించిన కాలేరు ఆర్మీ సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.

తెలంగాణా రాష్ట్రంలో వినియోగదారులకు ఆనందాన్ని ఇస్తున్న అమేజాన్ ప్రైమ్ ప్రయోజనాలు

నవతెలంగాణ-హైదరాబాద్ : షాపింగ్ నుండి వినోదం వరకు సాటిలేని ప్రయోజనాల కలయికలతో కస్టమర్స్ కు వీలుకల్పిస్తున్న అమేజాన్ ప్రైమ్ ఎల్లప్పుడూ మరింత విలువను చేర్చడానికి కృషి చేసింది, గొప్ప ఎంపికను చేర్చింది, మరియు ప్రతి కస్టమర్ జీవితంలో 'మరింత ఎక్కువ ఆనందం' అందించింది. మెట్రో నగరాలు నుండి తెలంగాణాలోని ఆదిలాబాద్, కరీం నగర్, ఖమ్మం, మహబూబ్ నగర్, నల్గొండ, నిజామాబాద్ మరియు వరంగల్ వంటి చిన్న పట్టణాలు వరకు ప్రైమ్ భారతదేశంలోని 99.5% పిన్ కోడ్స్ లో చిన్న వ్యాపారాలు మరియు సెల్లర్స్ కు సాధికారత కలిగిస్తూనే దేశవ్యాప్తంగా ఉన్న తన సభ్యులకు సాటిలేని షాపింగ్, వినోదం, ఆదాలు కలయికను కేటాయించడంలో ముందు స్థానంలో ఉంది.

పేలిన ఎలక్ట్రిక్ బైక్ బ్యాటరీ

తప్పిన పెను ముప్పు, కాలి బూడిదైన వస్తువులు.

నవతెలంగాణ-ఓయూ

ఎలక్ట్రిక్ బైక్ బ్యాటరీ పేలి ఇంట్లో అగ్నిప్రమాదం.. సుమారు రూ.8 లక్షల మేర ఆస్తినష్టం ఘటన లాలపెట్‌లో చోటుచేసుకుంది. ఎలక్ట్రిక్ బ్యాటరీ బైక్ బ్యాటరీ పేలి ఓ ఇంట్లో ప్రమాదం జరిగిన సంఘటన లాలాగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. లాలగూడా ఇన్‌స్పెక్టర్ మధులత , స్థానికుల చెప్పిన వివరాల ప్రకారం. లాలాపేట్ ఇందిరా నగర్ బీకాలనీకి చెందిన దానియల్ తాను ఉండే మొదటి అంతస్తులో తన ఎలక్ట్రిక్ బైక్ బ్యాటరీని ఛార్జింగ్ పెట్టాడు. చార్జింగ్ పూర్తి అయిపోయిందనుకొని బ్యాటరీ ప్లగ్ తీసివేసి కుటుంబంతో కలిసి చర్చికి వెళ్లారు. ఇంట్లో ఓ వృద్ధురాలు, 5 సంవత్సరాల పాప ఉంది. కాగా కొద్ది సేపటి బాల్ కాలనీలో ఉన్న బ్యాటరీ నుంచి పొగ మంటలు రావడంతో వృద్ధురాలు తలుపులు పెట్టుకున్నారు. కానీ మంటలు వేగంగా కిటికి నుంచి భారీగా మంటలు అంటుకొని ఇంట్లో ఉన్న వస్తులకు కూడా మంటులు అంటుకున్నాయి. స్థానికులు మహేష్, రాఘువర్మ మరి కొందరు హుటా హుటిన ఇంటిపైకి వెళ్లి ఇంట్లో ఉన్న ఇద్దరిని బయటకు తీసుకు వచ్చారు. ఇంట్లో ఉన్న విలువైన ఫర్నిచర్, ఎలక్ట్రా నిక్ వస్తువులు, నగదు, దుస్తువులు కాలిబూదిదయ్యాయి. ఫైర్ స్టేషన్ సిబ్బందితో మంటలనుఆర్పారు.సుమారు రూ. 8లక్షల మేరకు ఆస్తినష్టం వాటిల్లిందని యజమాని దానియల్ అతని కుమారుడు పల్లెపు అమ్మియల్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

కోర్టు పరిధిలో ఉన్న భూముల జోలికి ఎవరూ రావద్దు

సీపీఐ(ఎం) నగర నాయకులు-ఎం మహేందర్



నవతెలంగాణ-అంబర్ పేట:

కోర్టు పరిధిలో ఉన్న భూముల జోలికి ఎవరు రాకుండా రెవెన్యూ అధికారులు దృష్టి సారించాలని సీపీఐ(ఎం) నగర నాయకులు ఎం.మహేందర్ విజ్ఞప్తి చేశారు. ఆదివారం బాగ్‌అంబర్ పేట డివిజన్ పరిధిలోని బతుకమ్మ కుంట లోని భూమిని పరిశీలించి మాట్లాడుతూ ఐదు ఎకరాల భూమిని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎడ్ల సుధాకర్ రెడ్డి కొందరు అక్రమదారులు కలిసి ఆక్రమించే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. రెండు జెసిపిలతో భూమిని మొత్తం చదువు చేస్తూ ఈ భూమిని అమ్ముకోవాలని చూస్తున్నారన్నారు. హైకోర్టులో కేసు నడుస్తోందని.. కేసు ఉన్నప్పటికీ కోర్టు ఉత్తరాలను ఉల్లంఘిస్తూ ఆక్రమించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. కోర్టు ఉల్లంఘన కేసు కింద కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక పోలీ సులు ఎమ్మార్వో ఈ బతుకమ్మ కుంట భూమిని కాపాడాలని కోరారు.



రోజుకొకటి...

పరగడుపున ఓ వెల్లుల్లి రెబ్బ తింటే శరీరంలో అద్భుత మార్పులు కనిపిస్తాయి. పచ్చి వెల్లుల్లి రెబ్బ తింటే ఆరోగ్యానికి మంచిది. జలుబు వంటివి వెల్లుల్లి తింటే త్వరగా నయం అవుతాయి. ఇందులో ఉండే యాంటీ బయోటిక్ గుణాలు అనేక అనారోగ్య సమస్యలను తేలిగ్గా నయం చేస్తాయి. అజీర్ణం, హైబ్లడ్ ప్రెజర్, సాధారణ జలుబుని చిటికెలో నివారిస్తుంది. రోగనిరోధక శక్తిని వేగంగా పెంచుతుంది. ఇందులో ఉండే అల్లిసిన్ కీలకమైన ఔషధ గుణాలను కలిగి ఉంటుంది. చాలా మంది వెల్లుల్లిని ప్రతి కూరలో ఉపయోగిస్తారు. అసలు ఈ వెల్లుల్లిని ఉదయాన్నే తినడం వల్ల పొందే ఉపయోగాలేంటో చూద్దాం..

- వెల్లుల్లిలో ఉండే అల్లిసిన్ రోగ నిరోధక శక్తి మెరుగుపరచడానికి సహాయ పడుతుంది. ప్రతిరోజూ ఉదయాన్నే పరగడుపున ఓ వెల్లుల్లి రెబ్బ తింటే చాలా త్వరగా, తేలికగా వ్యాధినిరోధక శక్తి పెరగడానికి సహాయపడుతుంది.
- హైబ్లడ్ ప్రెజర్‌తో బాధపడేవారికి ఇది ఎంతగానో సహాయపడుతుంది. ఉదయాన్నే పరకడుపున ఒకటి లేదా రెండు రెబ్బలను తీసుకుంటే సమస్య తగ్గుతుంది.
- చెడు కొవ్వు వల్ల కలిగే సమస్యలను నియంత్రించడంలో వెల్లుల్లి అమోఘంగా పని చేస్తుంది. అలాగే మంచి కొలెస్ట్రాల్ లెవెల్స్‌ని పెంచుతుంది. గుండె సంబంధిత వ్యాధుల నుండి బయటపడొచ్చు.
- పొట్ట, యూటెరైన్, ప్రొస్టేట్ వంటి క్యాన్సర్లను దూరంగా ఉంచుతుంది. వెల్లుల్లిలో ఉండే అల్లిసిన్ క్యాన్సర్ సెల్స్‌ని నాశనం చేస్తుంది.
- ఇందులో ఉండే యాంటీ ఆక్సిడెంట్స్ శరీరంలో హానికారక మలినాలను తొలగిస్తుంది. శరీరం డెటాక్స్‌పై అవుతుంది.
- వెల్లుల్లిలో ఉండే యాంటీ ఆక్సిడెంట్ కణాలను దెబ్బతినకుండా చేస్తుంది. దీంతో వయసు పెరిగే కొద్దీ వచ్చే డిమెంటియా సమస్యను అడ్డుకోవచ్చు.





హింసను నిరసిస్తూ కదం తొక్కిన మహిళలు

ని ఉనా మెనోస్... అర్జెంటీనాలో లింగ వివక్షకు, గృహహింసకు వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న ఓ సంస్థ. ఇది 2015లో ఏర్పాటు చేయబడింది. అప్పటి నుండి ఈ సంస్థ ఆధ్వర్యంలో మహిళలపై జరుగుతున్న హింసకు వ్యతిరేకంగా పోరాటం కొనసాగుతూనే ఉంది. ఈ సంస్థ ఏర్పడి ఈ జూన్ 3 నాటికి ఎనిమిదేండ్లు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా అక్కడి మహిళలు చేస్తున్న పోరాటం గురించి నేటి మానవిలో...

మే 2015లో 14 ఏండ్ల చియారా పేజ్‌ను 16 ఏండ్ల మాన్యుయెల్ మన్‌సిల్లా దారుణంగా హత్య చేశారు. దాంతో అక్కడి స్త్రీవాద కార్యకర్తలు, పాత్రికేయులు, కళాకారులు, విద్యావేత్తల బృందం కలిసి ఒక కొత్త ఉద్యమాన్ని ప్రారంభించారు. అదే ని ఉనా మెనోస్. తమ దేశంలో జరుగుతున్న అన్ని రకాల లింగ ఆధారిత హింసకు ముగింపు పలకాలనే లక్ష్యంతో వీరు తమ పోరాటాన్ని కొనసాగిస్తున్నారు.

రెండు లక్షల మందితో మార్చ్

జూన్ 3, 2015న మహిళలపై జరుగుతున్న హింసను ఖండిస్తూ, పితృస్వామ్య భావజాలాన్ని నిరసిస్తూ బాధితులందరికీ న్యాయం చేయాలనే డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా భారీ సమీకరణలకు ఈ ఉద్యమం పిలుపునిచ్చింది. ఆ పిలుపునందుకుని 80 నగరాల్లోని లక్షలాది మంది మహిళలు తమ గొంతు విప్పుతూ, హింసను వ్యతిరేకిస్తూ వీధుల్లోకి వచ్చారు. రాజధాని బ్యూనస్ ఎయిర్స్‌లో సుమారు రెండు లక్షల మంది ప్రజలు ప్రదర్శనలో పాల్గొన్నారు. ఇది అర్జెంటీనా చరిత్రలోనే మహిళలపై హింసను తిరస్కరిస్తూ జరిగిన అతిపెద్ద మార్చ్‌గా మారింది. అయితే ఈ ఉద్యమం అంతటితో ఆగిపోలేదు.

భారీ కవాతు...

2015 నుండి ప్రతి ఏడాది జూన్ 3న స్త్రీ హత్యలు, ట్రాన్స్మిసైడ్లు, ట్రావెస్టిసైడ్లు, లైంగిక దాడులు, వేధింపులతో పాటు ఇతర లైంగిక హింసకు వ్యతిరేకంగా, అలాగే సమాన సామాజిక, ఆర్థిక హక్కులను డిమాండ్ చేస్తూ ఈ ఉద్యమం అర్జెంటీనా అంతటా భారీ కవాతులను నిర్వహిస్తున్నది. ఈ ఏడాది సంస్థ వార్షికోత్సవం సందర్భంగా మహిళలు, లెస్బియన్లు, ద్విలింగ సంపర్కులు, ట్రాన్స్‌జెండర్లు మెరుగైన జీవనం, సామాజిక, ఆరోగ్య విద్యా, న్యాయ వ్యవస్థను డిమాండ్ చేయడానికి 'ని ఉనా మెనోస్' మార్చ్‌కు హాజరయ్యారు.



మేము బతకాలనుకుంటున్నాం

"మేము జీవించాలనుకుంటున్నాం. మాకు స్వేచ్ఛ కావాలి. రుణ రహిత సమాజం కావాలి. ఈ న్యాయవ్యవస్థలో ఎవరూ తక్కువ కాదు" అంటూ వేలాది మంది స్త్రీవాదులు, కార్యకర్తలు, వామపక్ష రాజకీయ నాయకులు, మానవ హక్కుల సంస్థలు, సామాజిక ఉద్యమకారులు, కార్మిక సంఘాలు నగరంలోని వివిధ ప్రాంతాల నుండి అర్జెంటీనా నేషనల్ కాంగ్రెస్‌కు కవాతు చేశారు. పితృస్వామ్య హింసను నిర్మూలించే సమర్థవంతమైన ప్రజా విధానాలను అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు.

హింస పైనే కాదు మహిళలను, ముఖ్యంగా పేదలను ఎక్కువగా ప్రభావితం చేసే ఐఎంఎఫ్ రుణాలను, వాటి వల్ల కలుగుతున్న ప్రతికూల పరిణామాలను సైతం తిరస్కరించారు. న్యాయ వ్యవస్థ వల్ల వస్తున్న ఇబ్బందులు, అడ్డంకులను కూడా ఖండించారు. రక్షణ చర్యలను సమర్థవంతంగా పాటించాలని డిమాండ్ చేశారు.

ప్రజాస్వామ్యం లేదు

"దేశంలో ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించిన నలభై ఏండ్ల తర్వాత కూడా ఆర్థిక, న్యాయ వ్యవస్థల్లో ప్రజాస్వామ్యం లేదు. విదేశీ రుణం, ఐఎంఎఫ్ నియంత్రణ వల్ల దేశంలో ప్రజాస్వామ్యం లేదు. ఈ న్యాయ వ్యవస్థ మనది కాదు. అందరికీ జరగనిది న్యాయం కాదు. అందుకే మేము ట్రాన్స్‌ఫెమినిస్ట్, ప్లూరినేషనల్, ఇంటర్ డిసిప్లినరీ న్యాయ సంస్కరణలను డిమాండ్ చేస్తున్నాం. మేము ప్రజా భాగస్వామ్యంతో కూడిన న్యాయ వ్యవస్థను కోరుకుంటున్నాం. ఇందులో బాధితుల వాదనలు వినబడతాయని హామీ వుంటుంది. బాధితులకు నష్టపరిహారం అందుతుంది" అని సంస్థ బహిరంగంగా ప్రకటించింది.

ఈ భారీ మార్చ్ జరిగిన ముందు రోజు స్త్రీ హత్యలు, అదృశ్యమైన బాధితుల బంధువులు తమ ప్రియమైనవారికి న్యాయం చేయాలని డిమాండ్ చేయడానికి ప్లాజా డి మాయోలో సమావేశమయ్యారు. ప్రభుత్వం నేరస్తులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తాము చేస్తున్న పోరాటాలు, సాక్ష్యాలను తల్లిదండ్రులు వివరించారు. సమస్యను పరిష్కరించడానికి ప్రభుత్వం, న్యాయవ్యవస్థ, కాంగ్రెస్ అత్యవసరంగా కలిసి పనిచేయాలని వారు పిలుపునిచ్చారు.

హింస కొనసాగుతోంది

అర్జెంటీనాలో మహిళలపై హింస ప్రధాన సమస్యగా వుంది. 'నౌ దట్ దే సీ అస్' అబ్జర్వేటరీ ఇటీవలి నివేదిక ప్రకారం జూన్ 2015 నుండి మే 2023 మధ్య అర్జెంటీనాలో 2,257 స్త్రీ హత్యలు నమోదయ్యాయి. అంటే ఈ ఎనిమిదేండ్లలో ప్రతి 31 గంటలకు ఒక మహిళ హత్యకు గురవుతోంది. 64శాతం మంది మహిళలు వారి భాగస్వాములు లేదా మాజీ భాగస్వాములచే హత్య చేయబడ్డారు. ఈ హత్యలలో 64శాతం బాధితురాలి ఇంట్లోనే జరిగినట్టు కూడా డేటా చూపించింది. మరో నివేదికలో జనవరి 1 నుండి ఏప్రిల్ 30, 2023 మధ్య ఆ దేశంలో 99 స్త్రీహత్యలు, 3 ట్రాన్స్‌ఫెమిసైడ్‌లు, 96 అటెంటెడ్ ఫెమిసైడ్‌లు నమోదయ్యాయని అబ్జర్వేటరీ తెలిపింది. సంస్థ ఎంత పోరాటం చేస్తున్నా మహిళలపై జరుగుతున్న హింస మాత్రం తగ్గడం లేదు. అయినప్పటికీ లింగ హింసను దాని అన్ని రూపాలు నిర్మూలించడానికి, లింగ సమానత్వాన్ని ప్రోత్సహించడానికి తమ ఉద్యమాన్ని మరింత ఉధృతంగా కొనసాగించాలని వారు నిశ్చయించుకున్నారు.

- సలీమ



లాటిన్ దేశాలకు వ్యాప్తి

గత ఎనిమిదేండ్లలో 'ని ఉనా మెనోస్' ఉద్యమం విస్తరించింది. మహిళలతో పాటు ట్రాన్స్ జెండర్స్ కూడా ఉద్యమంలో భాగస్వాములయ్యారు. వారి సామాజిక పోరాటాల కోసం ఒక సామూహిక ప్రచారంగా ఈ ఉద్యమం మారింది. ఇది బొలీవియా, చిలీ, ఎల్ సాల్వడార్, గ్వాటెమాల, పరాగ్వే, పెరూ, ఉరుగ్వే వంటి అనేక లాటిన్ అమెరికన్ దేశాలలో కూడా వ్యాపించింది.



సొమ్మొకడిది...సోకొకడిది

(మొదటిపేజీ తరువాయి)

పరిగణించాలని ఆర్‌బీఐ 2019లో జారీ చేసిన సర్క్యులర్ ద్వారా బ్యాంకులను ఆదేశించింది. ఈ సంవత్సరం జూన్ 8వ తేదీ వరకూ ఇలాంటి సర్క్యులర్లే జారీ చేస్తూ వచ్చింది. అయితే అనూహ్యంగా తాజాగా జారీ చేసిన సర్క్యులర్ అందరినీ నివ్వెరపరుస్తోంది. నేరస్థులైన రుణాల ఎగవేతదారులు, మోసకారులకు సహాయపడేలా ఉన్న ఈ సర్క్యులర్ వారి పాలిట వరంగా మారింది. బోర్డు అనుమతితో అలాంటి వారితో రాజీ పరిష్కారం చేసుకోవచ్చునని అందులో స్పష్టం చేసింది. గతంలో జారీ చేసిన సర్క్యులర్లకు ఇది పూర్తి విరుద్ధం. ఎగవేతదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోకుండా వారితో రాజీ చేసుకునేందుకు ఇది వీలు కల్పిస్తోంది.

రాజీతో అనర్థాలు

రాజీ పరిష్కారాలతో అనేక అనర్థాలు చోటుచేసుకుంటాయి. బ్యాంకింగ్ వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడుతుంది. రుణం రద్దయ్యాక ఎగవేతదారుడు మరోసారి దర్జాగా, కొత్తగా అప్పు తీసుకోవచ్చు. అతని సిబిల్ రేటింగ్ మెరుగుపడుతుంది. అతని సమాచారం యావత్తూ మల్లెపూవులా స్వచ్ఛంగా ఉంటుంది. రుణాలు తీసుకునే మంచి వ్యక్తులు కూడా ఈ తతంగాన్ని గమనించి తాము కూడా ఎగవేతకు పాల్పడవచ్చు. దీంతో బ్యాంకులు దివాలా తీసే పరిస్థితి వస్తుంది.

లాభపడేది ఎవరు?

ఆర్‌బీఐ తాజా నిర్ణయంతో లాభపడేది ఎవరు? 2018లో 5,600 మంది బ్యాంక్ రుణాలకు ఎగనామం పెట్టారు. వీరిలో పదిహేను శాతం మంది గుజరాతీలే. ఉద్దేశపూర్వకంగా బ్యాంకులకు రుణాలు ఎగవేసిన ఏబీజీ షిప్‌యార్డ్ (రిషి అగర్వాల్), విన్‌సమ్ డైమండ్స్ (జతిన్ మెహతా) సహా పలు సంస్థలు, వ్యక్తులు అధికారంలో ఉన్న వారికి సన్నిహితులే. వీరిలో కొందరు విదేశాలకు చెక్కేశారు. ఎబీజీ షిప్‌యార్డ్ కంపెనీ అధిపతి రిషి అగర్వాల్ 28 బ్యాంకులను రూ.23,000 కోట్ల మేర మోసం చేశాడు. ఇప్పుడు ఆయన రాజీ పరిష్కారం చేసుకుంటున్నాడు. మెహతాదీ అదే దారి. ఆయన అదానీకి సన్నిహిత బంధువు. ఆయన కూడా విదేశాలకు పారిపోయాడు. ఆర్‌బీఐ సర్క్యులర్ పుణ్యమా అని ఇప్పుడు ఆయన తిరిగి దేశంలో అడుగు పెట్టవచ్చు. విజయ్ మాల్యా, మేహుల్ చోక్సీ, నీరవ్ మోడీ తదితరులు కూడా ఇదే దారిలో నడవవచ్చు. స్వదేశంలో ప్రవేశించిన తర్వాత వారు అధికార పార్టీకి ఎన్నికల నిధులు అందిస్తారు.

పారు బకాయిలు ఎందుకు తగ్గాయంటే...

జాతీయ లా ట్రిబ్యునల్ కంపెనీ (ఎన్‌సీఎల్‌టీ) ఇప్పటికే రుణాల ఎగవేతదారులకు సహాయపడుతోంది. ఇందుకు ఎన్‌సీఎల్‌టీని పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ తీవ్రంగా తప్పుపట్టింది కూడా. గత పది సంవత్సరాలలో దేశంలో పారు బకాయిలు తగ్గిపోయాయి. రుణాలు పొందిన వారు ఆ సొమ్మును బ్యాంకులను తిరిగి చెల్లించడం వల్లనే పారు బకాయిలు తగ్గాయని భావిస్తే అది పొరబాటే. బ్యాంకులు అక్షరాలా రూ.13,22,309 కోట్ల మేర పారు బకాయిలను రద్దు చేయడం వల్లనే అవి తగ్గాయన్నది వాస్తవం.

రాజకీయ ప్రయోజనాల కోసమే...

ఇప్పుడు అధికార పార్టీకి అతి పెద్ద రాజకీయ ప్రయోజనాన్ని కలిగించిన ఉదంతం గురించి తెలుసుకుందాం. గత తొమ్మిది సంవత్సరాల కాలంలో బ్యాంకులు 42 కోట్ల మందికి రూ.24,05,753 కోట్ల మేర ముద్ర రుణాలు అందించాయి. వీటితో పాటు బ్యాంకేతర ఆర్థిక కంపెనీలకు రుణాలు ఇవ్వాల్సిందిగా ఆర్థిక మంత్రి వివిధ ప్రభుత్వ రంగ బ్యాంకులకు లక్ష్యాలు నిర్దేశించారు. ఇదంతా బహుమతిగా ఇస్తున్నదని, రుణాలు తిరిగి చెల్లించాల్సిన అవసరం లేదని పలు చోట్ల అధికార పార్టీ నాయకులు రుణ గ్రహీతలకు చెప్పేశారు. ఇంకేముంది? మొండి బాకీలు పెరిగిపోయాయి. బ్యాంకులు 25% రుణాలను మాఫీ చేసి, 75% రుణాలను రుణ గ్యారంటీ నిధి నుండి పొందాయి. కానీ రుణాలు తీసుకున్న వారి సిబిల్ స్కోరుపై ప్రభావం పడింది. వీరిలో చాలా మంది ఉద్దేశపూర్వకంగానే రుణాలు ఎగవేశారు. ఇప్పుడు వారు ఎంతో కొంత చెల్లించి, సిబిల్ స్కోరును పొందవచ్చు. తిరిగి రుణాలు తీసుకోనూ వచ్చు. రుణాల మాఫీ, రాజీ పరిష్కారాలు ప్రజలకు, డిపాజిటర్లకు ఏ మాత్రం ప్రయోజనం కలిగించవు. ఈ చర్యలు చట్ట విరుద్ధం. దేశంలోని 100 కోట్ల మంది చిన్న మదుపుదారుల ప్రయోజనాలను ఫణంగా పెట్టి తమ ఎన్నికల ప్రయోజనాల కోసం రాజకీయ పార్టీలు బ్యాంకులను ఉపయోగించుకోవడం సరికాదు.

మోసాలు ఇవే...

(మొదటిపేజీ తరువాయి)

బ్యాంకులను మోసం చేసిన ఉదంతాల కారణంగా బ్యాంకులకు వాటిల్లిన నష్టం రూ.3,76,400 కోట్లు. ఇలాంటి మోసకారులతో రాజీ పడడం సబబేనా? ఇది బ్యాంకులను దోపిడీ చేయడం కాక మరేమిటి? ఎన్‌సీఎల్‌టీ ద్వారా లక్షల కోట్ల రూపాయల ప్రజా ధనాన్ని మాఫీ చేశారు. కొన్ని బడా కార్పొరేట్ సంస్థలు కోలుకునేందుకు బ్యాంకులు మళ్లీ రుణాలు అందించాయి. ఆ సంస్థలు, వ్యక్తులు ఎన్నికల బాండ్లు, ఇతర పద్ధతుల ద్వారా రాజకీయ పార్టీలకు కొమ్ము కాస్తున్నారు. డిపాజిట్ చేసే చిన్న మదుపుదారులకు తక్కువ వడ్డీ చెల్లిస్తూ బ్యాంకులు లాభాలు మూటకట్టుకుంటున్నాయి. తక్కువ వడ్డీ తీసుకుంటూ, అధిక బ్యాంక్ ఛార్జీలు చెల్లిస్తూ వారు తమ జేబులకు చిల్లులు పెట్టుకుంటున్నారు. మరోవైపు తక్కువ మొత్తంలో రుణాలు తీసుకునే వారు సైతం అధిక వడ్డీ చెల్లించాల్సి వస్తోంది.

యూనియన్ల నిరసన

ఆర్‌బీఐ నిర్ణయాన్ని అఖిలభారత బ్యాంక్ అధికారుల సమాఖ్య, అఖిలభారత బ్యాంక్ ఉద్యోగుల సంఘం తీవ్రంగా ఖండించాయి. తాజా ఆదేశాలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశాయి. లేకుంటే డిపాజిటర్ల ప్రయోజనాలు దెబ్బతింటాయని, ఎగవేతదారులు పెరిగిపోతారని, బ్యాంకింగ్ వ్యవస్థపై ప్రజలకు నమ్మకం పోతుందని తెలిపాయి. చివరికి ఈ వ్యవస్థ కుప్పకూలుతుందని హెచ్చరించాయి.

పాఠ్యాంశాల నుంచి నెహ్రూ మాయం

(మొదటిపేజీ తరువాయి)

వారి చాప్టర్లను ఉత్తరప్రదేశ్ పాఠ్య పుస్తకాల నుండి తొలగించారట. ఇది ఉత్తరప్రదేశ్ సెకండరీ బోర్డు నిర్వాకం. ఉత్తరప్రదేశ్‌లో 9-12 తరగతులు చదివే విద్యార్థుల కోసం 'నైతికత, యోగా, క్రీడలు, ఫిజికల్ ఎడ్యుకేషన్' అనే సబ్జెక్టును బోధిస్తున్నారు. ఇందులో యాభై మంది ప్రముఖుల జీవిత విశేషాలను చేర్చారు. అయితే ఆ ప్రముఖుల జాబితాలో నెహ్రూ, రాజేంద్ర ప్రసాద్, రాధాకృష్ణన్‌లకు చోటు దక్కలేదు. అంతేకాదు... భారత సైనిక దళాలకు చెందిన ప్రముఖులు ఫీల్డ్ మార్షల్ మానెక్ షా, పరమవీర చక్ర పురస్కార గ్రహీతలు అబ్దుల్ హమీద్, కెప్టెన్ విక్రమ్ బత్రా వంటి వారి విశేషాలూ లేవు. దేశానికి మొట్టమొదటి రాకెట్‌ను అందించిన శాస్త్రవేత్త, అహ్మదాబాద్ ఐఐఎం వ్యవస్థాపకుడు విక్రమ్ సారాభాయ్ పేరు కూడా కానరావడం లేదు.

దీనిపై రాష్ట్ర సెకండరీ విద్యా శాఖ సహాయ మంత్రి గులాబో దేవి మాట్లాడుతూ 'దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు అర్పించిన ప్రముఖుల పేర్లను మాత్రమే ఈ జాబితాలో చేర్చాం. రాజకీయ ప్రయోజనాల కోసం స్వాతంత్ర్య పోరాటంలో భాగస్వాములైన వారి పేర్లను చేర్చలేదు. ఈ జాబితాలో చేర్చడానికి నెహ్రూకు అర్హత ఉన్నదని నేను అనుకోవడం లేదు' అని చెప్పుకొచ్చారు. కాగా 9-12 తరగతుల విద్యార్థులు ఈ సబ్జెక్టును విధిగా నేర్చుకోవాల్సి ఉంటుంది.

లౌకికవాదం లేకుండా ప్రజాస్వామ్యమే ఉండదు

నవతెలంగాణ -న్యూఢిల్లీ బ్యూరో

స్వాతంత్ర్యం లేకుండా ప్రజాస్వామ్యం ఉండదని, రెండూ ఒకదానిపై మరొకటి ఆధారపడి ఉన్నాయని సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అన్నారు. లౌకికవాదం లేకుండా ప్రజాస్వామ్యం మనుగడ సాగించదని పేర్కొన్నారు. ఆదివారం సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యురాలు ఎంఎ బేబి అధ్యక్షతన హరికిషన్ సింగ్ సుర్జీత్ భవన్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో సీపీఐ(ఎం) సీనియర్ నేత ఇఎంఎస్ నంబూద్రిపాద్ ఎంపిక చేసిన వ్యాసాలకు హిందీ అనువాదం 'మార్క్స్‌వాద్ లేదా ధరమ్ నిరపేక్ష (మార్క్సిజం అండ్ సెక్యులరిజం)' అనే పుస్తకాన్ని సీతారాం ఏచూరి విడుదల చేశారు. కాలికట్ విశ్వవిద్యాలయం మార్క్సియన్ స్టడీస్ అండ్ రీసెర్చ్ విభాగం తయారు చేసిన పుస్తకాన్ని ప్రముఖ హిందీ కవి విష్ణునగర్ ఏచూరి నుంచి అందుకున్నారు.

"దేశ అస్తిత్వం సెక్యులరిజంపై ఆధారపడి ఉంది. హిందూ రాష్ట్రాన్ని వ్యతిరేకించినందుకు, లౌకికవాదం కోసం నిలబడినందుకు గాంధీని చంపారు. పాకిస్తాన్ ముస్లిం దేశంగా ఏర్పడినప్పుడు, భారతదేశం హిందూ దేశంగా ఎందుకు మారలేదని హిందూవాదులు లేవనెత్తారు. హిందుత్వ భావనకు హిందూ మతానికి సంబంధం లేదని స్వయంగా వీడి సావర్కర్ స్పష్టం చేశారు. ఎప్పటికీ సెక్యులరిజం సంరక్షకుడు ఈఎంఎస్ అని, ఈఎంఎస్ రచనలు నేటికీ సజీవంగా ఉన్నాయి. వాజ్‌పేయి ప్రభుత్వ ప్రమాణ స్వీకారం గురించి తన మరణానికి కొద్దిసేపటి ముందు రాసిన వ్యాసంలో కూడా ఈఎంఎస్ బీజేపీ గురించి, దాని ఆలోచనల గురించి స్పష్టమైన హెచ్చరిక ఇచ్చారని ఏచూరి అన్నారు. జన సంస్కృతి, జనవాది లేఖక్ సంఘ్, జననాట్య మంచ్, కాలికట్ సర్వ కళాశాల. ఈఎంఎస్ చైర్ కోఆర్డినేటర్ పి అశోకన్, ఉపాధ్యాయుడు ఎన్ ఎం సన్నీ, ఢిల్లీ టీచర్స్ యూనియన్ నాయకుడు రాజీవ్ కన్వర్ మాట్లాడారు. ఈఎంఎస్ మనవళ్లు అనుపమ శశి, హరీష్ దామోదరన్ పాల్గొన్నారు.

నేడు,రేపు వర్షాలు

(మొదటిపేజీ తరువాయి)

ఆరెంజ్ హెచ్చరిక జారీ చేసింది. రాబోయే 48 గంటల పాటు జీహెచ్ఎంసీ పరిధిలో ఆకాశం మేఘావృతమై తేలికపాటి ఉంచి మోస్తరు వర్షం పడే సూచనలున్నాయి. ఆదివారం రాత్రి 10 గంటల వరకు రాష్ట్రంలో 242 ప్రాంతాల్లో వర్షపాతం నమోదైంది. నిర్మల్ జిల్లా భైంసాలో అత్యధికంగా 4.3 సెంటీమీటర్ల వర్షం పడింది. 40 ప్రాంతాల్లో మోస్తరు వాన పడింది. వాయువ్య బంగాళాఖాతం, దాని పరిసరాల్లో ఒడిశా-పశ్చిమబెంగాల్ తీరాలకు దగ్గరలో ఆనవర్తనం నెలకొంది. దీని ప్రభావం వల్ల అక్కడే అల్పపీడనం ఏర్పడింది.

పేదల సోయిలేని ప్రభుత్వాలు

(మొదటిపేజీ తరువాయి)



తెలిపారు. ప్రపంచంలో ఏ ప్రధాని ఇలా ఉండరని, రూ.10 లక్షల విలువ చేసే బట్టలను మోడీ వేసుకుంటారని, అంత విలువైన బట్టలు ధరించే వారిని ఎక్కడైనా చూశామా అని ప్రశ్నించారు. నిరుపేదలకు కేవలం 125 గజాల స్థలం ఇచ్చేందుకు ప్రభుత్వాలకు మనసు రావడం లేదని వాపోయారు. రాష్ట్ర ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాల సందర్భంగా గృహలక్ష్మి పథకం ప్రారంభించిందని, ఈ పథకం ఎవరికీ వర్తించదని తెలిపారు. సొంత స్థలం, మహిళ పేరిట రిజిస్ట్రేషన్ అయి, నక్ష వేయిస్తే అన్ని షరతులను చూసి రూ.3 లక్షలు ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం చెప్పడం సరికాదన్నారు. డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు కట్టుకోవాలంటే కాంట్రాక్టర్లకు ఇస్తేనే రూ.8.5 లక్షలు అయిందని ప్రభుత్వమే స్పష్టం చేసిందని, మూడు లక్షలతో ఇంటి నిర్మాణం సాధ్యమవుతుందా అని ప్రశ్నించారు. పేదలకు పట్టా ఇచ్చి, రాష్ట్రం రూ.5 లక్షలు, కేంద్రం రూ.10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో లక్ష మందికిపైగా పేదలు గుడిసెలు వేసుకున్నారని తెలిపారు. సభానంతరం ఆయన జెండా ఆవిష్కరించారు. సమవేశంలో సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు, రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి టీ.సాగర్, ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్రాములు, కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబు, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు కోట రమేష్, అనగంటి వెంకటేష్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి బస్వరాజు, కోశాధికారి నరసమ్మ, ఉపాధ్యక్షులు ఏ.మల్లేశం, రైతుసంఘం జిల్లా అధ్యక్షులు సర్దార్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కె.మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

చెప్పులు కొందామన్నా...సోంచాయిస్తున్నాం

(మొదటిపేజీ తరువాయి)

విషయం తెలిసిందే. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఆర్టీసీలో అదే పరిస్థితి కనిపిస్తోంది. కలెక్షన్ తెస్తే డ్యూటీ...లేకుంటే స్పేర్ డ్యూటీ...అదేమని ప్రశ్నిస్తే ఆబ్సెంట్ లేదా సెలవులు పెట్టుకొని వెళ్లండంటూ డిపో మేనేజర్ల బెదిరింపులు. ఫోర్స్‌లోనే ఉన్న స్వచ్ఛంద ఉద్యోగ విరమణ (వీఆర్ఎస్). ఆర్టీసీని బాగుచేస్తున్నామనే అధికారిక ప్రకటనలకు భిన్నంగా క్షేత్రస్థాయిలో జరుగుతుంది. అద్దె బస్సులు పెరిగాయి. ఎలక్ట్రిక్ బస్సుల పేరుతో ప్రయివేటు తెల్ల ఏనుగుల్ని పోషించమని ఆర్టీసీపైకి సర్కారు ఉసిగొల్పింది. దీనివల్ల సంస్థకు నష్టం వస్తుందని కార్మిక సంఘాలు లెక్కలు కట్టి నెత్తీనోరు కొట్టుకొని చెప్తున్నా ప్రభుత్వం, యాజమాన్యం చెవికి ఎక్కించుకుంటున్న దాఖలాలే లేవు. బస్సుల సంఖ్య తగ్గి, డిపోలు మూతపడుతున్నాయి. సంస్థలో ఉద్యోగుల సంఖ్య తగ్గుతున్నది. 2021-22లో ఆర్టీసీలో 8,902 షెడ్యూళ్లతో వంద కిలోమీటర్ల మేర బస్సులు తిరిగాయి. 2022-23లో 8618 షెడ్యూళ్లు నడిపి, 120 కి.మీ., తిప్పారు. అంటే 284 షెడ్యూళ్లు తగ్గించి, కార్మికులతో 20 కోట్ల కి.మీ., అదనంగా పనిచేయించుకున్నారు. వ్యక్తిగత జీవితాలను కోల్పోతున్న కార్మికులు శారీరకంగా, మానసికంగా, ఆర్థికంగా కుంగిపోతున్నారు. హైదరాబాద్‌లో మెట్రోలైనర్ బస్సు నడుపుతున్న ఓ ఆర్టీసీ డ్రైవర్ చెప్పులు తెగిపోయి, కాళ్లు వాచి ఉన్నా అలాగే డ్రైవింగ్ చేస్తుండటాన్ని 'నవతెలంగాణ' క్షేత్రస్థాయిలో గమనించింది. ఆస్పత్రికి వెళ్లి చూపించుకొని, రెస్ట్ తీసుకోవచ్చు కదా...అని ఆ



డ్రైవర్‌ను అడిగితే...చావుకి వెళ్తే సెల్ఫీలు వాట్సప్ చేయమని డిపో మేనేజర్లు అడుగుతున్నారు సార్...ఇక సెలవులు ఎక్కడ ఇస్తారు? అంటూ ఆవేదనగా చెప్పుకొచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో అసలు ఆర్టీసీ ప్రస్తావనే లేకపోవడం గమనార్హం. కానీ తెలంగాణ ఉద్యమ సమయంలో ఆర్టీసీ బస్సు చక్రం ఆగితేనే సకల జనుల సమ్మె సక్సెస్ అయిన విషయం తెలిసిందే. అలాంటి త్యాగాలు చేసిన ఆర్టీసీ కార్మికుల బతుకులు ఇప్పుడు ఆగం అవుతున్నాయి.

సంఘాలు లేవు...

ఆర్టీసీలో కార్మిక సంఘాలు లేవని ముఖ్యమంత్రి కేసీఆర్ 55 రోజుల సమ్మె విరమణ అనంతరం మౌఖికంగా చెప్పారు. ఆ స్థానంలో వెల్ఫేర్ కమిటీలు పనిచేస్తాయన్నారు. వీటివల్ల కార్మికులకు ఒనగూరిన ప్రయోజనాలు ఏమీ లేవు. దీనిపై ఆర్టీసీలోని ఓ యూనియన్ న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తే, గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలంటూ యాజమాన్యం, కార్మిక శాఖను ఆదేశిస్తూ తీర్పు ఇచ్చింది. దీని అమలును ఆ రెండూ తుంగలో తొక్కాయి.

ఐక్యమవుతున్న సంఘాలు

ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సంస్థలోని అన్ని కార్మిక సంఘాలు ఒక్కతాటిపైకి వచ్చే ప్రయత్నం చేస్తున్నాయి. దీనిపై చర్చలు జరుగుతున్నాయి. త్వరలోనే ఐక్యకార్యాచరణతో ముందుకు వస్తాయనే ఆశాభావం కార్మికుల్లో కనిపిస్తున్నది. మునుగోడు ఉప ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి, మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు సమస్యలు పరిష్కరిస్తామనీ, వేతన సవరణకు ఎన్నికల నిబంధనావళి నుంచి మినహాయింపు ఇవ్వాలనీ అధికారులతో లేఖలు రాయించారు. ఆ ఎన్నిక జరిగిపోయి 8 నెలలు దాటినా, ఇప్పటికీ అప్పటి వాగ్దానాలు అమలు కాలేదు. సర్కారు నమ్మకద్రోహంపై కార్మికులు, కార్మిక సంఘాలు ఆగ్రహంగా ఉన్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం, యాజమాన్యం ఆర్టీసీ కార్మికుల సమస్యలపై స్పందించి, పరిష్కరించాలి. వారికి న్యాయబద్ధంగా చెల్లించాల్సిన సీసీఎస్, పీఎఫ్ తదితర బకాయిలన్నీ ఇవ్వాలి. ప్రభుత్వాన్ని ఆర్థికసాయం చేయమని అడగడాన్ని యాజమాన్యం నామోషీగా భావించడం మానేయాలి. ప్రభుత్వం సంస్థకు ఇవ్వాల్సిన సొమ్మును వెంటనే చెల్లించాలి.

బిగ్ సర్‌ప్రైజ్


నాగ్ అశ్విన్, కమల్‌హాసన్

ప్రభాస్ కథానాయకుడిగా పాన్ వరల్డ్ సినిమాగా రూపొందుతున్న 'ప్రాజెక్ట్ కె' చిత్రానికి కమల్‌హాసన్ రూపంలో భారీ అదనపు ఆకర్షణ జతగా చేరింది. ఇప్పటికే ఈ సినిమాలో బాలీవుడ్ బిగ్ బి అమితాబ్ బచ్చన్ ఓ కీలక పాత్రలో నటిస్తుండగా, బాలీవుడ్ అగ్ర నాయికలు దీపికా పదుకొనె, దిశాపటాని స్క్రీన్‌ని స్క్రీన్‌ని షేర్ చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో కమల్‌హాసన్ వంటి అగ్ర నటుడు ఈ ప్రాజెక్ట్‌లో భాగం కావడంతో ఈ సినిమాపై సర్వత్రా భారీ అంచనాలు నెలకొన్నాయి. నాగ్ అశ్విన్ తెరకెక్కిస్తున్న ఈ సైన్స్ ఫిక్షన్ చిత్రాన్ని వైజయంతీ మూవీస్ నిర్మిస్తోంది. ఈ చిత్రంలో కమల్ హాసన్ కీలక పాత్ర పోషిస్తున్నారని మేకర్స్ ఆదివారం అనౌన్స్ చేశారు.

ఈ సందర్భంగా కమల్ హాసన్ మాట్లాడుతూ, '50 సంవత్సరాల క్రితం నేను డ్యాన్స్ అసిస్టెంట్, అసిస్టెంట్ డైరెక్టర్‌గా ఉన్నప్పుడు నిర్మాణ రంగంలో అశ్వినీదత్ అనే పేరు పెద్దగా వినిపించింది. 50 ఏళ్ల తర్వాత మేమిద్దరం కలిసి వస్తున్నాం. ఈ చిత్రానికి నెక్ట్స్ జనరేష్ బ్రిలియంట్ డైరెక్టర్ దర్శకత్వం వహిస్తున్నారు. నా సహనటులు ప్రభాస్, దీపిక కూడా ఈ తరం వారే. నేను ఇంతకు ముందు అమిత్ జీతో కలిసి పనిచేశాను. అయినా ప్రతిసారి కొత్తగానే అనిపిస్తుంది. అమిత్‌జీ తనను తాను కొత్తగా ఆవిష్కరించుకుంటూనే ఉన్నారు. నేను కూడా ఆ ప్రక్రియను అనుకరిస్తున్నాను. నేను ప్రాజెక్ట్ కె కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను. ప్రేక్షకులు నన్ను ఏ స్థానంలో ఉంచినా, నా మొదట స్వభావం నేను సినిమా అభిమానిని. నా పరిశ్రమలో ఏ కొత్త ప్రయత్నమైనా ఆ స్వభావం మెచ్చుకుంటూనే ఉంటుంది. ప్రాజెక్ట్ కెకి నాదే మొదటి ప్రశంస. మా దర్శకుడు నాగ్ అశ్విన్ విజన్‌తో మన దేశం, సినిమా ప్రపంచం అంతా ప్రశంసలు మార్మోగుతాయని నేను ఖచ్చితంగా చెబుతున్నాను' అని అన్నారు

'నా మనసులో ఎప్పటికీ నిలిచిపోయే క్షణం. ప్రాజెక్ట్ కెలో లెజండరీ కమల్ హసన్ సర్‌తో కలిసి పని చేయడం గౌరవంగా భావిస్తున్నాను. ఇంత గొప్ప వ్యక్తితో కలిసి పనిచేయడం, నేర్చుకునే అవకాశం రావడం కల నెరవేరిన క్షణం' అని సోషల్ మీడియా వేదికగా ప్రభాస్ తన ఆనందం వ్యక్తం చేశారు.

నిర్మాత అశ్వనీదత్ మాట్లాడుతూ, 'నా కెరీర్‌లో కమల్ హాసన్‌తో కలిసి పనిచేయడం ఎప్పటినుంచో ఉన్న కల. ప్రాజెక్ట్ కెతో ఇప్పుడు ఆ కల సాకారమైంది. కమల్ హాసన్, అమితాబ్ బచ్చన్ .. ఇద్దరు దిగ్గజ నటులతో కలిసి పని చేయడం ఏ నిర్మాతకైనా గొప్ప క్షణం. నా కెరీర్‌లో 50వ సంవత్సరంలో ఈ అవకాశం రావడం ఇది నిజంగా నాకు వరం' అని చెప్పారు. 'ఇన్ని విలక్షణమైన పాత్రలు చేసిన కమల్ సర్ కలసి పని చేయడం గౌరవంగా ఉంది. ఆయన ఈ చిత్రంలోకి వచ్చి మా ప్రపంచాన్ని పూర్తి చేయడానికి అంగీకరించినందుకు మేమంతా చాలా సంతోషిస్తున్నాం అని దర్శకుడు నాగ్ అశ్విన్ చెప్పారు.

నవచిత్రం

భిన్న మనస్తత్వాల ప్రయాణం

హీరో శ్రీవిష్ణు, 'వివాహ భోజనంబు' ఫేమ్ రామ్ అబ్బరాజు దర్శకత్వంలో రూపొందిన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'సామజవరగమన'. హాస్య మూవీస్ బ్యానర్‌పై ఎకె ఎంటర్‌టైన్‌మెంట్స్‌తో కలిసి రాజేష్ దండా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. అనిల్ సుంకర సమర్పిస్తున్నారు. ఆదివారం చిరంజీవి ఈ చిత్ర ట్రైలర్‌ను లాంచ్ చేసి, చిత్రం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. 'మల్టీప్లెక్స్‌లోని ఫుడ్ కోర్ట్‌లో శ్రీవిష్ణు అకౌంట్‌లో రెబా మోనికా జాన్, ఆమె కుటుంబం జంబో పాప్‌కార్న్ బకెట్లను తీసుకెళ్తున్న హిలేరియస్ సన్నివేశంతో ట్రైలర్ ప్రారంభమవుతుంది. ఇందులో శ్రీ విష్ణు పేరు బాలు. శ్రీవిష్ణు ఒక సాధారణ మధ్యతరగతి కుర్రాడిలా ఆలోచిస్తూ చాలా సాధారణ జీవితాన్ని గడుపుతుండగా, రెబా అతనికి పూర్తిగా విరుద్ధంగా ఉంది. అమ్మాయిల పట్ల విరక్తి పెంచుకునే ఈ కుర్రాడు రెబాతో ప్రయాణంలో తన అభిప్రాయాన్ని ఎలా మార్చుకుంటాడనేది కథ. ఆద్యంతం వినోదాత్మకంగా సాగే ఈ చిత్రాన్ని ఈనెల 29న విడుదల చేస్తున్నారు.


శ్రీవిష్ణు, చిరంజీవి

ఛాలెంజింగ్ రోల్ చేశా..

హీరో నిఖిల్ నటించిన తాజా చిత్రం 'స్పై'. ఎడిటర్ గ్యారీ బిహెచ్ దర్శకుడిగా పరిచయం అవుతున్న ఈ సినిమాని చరణ్ తేజ్ ఉప్పలపాటి సీఈఓగా ఈడీ ఎంటర్‌టైన్‌మెంట్స్ పై కె.రాజ శేఖర్ రెడ్డి నిర్మించారు. నిఖిల్ సరసన ఐశ్వర్య మీనన్ నాయికగా నటించింది. ఈ సినిమా ఈనెల 29న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో హీరోయిన్ ఐశ్వర్య మీనన్ మీడియాతో 'స్పై' విశేషాలను షేర్ చేసుకున్నారు.

'ఇది నా మొదటి తెలుగు సినిమా. దర్శకుడు గ్యారీ చెప్పిన కథ విని చాలా థ్రిల్ అయ్యాను. అందుకే మరో ఆలోచన లేకుండా సైన్ చేశాను. ఇదొక ఎగ్జైటింగ్ యాక్షన్ థ్రిల్లర్. అందరికీ నచ్చుతుంది. ఇందులో నా పాత్రకు చాలా కోణాలు ఉంటాయి. యాక్షన్, స్టంట్స్ అన్నీ ఉంటాయి. రా ఏజెంట్‌గా కనిపించడానికి అన్ని జాగ్రత్తలు తీసుకున్నాం. యాక్షన్, గన్ షూటింగ్‌లో దాదాపు ఆరు నెలలు శిక్షణ తీసుకున్నాను. తొలి సినిమాలోనే ఛాలెంజింగ్ రోల్ చేసినందుకు చాలా ఆనందంగా ఉంది. 'స్పై'కి పార్ట్ 2 చేసే స్కోప్ ఉంది. ఒకవేళ అది జరిగితే అందులోనూ నేనే హీరోయిన్‌గా ఉండాలనేది నా కోరిక (నవ్వుతూ). నిఖిల్ బ్రిలియంట్ యాక్టర్. ప్రస్తుతం యూవీ క్రియేషన్స్ నిర్మాణంలో కార్తికేయ హీరోగా ఒక సినిమా చేస్తున్నా


ఐశ్వర్య మీనన్

ప్రేమలో కొత్త కోణం

ప్రేమ కథల్లో కొత్త కోణం తీసుకుని నేటితరం ఆడియన్స్‌కి కనెక్ట్ అయ్యేలా రూపొందించిన సరికొత్త ప్రేమకథా చిత్రం 'ఓ సాథియా'. ఆర్యన్‌గౌరా, మిస్టీ చక్రవర్తి జంటగా నటించిన ఈ చిత్రాన్ని తన్వికా-జశ్వికా క్రియేషన్స్ పతాకంపై చందన కట్టా, సుభాష్ కట్టా నిర్మిస్తున్నారు.

ఈ చిత్రంతో దివ్య భావన దర్శకురాలిగా పరిచయం అవుతున్నారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం జూలై 7న పాన్ ఇండియా లెవెల్‌లో భారీగా విడుదల కాబోతోంది.

ఈ చిత్ర విడుదల తేదీని ప్రకటించిన సందర్భంగా నిర్మాత సుభాష్ మాట్లాడుతూ,'చిన్న సినిమా అయినా పెద్ద బ్యాక్‌అప్‌తో పాన్ ఇండియా స్థాయిలో సినిమా విడుదల కావడానికి ముఖ్య కారణం యుఎఫ్‌ఓ మూవీస్ సంస్థ. ఈ సినిమా చూసి హీరో, హీరోయిన్ బాగా చేశారని, మూవీ డైరెక్షన్ బాగుందని, అలాగే పాటలు బ్యాక్ బోన్ అని, ఈ సినిమాని పాన్ ఇండియా స్థాయిలో రిలీజ్ చేసేందుకు తాము సపోర్ట్ చేస్తామని యు ఎఫ్ ఓ ఎపి, తెలంగాణ వైస్ ప్రెసిడెంట్ జి.లక్ష్మణ్ చెప్పారు. మా చిత్రాన్ని పాన్ ఇండియా వైడ్ రిలీజ్ చేస్తున్న యుఎఫ్‌ఓ మూవీస్ వారికి స్పెషల్ థ్యాంక్స్' అని అన్నారు. ఈ చిత్రానికి డిఓపి : ఈ.జె.వేణు, ఎడిటర్ : కార్తీక్ కట్స్, సంగీతం :విన్నూ లిరిక్స్ : భాస్కరభట్ల, అనంత శ్రీరామ్, రాంబాబు గోసాల, కొరియోగ్రఫీ :రఘు, బాబా భాస్కర్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: చంద్ర తివారి, లైన్ ప్రొడ్యూసర్: వంశీకృష్ణ జూలూరి.


మిస్టీ చక్రవర్తి, ఆర్యన్ గౌరా

జీవితంలోని మంచీ చెడుల గురించే తెలిపే సినిమా

దర్శకుడు నీలకంఠ రూపొందించిన కొత్త సినిమా 'సర్కిల్'. ఈ చిత్రంలో సాయి రోనక్, బాబా భాస్కర్, అర్షిణ్ మెహతా, రిచా పనై, నైనా కీలక పాత్రల్లో నటించారు. ఆరా ప్రొడక్షన్స్ బ్యానర్ పై ఎమ్.వి శరత్ చంద్ర, టి సుమలత అన్నిత్ రెడ్డి, వేణుబాబు అడ్డగడ నిర్మించారు. సరికొత్త థ్రిల్లర్‌గా తెరకెక్కిన ఈ చిత్రం జూలై 7న విడుదలకు సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో నాయికలు అర్షిణ్ మెహతా, రిచా పనై ఆదివారం మీడియాతో పలు విశేషాలను షేర్ చేసుకున్నారు.

అర్షిణ్ మెహతా మాట్లాడుతూ, 'సల్మాన్‌ఖాన్ హీరోగా నటించిన 'భజరంగీ భాయిజాన్' చిత్రంలో జర్నలిస్ట్ పాత్రతో నా కెరీర్ మొదలుపెట్టాను. ఈ సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయం అవుతున్నాను. ఇప్పటిదాకా ఇక్కడి చిత్రాల్లో నటించిన అనుభవం లేదు. నీలకంఠ నేషనల్ అవార్డ్ విన్నింగ్ డైరెక్టర్. ఆయన చిత్రంలో అవకాశం రావడం సంతోషంగా ఉంది. క్యారెక్టర్, నటన విషయంలో ఆయన చాలా పర్టిక్యూలర్‌గా ఉంటారు. ఈ సినిమాతో నటిగా చాలా విషయాలు నేర్చుకునే అవకాశం దొరికింది. ఇందులో ప్రిన్సెస్ పాత్ర నాది. హీరో ఫొటోగ్రాఫర్. వీరి మధ్య జరిగే ప్రేమ కథ ఆసక్తికరంగా ఉంటుంది. మన జీవితం అంటే మంచీ చెడుల సర్కిల్. ఈ చిత్రంలోనూ అదే విషయాన్ని చెప్పబోతున్నాం. సాయి రోనక్ మంచి కోస్టార్. ఎలాంటి ఇబ్బంది లేకుండా అతనితో కలిసి నటించాము. తెలుగులో చాలా మంది స్టార్ హీరోలు ఉన్నారు. ఇకపై ఇక్కడ మంచి అవకాశాలు వస్తాయని ఆశిస్తున్నాను' అని చెప్పారు.

రిచా పనై మాట్లాడుతూ, 'కెరీర్‌లో గ్యాప్ కావాలని తీసుకున్నది కాదు. 'యముడికి మొగుడు, చందమామ కథలు, ఈడు గోల్డ్ ఎహె' వంటి చిత్రాల్లో నటించాను. 'బృందావనమది అందరిదీ' సినిమాలో నటించినా అది విడుదల కాలేదు. ఆ తర్వాత మంచి అవకాశాలు వస్తాయని ఆశించాను కానీ అనుకున్నంతగా సినిమాలు దక్కలేదు. ఇండస్ట్రీకి దూరమవడం ఇష్టం లేక వచ్చిన రెండు మూడు చిత్రాల్లో నటించాను. ఇప్పుడు ఈ చిత్రంలో నటించాను. ఈ చిత్రంలో నా క్యారెక్టర్‌ను దర్శకుడు నీలకంఠ కొత్తగా ప్రెజెంట్ చేయబోతున్నారు. బోల్డ్‌గా కనిపించే పాత్ర నాది. అయితే డిఫరెంట్‌గా ఉంటుంది. నేను ఇలాంటి క్యారెక్టర్ ఇప్పటిదాకా చేయలేదు. ఈ సినిమా నటిగా నాకు మంచి పేరు తెస్తుందని ఆశిస్తున్నాను. ఈ చిత్రంలో ప్రతి పాత్రకు ప్రాధాన్యత ఉంటుంది. హీరో లైఫ్ చుట్టూ కథ తిరుగుతుంది. ఆయన వెంట మేముంటాం. నేను పెయింటర్ పాత్రలో కనిపిస్తా. ఇవాళ అమ్మాయిలు ఎంత మోడరన్‌గా, ఫ్రీడమ్‌తో ఉన్నారో అలాగే తెరపై కనిపిస్తా. రొమాంటిక్, యాక్షన్, థ్రిల్లర్, ఎంటర్‌టైనింగ్..ఇలా కథలో అన్ని కమర్షియల్ ఎలిమెంట్స్ ఉంటాయి. మాంటేజ్ సాంగ్స్ ఆకర్షణ అవుతాం. ఈ సినిమా నాకు మంచి కమ్ బ్యాక్ అవుతుంది' అని అన్నారు.


రిచా పనై, అర్షిణ్ మెహతా

ఆటలు

అసలు కారణమదే!

- సర్ఫరాజ్‌కు చోటు దక్కకపోవటంపై బోర్డు వర్గాలు

ముంబయి : వెస్టిండీస్ పర్యటనకు భారత టెస్టు, వన్డే జట్లను ఇటీవల బీసీసీఐ ఆల్ ఇండియా సీనియర్ సెలక్షన్ కమిటీ ప్రకటించింది. సీనియర్ బ్యాటర్ చతేశ్వర్ పుజారాపై వేటు వేసిన సెలక్షన్ కమిటీ.. యువ క్రికెటర్లు యశస్వి జైస్వాల్, రుతురాజ్ గైక్వాడ్, ముకేశ్ కుమార్‌లకు టెస్టు జట్టులో చోటు కల్పించింది. రంజీ ట్రోఫీలో గత మూడు సీజన్లుగా పరుగుల వరద పారిస్తున్న యువ బ్యాటర్ సర్ఫరాజ్ ఖాన్‌ను సెలక్షన్ కమిటీ పక్కనపెట్టింది. దీంతో సర్ఫరాజ్ ఖాన్‌ను జట్టులోకి ఎందుకు తీసుకోలేదంటూ సోషల్ మీడియాలో పెద్ద దుమారమే రేగుతోంది. మాజీ క్రికెటర్లు సైతం సర్ఫరాజ్ ఖాన్ విషయంలో సెలక్షన్ కమిటీపై విమర్శలు చేయగా.. తాజాగా సర్ఫరాజ్ ఖాన్ ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో తన అద్వితీయ ఇన్నింగ్స్‌ల సంక్షిప్త వీడియోను పోస్ట్ చేసి పరోక్షంగా పంచ్ ఇచ్చాడు. సర్ఫరాజ్ ఖాన్ విషయంలో సెలక్షన్ కమిటీ ఆలోచనలు ఏ విధంగా ఉన్నాయి? అసలు అతడిని ఎందుకు జట్టులోకి తీసుకోలదనే అంశంలో బోర్డు వర్గాలు భిన్నమైన వాదన వినిపిస్తున్నాయి.

' వరుసగా మూడు రంజీ సీజన్లలో 900కి పైగా పరుగులు చేసిన ఆటగాడిని విస్మరించడానికి సెలక్షన్ కమిటీ మూర్ఖత్వంలో లేదు. షార్ట్ బాల్‌పై బలహీనత, ఐపీఎల్‌లో వైఫల్యం ఏమాత్రం కారణం కాదు. అందుకు ఇతర కారణాలు ఉన్నాయి. సర్ఫరాజ్ ఖాన్ ఫిట్‌నెస్ అంతర్జాతీయ క్రికెట్ ప్రమాణాలకు అనుగుణంగా లేదు. అతడి ఆఫ్ ఫీల్డ్ ప్రవర్తనకు సంబంధించిన అంశాలు సైతం బోర్డు దృష్టికి వచ్చాయి. మూడు సీజన్లలో 2566 పరుగులు

చేసిన సర్ఫరాజ్ ఖాన్ జట్టులో చోటు సాధించేందుకు బ్యాటింగ్ ప్రదర్శన ఒక్కటే సరిపోతుందని భావిస్తున్నాడు. జట్టు ఆటలో ఒక్క నైపుణ్యం సరిపోదు. ప్రధానంగా ఫిట్‌నెస్‌ను బాగా మెరుగుపర్చుకోవాలి. ఈ విషయంలో అతడి తండ్రి, కోచ్‌లు దృష్టి నిలపాలని' ఓ బీసీసీఐ అధికారి వ్యాఖ్యానించారు. 37 ఫస్ట్ క్లాస్ మ్యాచుల్లో 79.65 పరుగులు సాధించిన సర్ఫరాజ్ ఖాన్ రంజీ ట్రోఫీలో వరుస సీజన్లలో 928, 982, 656 పరుగులు సాధించాడు.



రెజ్లింగ్ సమాఖ్య ఎన్నికలు నిలుపుదల

- అస్సాం హైకోర్టు స్టే ఆదేశం
- నిషేధం నీడలో డబ్ల్యూఎఫ్ఐ



న్యూఢిల్లీ : భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) సమస్య మరింత ముదురుతోంది. ఓ వైపు మాజీ అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై చర్యలు తీసుకోవాలనే రెజ్లర్ల డిమాండ్ అలాగే ఉండిపోగా.. మరోవైపు జులై 11న నిర్వహించాల్సిన ఎన్నికలను నిలుపుదల చేయాలని అస్సాం హైకోర్టు తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. పలు వాయిదాల అనంతరం జులై 11న ఎన్నికలు నిర్వహించి బాధ్యతలను నూతన పాలక మండలిని అప్పగించాలనే అడ్‌హాక్ కమిటీ ఆలోచనకు అస్సాం రెజ్లింగ్ సంఘం బ్రేక్ వేసింది. ఇక బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్‌పై చర్యలు తీసుకోవాలని ఆందోళనకు దిగిన ఆరుగురు రెజర్లకు ఆసియా క్రీడలు, ప్రపంచ చాంపియన్‌షిప్స్ ట్రయల్స్‌లో ఒక్క బౌట్ పోటీ మాత్రమే ఉంటుందని మినహాయింపులు ఇవ్వటంపై సైతం రెజ్లింగ్ సమాఖ్యలో ప్రకంపనలు సృష్టిస్తున్న సంగతి తెలిసిందే.

ఎందుకు? : 2014, నవంబర్ 15న ఉత్తరప్రదేశ్‌లోని గోండాలో జరిగిన భారత రెజ్లింగ్ సమాఖ్య సమావేశంలో అస్సాం రెజ్లింగ్ సంఘానికి గుర్తింపు ఇవ్వాలని ఎగ్జిక్యూటివ్ కమిటీ తీర్మానించింది. అయితే, ఆ సమావేశంలో గుర్తింపు దక్కేందుకు ఆమోదం లభించినా.. తాజా ఎన్నికల్లో పాల్గొనేందుకు అడ్‌హాక్ కమిటీ అనుమతి ఇవ్వలేదు. దీంతో అడ్‌హాక్ కమిటీ, క్రీడా మంత్రిత్వ శాఖ నిర్ణయానికి వ్యతిరేకంగా అస్సాం రెజ్లింగ్ సంఘం ఆ రాష్ట్ర హైకోర్టులో పిటిషను దాఖలు చేసింది. వాదనల అనంతరం భారత రెజ్లింగ్ సమాఖ్య ఎన్నికలపై స్టే విధిస్తూ న్యాయస్థానం ఆదేశించింది. జులై 17కు తదుపరి విచారణను వాయిదా వేసింది. ఇదిలా ఉండగా, 2014 ఎగ్జిక్యూటివ్ సమావేశంలో తీసుకున్న నిర్ణయాన్ని అమలు చేసేందుకు అస్సాం రెజ్లింగ్ సంఘం ఏడేండ్లు ఎందుకు వేచి చూసిందనే సందేహం రెజ్లింగ్ వర్గాల్లో చర్చనీయాంశమైంది.

వేటు ముప్పు : భారత రెజ్లింగ్ సమాఖ్యకు 45 రోజుల్లోగా ఎన్నికలు నిర్వహించాలని, లేని పక్షంలో నిషేధం విధిస్తామని యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్ (యుడబ్ల్యూడబ్ల్యూ) ఓ ప్రకటనలో తీవ్ర స్వరంతో హెచ్చరించింది. తాజాగా అడ్‌హాక్ కమిటీ ఎన్నికల షెడ్యూల్ ప్రకటన చేయటంతో అంతర్జాతీయ రెజ్లింగ్ బాడీ సైతం శాంతించింది. తాజాగా అస్సాం హైకోర్టు ఎన్నికలపై స్టే ఆర్డర్ ఇవ్వటంతో కథ మళ్లీ మొదటికొచ్చింది. యుడబ్ల్యూడబ్ల్యూ నిర్దేశించిన గడువులో ఎన్నికలు నిర్వహించకపోతే.. భారత రెజ్లింగ్ సమాఖ్య నిషేధం ఎదుర్కొవాల్సి ఉంటుంది. అంతర్జాతీయ పోటీల్లో భారత రెజ్లర్లు ఇండిపెండెంట్ అథ్లెట్లుగా పోటీ చేయాల్సి ఉంటుంది. పతకాలు సాధించినా భారత జాతీయ గీతం, జాతీయ జెండాను మెడల్ పోడియంపై అనుమతించరు.

ఇప్పుడెలా?! : అస్సాం హైకోర్టు నిలుపుదల ఆదేశాలతో అడ్‌హాక్ కమిటీ చిక్కుల్లో పడింది. ఇది వరకే పలు రాష్ట్రాలు సైతం తమను ఎలక్టోరల్ జాబితాలోకి తీసుకోవాలని రిటర్నింగ్ అధికారిని కోరిన సంగతి తెలిసిందే. షెడ్యూల్ ప్రకారం జులై 11న ఎన్నికలు నిర్వహించేందుకు అడ్‌హాక్ కమిటీకి ఒకే మార్గం ఉంది. అస్సాం రెజ్లింగ్ సంఘంతో అడ్‌హాక్ కమిటీ రాజీ చేసుకోవాలి. లేదంటే, జులై 17న తదుపరి విచారణ వరకు వేచి చూడాలి. అలా జరిగితే జులై 11న ఎన్నికలు నిర్వహించేందుకు అవకాశం ఉండదు. అప్పుడు భారత రెజ్లింగ్ సమాఖ్య సంక్షోభంలో కూరుకునే ప్రమాదం ఉంది.



సూపర్ సిక్స్‌కు శ్రీలంక

- ఐర్లాండ్‌పై ఘన విజయం

బులావయో (జింబాబ్వే): ఐసీసీ వన్డే ప్రపంచ కప్ క్వాలిఫయర్ టోర్నమెంట్‌లో శ్రీలంక హ్యాట్రిక్ విజయంతో సూపర్ సిక్స్ దశకు దూసుకెళ్లింది. దిముత్ కరుణరత్నె (103 బంతుల్లో 103) శతకానికి తోడు వానిందు హసరంగ (5/79) ఐదు వికెట్లతో చెలరేగడంతో ఆదివారం జరిగిన గ్రూప్-బి మ్యాచ్‌లో లంక 133 పరుగుల తేడాతో ఐర్లాండ్‌పై ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన శ్రీలంక 49.5 ఓవర్లలో 325 పరుగులకు ఆలౌటైంది. కరుణరత్నెతో పాటు సదీర సమరవిక్రమ (82), ధనంజయ డిసిల్వా (42 నాటౌట్), చరిత్ అసలంక (38) రాణించారు. ఐర్లాండ్ బౌలర్లలో మార్క్ ఎడైర్ (4/46), బారీ మెకాతీ (3/56) సత్తా చాటారు. అనంతరం భారీ లక్ష్య ఛేదనలో ఐర్లాండ్ 31 ఓవర్లలో 192 పరుగులకే కుప్పకూలింది. కర్టిస్ క్యాంఫర్ (39), హారీ టెక్టర్ (33), జార్జ్ డాక్రెల్ (26) తప్ప మిగతా ఆటగాళ్లు నిరాశ పరిచారు. హసరంగ ఐదు, మహేశ్ పతిరణ రెండు వికెట్లు పడగొట్టారు. కరుణరత్నెకు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు లభించింది.వరుసగా మూడో ఓటమితో ఐర్లాండ్ గ్రూప్ దశలోనే ఇంటిదారి పట్టగా, మరో మ్యాచ్ మిగిలుండగానే శ్రీలంక సూపర్ సిక్స్ బెర్తు సొంతం చేసుకుంది.


1983 వన్డే ప్రపంచకప్ ఫైనల్లో అరివీర భయంకర వెస్టిండీస్‌కు పరాజయాన్ని రుచి చూపిన కపిల్ డెవిల్స్.. దేశానికి మొట్టమొదటి క్రికెట్ ప్రపంచకప్‌ను అందించి.. నేటికి 40 ఏండ్లు

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

పేదలపై దౌర్జన్యమా...!

- గుడిసెలు వేసుకున్న వారి అక్రమ అరెస్టులు అప్రజాస్వామ్యం : సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి పర్వతాలు





నవ తెలంగాణ -వంగూరు

గుడిసెలు వేసుకున్న పేద వారికి ఇండ్ల స్థలాలు, ఇండ్లు ఇవ్వాలని కోరుతుంటే.. వారిని అక్రమంగా అరెస్టు చేయడం అప్రజాస్వామికమని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి పర్వతాలు అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలం డిండి చింతపల్లి గ్రామంలో పేదలకు పంపిణీ చేసిన స్థలాల్లో గుడిసెలు వేసుకున్న పేదలపై ఆదివారం పోలీసులు దౌర్జన్యానికి దిగి, వారి గుడిసెలను కూల్చివేశారు. ఈ సందర్భంగా ఆ ప్రాంతాన్ని ఆ పార్టీ జిల్లా నాయకులు సందర్శించి పరిశీలించారు. పేదలతో కలిసి పరిశీలించడానికి వెళుతున్న సీపీఐ(ఎం) నాయకులను, గుడిసెలు వేసుకున్న పేదలను పోలీసులు అడ్డుకొని మహిళలని కూడా చూడకుండా వారిపై దాడిచేసి, అరెస్టులు చేసి వంగూరు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో గుడిసెవాసులతో పర్వతాలు మాట్లాడారు. 1997లో ఆనాటి ప్రభుత్వం పేదలకిచ్చిన ఇండ్ల స్థలాలను నేడు బీఆర్ఎస్ ప్రభుత్వం గుంజుకోవడమే కాక, నేడు పేదల పక్షాన నిలబడిన సీపీఐ(ఎం) కార్యకర్తలను అరెస్టులు చేయడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. 1997లో గ్రామంలో ఉన్న పేదలకు 11 ఎకరాల భూమిలో పట్టాలు ఇచ్చారని, వారి ఆర్థిక పరిస్థితి బాగాలేక ఇప్పటివరకు ఇండ్లు నిర్మించుకోలేకపోయారని తెలిపారు. అటువంటి భూమిని నేటి పాలకులు ప్రభుత్వ భూమి అని, అందులో రైతు వేదిక ఫంక్షన్ హాల్, మసీదు లాంటివి నిర్మించడం సరికాదన్నారు. కొంతమంది ఆ స్థలాన్ని కొంత ఆక్రమించుకొని ఇల్లు కట్టుకున్నారని, వారిపై చర్యలు తీసుకోకుండా పేదలను ఇబ్బంది పెట్టడం దుర్మార్గమని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు పట్టాలు ఉన్న స్థలాలోకి లబ్దిదారులు వెళితే అడ్డుకోవడం అరెస్టులు చేయడం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనేక సార్లు తహసీల్దార్, రెవెన్యూ అధికారులకు విన్నవించుకున్నా ఫలితం లేకపోవడంతోనే ఆ స్థలంలో గుడిసెలు వేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు దృష్టి సాధించి వెంటనే లబ్దిదారులకు హద్దులు చూపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆంజనేయులు, జిల్లా నాయకులు బాలస్వామి, బాల్‌రెడ్డి, బొల్లె జగన్, పరశురాములు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



పాలీసెట్ సీట్ల కేటాయింపు

- 116 కళాశాలల్లో 21,367 సీట్ల భర్తీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణలో ఇంజినీరింగ్, నాన్ ఇంజినీరింగ్, అగ్రికల్చర్ డిప్లొమా కోర్సుల్లో (పాలిటెక్నిక్) ప్రవేశాలకు సంబంధించిన తొలి విడత సీట్లను సాంకేతిక విద్యాశాఖ ఆదివారం కేటాయించింది. తెలంగాణ వ్యాప్తంగా 116 కళాశాలల్లో 21,367 సీట్లు భర్తీ చేశారు. 56 ప్రభుత్వ సంస్థల్లో 13,321 సీట్లకుగాను.. 11,648 సీట్లు భర్తీ చేయడంతో 1,673 సీట్లు ఖాళీగా ఉన్నాయి. 60 ప్రయివేటు విద్యా సంస్థల్లో 16,075 సీట్లకుగాను 9,719 సీట్లను భర్తీ చేయగా, 6,356 సీట్లు భర్తీ కావాల్సి ఉంది. మొత్తం తొలి విడుతలో 8,029 పాలిటెక్నిక్ సీట్లు భర్తీ కావాల్సి ఉంది. అయితే, చాలా మంది విద్యార్థులు కంప్యూటర్ కోర్సుల వైపే మొగ్గు చూపారు. ఇక సీట్ల అలాట్‌మెంట్ జరిగిన విద్యార్థులు ఈ నెల 29 వరకు సెల్ఫ్ రిపోర్ట్ చేయాలని టెక్నికల్ ఎడ్యుకేషన్ కమిషనర్ వాకాటి కరుణ సూచించారు. జులై ఒకటి నుంచి తుది విడుత కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు

వాటికి దూరంగా ఉండండి

- ప్రయివేటు సంస్థల నుంచి అవార్డులు, గుర్తింపును స్వీకరించొద్దు
- ముందస్తు అనుమతి పొందితే ఓకే
- సివిల్ సర్వెంట్లకు కేంద్రం కీలక ఆదేశాలు



న్యూఢిల్లీ : ప్రయివేటు సంస్థల నుంచి అవార్డులు, గుర్తింపులు స్వీకరించటాన్ని నిషేధిస్తూ భారత్‌లోని సివిల్ సర్వెంట్లకు కేంద్రం కీలక ఆదేశాలు జారీ చేసింది. ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ వంటి అఖిల భారత సర్వీసులు (ఏఐఎస్)కు చెందిన సివిల్ సర్వెంట్లు ప్రయివేటు సంస్థలు, ఇన్‌స్టిట్యూట్‌ల నుంచి అవార్డులను, గుర్తింపు ను స్వీకరించే విషయంలో దూరంగా ఉండాలని పేర్కొన్నది. ఈ సూచనలను పాటించాల్సిందిగా కేంద్ర సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు మరియు పెన్షన్స్ మంత్రిత్వ శాఖ అన్ని రాష్ట్రాల చీఫ్ సెక్రెటరీలకు, వివిధ ప్రభుత్వ విభాగాల సెక్రెటరీలకు, హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ, పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పు మంత్రిత్వ శాఖలకు ఆదేశాలు పంపింది. కేంద్రం ఈ ఉత్తర్వును ఈనెల 22న జారీ చేసింది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన మార్గదర్శకాలను పట్టించుకోకుండా ఏఐఎస్ అధికారులు ప్రయివేటు సంస్థల నుంచి అవార్డులు లేదా గుర్తింపులు స్వీకరించడాన్ని గమనించినట్టు మంత్రిత్వ శాఖ కార్యాలయ మెమోరాండంలో పేర్కొన్నది. ప్రయివేటు సంస్థల అవార్డులు, గుర్తింపులను ప్రోత్సహించకూడదని వివరించింది. ప్రయివేటు సంస్థ నుంచి అవార్డును స్వీకరించటం సరికాదని మంత్రిత్వ శాఖ పేర్కొన్నది. అయితే, అ వార్డు ప్రదానం చేసే సంస్థ ఆధారాలను ధృవీకరించిన తర్వాత, సంబంధిత శాఖ లేదా రాష్ట్ర ప్రభుత్వం నుంచి ముందస్తు అనుమతి పొందిన తర్వాత ఏఐఎస్ అధికారులు అవార్డులను స్వీకరించడానికి ప్రభుత్వం అనుమతించింది.

లోక్‌నాయక్‌కు మోడీ స్ఫూర్తి ప్రదాత అట!

- ప్రసారభారతి నిపుణుల భాష్యం

న్యూఢిల్లీ : ఎమర్జెన్సీ సమయంలో ఇందిరాగాంధీకి వ్యతిరేకంగా విద్యార్థులను సమీకరించి, విప్లవోద్యమాన్ని నడిపిన సోషలిస్ట్ నాయకుడు, లోక్‌నాయక్ జయప్రకాష్ నారాయణ్‌కు స్ఫూర్తినిచ్చింది ఎవరో తెలుసా? నరేంద్ర మోడీ అట. గుజరాత్‌లో విద్యార్థులు 'నవ నిర్మాణ్' పేరిట చేపట్టిన ఆందోళన విజయవంతం కావడంలో నరేంద్ర మోడీ నిర్వహించిన పాత్ర జయప్రకాష్‌లో స్ఫూర్తి నింపిందట. ఈ వివరాలతో కేంద్ర ప్రభుత్వం నియమించిన ప్రసారభారతి నిపుణుల బృందం ఓ పుస్తకాన్ని రూపొందించింది. అత్యవసర పరిస్థితి సమయంలో ఆర్ఎస్ఎస్, జనసంఘ్ నిర్వహించిన పాత్రను కూడా అందులో వివరించారు. ఆర్ఎస్ఎస్, జనసంఘ్ సీనియర్ నేతలు ప్రతిపక్షాలను ఏకం చేసి జనతా పార్టీని ఎలా ఏర్పాటు చేశారన్న విషయాన్ని కూడా ఇందులో తెలియజేశారు. 'జయప్రకాష్ చేపట్టిన ఉద్యమం కోసం అప్పుడు ఆర్ఎస్ఎస్ కార్యకర్తగా ఉన్న నరేంద్ర మోడీ యువతను సమీకరించారు. 1974లో ప్రజా జీవితంలో అవినీతికి వ్యతిరేకంగా గుజరాత్ విద్యార్థులు ప్రారంభించిన నవ నిర్మాణ్ ఆందోళనలో మోడీ క్రియాశీలక పాత్ర నిర్వహించారు.

మేదరులను సీఎం కేసీఆర్ గుర్తించి గౌరవించారు

- ఆర్థిక శాఖ మంత్రి హరీశ్ రావు
- హరితహారంలో వెదురు మొక్కలకు స్థానం :పంచాయతీరాజ్ శాఖ మంత్రి దయాకర్‌రావు
- ఆత్మగౌరవం కోసం కుటుంబానికి రూ.లక్ష :గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్



నవ తెలంగాణ - సిద్దిపేట

మేదరి కుల, జాతిని గతంలో ఏ ప్రభుత్వం గుర్తించలేదని, మీ ఆత్మగౌరవం నిలబెట్టి, జాతిని గుర్తించిన వ్యక్తి సీఎం కేసీఆర్ అని ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. మేదరి సంఘం రాష్ట్ర కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఆదివారం జిల్లా కేంద్రమైన సిద్దిపేట పట్టణంలోని పత్తి మార్కెట్ యార్డులో జరిగింది. ఈ సందర్భంగా మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్‌తో కలిసి ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో మొదటి మేదారి సంఘ భవనం రూ.30 లక్షలతో సిద్దిపేటలో నిర్మించుకున్నామని, సీఎం కేసీఆర్ హైదరాబాదులో ఎకరా స్థలాన్ని, కోటి రూపాయలను భవన నిర్మాణం కోసం కేటాయించారని అన్నారు. బ్యాంకుల చుట్టూ తిరగకుండా, అప్పులు చేయకుండా, 100 శాతం సబ్సిడీతో వృత్తిదారులకు సీఎం లక్ష రూపాయలు ఇస్తున్నారని అన్నారు. గతంలోని రూ.85 లక్షల అప్పులను మాఫీ చేయిస్తామని, వచ్చే నెల ప్రారంభం కానున్న గృహలక్ష్మి పథకంలో మేదరులకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు నాయకత్వంలో కుల సంఘాలకు, కుల వృత్తులకు గుర్తింపు వచ్చిందన్నారు. హరితహారంలో వెదురు బొంగుల మొక్కలు నాటడానికి ప్రాధాన్యతను ఇస్తామన్నారు. బీసీల అభివృద్ధి కోసం రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటు చేశామన్నారు. గిరిజన శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ.. కులవృత్తులకు, కుల సంఘాలకు ప్రాధాన్యత ఇస్తున్న ప్రభుత్వం మన తెలంగాణ ప్రభుత్వం అని, ప్రతి ఒక వర్గాన్ని గుర్తించి, గౌరవించి, నిధులను సీఎం కేసీఆర్ ఇస్తున్నారని అన్నారు. బీసీ, ఎంబీసీ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసుకొని, ప్రత్యేక నిధులను ఇచ్చి, ఆత్మగౌరవ భవనాలను నిర్మించుకున్నామని అన్నారు. కులవృత్తులను ప్రోత్సహించడానికి ప్రతి కుటుంబానికి రూ.లక్ష ప్రభుత్వం అందిస్తుందని అన్నారు. ఎరుకల కులస్తుల కోసం ఈ మధ్యనే రూ.60 కోట్ల నిధులను ప్రభుత్వం కేటాయించిందన్నారు. దేశంలో బీసీలకు ప్రత్యేక శాఖలేదని, రాష్ట్రంలో ఉందని అన్నారు. అనంతరం నూతన కమిటీతో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి, సంగం నాయకులు తుమ్మల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఎంబీబీఎస్‌లో ఫ్యామిలీ మెడిసిన్‌ను పాఠ్యాంశంగా చేర్చాలి

- ఫ్యామిలీ మెడిసిన్ డాక్టర్లు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఆరోగ్య సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషించే ఫ్యామిలీ మెడిసిన్‌ను ఎంబీబీఎస్ పాఠ్యాంశాల్లో ఒక పాఠంగా చేర్చాలని పలువురు ఫ్యామిలీ మెడిసిన్ డాక్టర్లు కోరారు. హైదరాబాద్‌లో శని, ఆదివారాలు రెండు రోజుల పాటు అకాడమీ ఆఫ్ ఫ్యామిలీ మెడిసిన్ ఆఫ్ ఇండియా (ఏఎఫ్ పీఐ) తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సంయుక్త సదస్సు జరిగింది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని చైల్డ్ అండ్ ఫ్యామిలీ క్లినిక్ డాక్టర్ కె.మాధవి, వేంపల్లి సీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జి.మల్లీశ్వరమ్మ, రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ (ఆర్డీటీ) (అనంతపురం) జిల్లాలోని ఆస్పత్రికి చెందిన డాక్టర్ మనోరంజన్ నవతెలంగాణ ప్రతినిధితో మాట్లాడారు. అన్ని వయస్సుల వారికి చికిత్సను అందించే ఫ్యామిలీ మెడిసిన్ చదివిన వారి సేవలను సమాజం, ప్రభుత్వాలు పూర్తిగా వినియోగించుకోవాలని ఆకాంక్షించారు.

మూడు సంవత్సరాల పాటు ఫ్యామిలీ మెడిసిన్ చదువుకునే సమయంలో వార్డులోని అన్ని రకాల రోగులను చూసిన అనుభవం వారికుంటుందన్నారు. మెడిసిన్, సర్జరీ, పీడియాట్రిక్స్, గైనిక్, ఆర్థోపెడిక్, ల్యాబ్, రేడియాలజీ తదితర వాటి పట్ల అవగాహన కలిగిన వారి సేవలను ప్రాథమికంగా ఉపయోగించుకోవాలని ప్రభుత్వాలను కోరారు. తద్వారా ప్రజలకు భవిష్యత్తులో వచ్చే రోగాలను నివారించడంతో పాటు ఆరోగ్యరంగానికి పెట్టే ఖర్చును బాగా తగ్గించొచ్చని చెప్పారు. సూపర్ స్పెషలిస్టుల సేవలను గ్రామాల్లో ఉపయోగించుకునేంత వైద్య సౌకర్యాలు, సదుపాయాలు కల్పించడం సాధ్యం కాదనీ, కేవలం ఎంబీబీఎస్ అర్హత కలిగిన వారినే పంపిస్తే పూర్తి ప్రయోజనం నెరవేరదని తెలిపారు. ఫ్యామిలీ మెడిసిన్ అర్హత కలిగిన వారిని పంపిస్తే కుటుంబాల ఆరోగ్యానికి మరింత భరోసా కలుగుతుందని చెప్పారు. అన్ని మెడికల్ కాలేజీల్లో ఫ్యామిలీ మెడిసిన్ విభాగాన్ని ఏర్పాటు చేయాలని వారు కోరారు.

తులసి చందును కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ విధానాలను సామాజిక మాధ్యమాల ద్వారా ఎండగడుతున్న స్వతంత్ర జర్నలిస్టు తులసి చందుపై వేధింపులు, ట్రోలింగ్, ప్రాణహాని దాడుల బెదిరింపులను సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తీవ్రంగా ఖండించారు. ఇది ఫాసిస్టు ధోరణికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. తమ విధానాలను ప్రశ్నించే వ్యక్తులు, శక్తులపై దాడి చేయడం బీజేపీ అధికారంలోకి వచ్చాక పరిపాటిగా మారిందని విమర్శించారు. గతంలో సల్మాన్ రష్దీ, అరుంధతిరాయ్, తస్లీమానస్రీన్ తదితరులపై ఇదే పద్ధతులలో మతశక్తులు వారి భావాలను అంగీకరించనటువంటి కొన్ని ముస్లీం ఉగ్రవాద సంస్థలు, ఇతర సంస్థలు ఫత్వా తదితర పద్ధతుల ద్వారా వారి ప్రాణాలు తీయడానికి పిలుపునివ్వడం జరిగిందని గుర్తుచేశారు. కల్బుర్గి, గోవింద్ పన్సారే, గౌరిలంకేష్, దబోల్కర్ తదితర మేధావులు, సామాజిక ఉద్యమకారులను బీజేపీ, ఆర్ఎస్ఎస్, సంఘ్‌పరివార్ మతోన్మాద మూకలే హత్యచేసినటువంటి ఘటనలు మరచిపోకముందే ఆ దాడుల పరంపర కొనసాగింపే తులసి చందును బెదిరిస్తున్నారని తెలిపారు. ఆమెకు అన్నివిధాల రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉన్నదని పేర్కొన్నారు. ఆమెకు ఎటువంటి హాని జరిగినా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మూల్యం చెల్లించాల్సివుంటుందని హెచ్చరించారు. సామాజిక ఉద్యమకారులు, హేతువాదులు, లౌకికవాదులు, కవులు, కళాకారులు, పాత్రికేయులు తదితర ప్రశ్నించేవారిని, సత్యశోధన చేసేవారిని సమాజమేలు కోరేవారిని రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలు, ప్రజలపైన ఉన్నదని కూనంనేని అన్నారు.

వాల్‌స్ట్రీట్ జర్నల్ మహిళా రిపోర్టర్‌కు వేధింపులు

ట్విట్టర్‌లో టార్గెట్ చేస్తున్న హిందూత్వ, బీజేపీ అనుకూల గ్రూపులు

- బీజేపీ అనుకూల వెబ్‌సైట్లలో కల్పిత, ఊహాజనిత కథనాలు
- అమెరికా పర్యటనలో మోడీని మైనారిటీలపై వివక్ష గురించి ప్రశ్నించిన సబ్రినా సిద్దిఖీ



న్యూఢిల్లీ : భారత్‌లో మైనారిటీలపై వివక్ష గురించి అమెరికా పర్యటనలో మోడీని ప్రశ్నించిన వాల్‌స్ట్రీట్ జర్నల్ (డబ్ల్యూఎస్‌జే) మహిళా జర్నలిస్టు సబ్రినా సిద్దిఖీకి సోషల్ మీడియాలో వేధింపులు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా, ట్విట్టర్ వేదికగా ఆమెను హిందూత్వ శక్తులు, బీజేపీ అనుకూల గ్రూపులు టార్గెట్ చేస్తున్నాయి. ఆమెను, ఆమె వ్యక్తిగత నేపథ్యాన్ని లక్ష్యంగా చేసుకొంటూ కొందరు యూజర్లు పోస్టులు పెడుతున్నారు. ఆమె ముస్లిం వ్యక్తనీ, తల్లిదండ్రులు పాకిస్థాన్‌కు చెందినవారనీ, ఆ దేశంతో వారికి సంబంధాలున్నాయంటూ ఆన్‌లైన్‌లో హిందూత్వ శక్తులు హైలెట్ చేస్తున్నాయి. బీజేపీ సమాచార విభాగం అధిపతి అమిత్ మాల్వియా నేతృత్వంలో ఇది జరిగటం గమనార్హం.

సబ్రినా సిద్దిఖీ డబ్ల్యూఎస్‌జేకు వైట్ హౌజ్ కరెస్పాండెంట్‌గా ఉన్నారు. ఇటీవల అమెరికాలో పర్యటించిన మోడీని భారత్‌లో మైనారిటీల వివక్ష గురించి సబ్రినా సిద్దిఖీ ప్రశ్నించారు. విదేశీ పర్యటనలో మోడీకి ఇలాంటి ఒక ప్రశ్న ఎదురవటం ఇదే మొదటిసారి. దీనిని జీర్ణం చేసుకోలేక వెంటనే సోషల్ మీడియాలో బీజేపీ, హిందూత్వ అనుకూల గ్రూపులు రంగంలోకి దిగాయి. ట్విట్టర్ ఖాతాలలో ఆమెకు వ్యతిరేకంగా పోస్టులు చేశాయి. ఆమెను 'పాకిస్థానీ ఇస్లామిస్టు'గా అభివర్ణించాయి. మోడీని అలాంటి ప్రశ్న అడగటంలో కుట్ర కోణం ఉన్నదని ఆరోపించాయి. "ఆమె భారత్‌ను మాత్రమే దాడి చేస్తుంది. ద్వేషించటం పాకిస్థానీల డీఎన్ఏ" అని మరొక ట్విట్టర్ హ్యాండిల్‌లో పోస్టు కనబడింది. ఇక బీజేపీ అనుకూల వెబ్‌సైట్లు కొన్ని మరొక అడుగు ముందుకేసి ఆమెపై ఆరోపణలను తీవ్రం చేశాయి. కల్పిత, ఊహాజనిత వార్తాకథనాలను ప్రచురించాయి. ఆమె పాకిస్థానీ తల్లిదండ్రుల కూతురు అని పేర్కొన్నాయి. ఇస్లామిస్టుల వాదనలను ఆమె ప్రతిధ్వనిస్తున్నదని ఆరోపించాయి.

ఆరోపణలను తిప్పికొట్టిన సబ్రినా

తనను టార్గెట్ చేసుకుంటూ ఆన్‌లైన్‌లో వస్తున్న ఆరోపణలు, విమర్శలకు సబ్రినా సిద్దిఖీ ట్విట్టర్‌లో స్పందించారు. భారత్‌లో జన్మించిన తన తండ్రితో కలిసి భారత క్రికెట్ జట్టును ఉత్సాహపరుస్తున్న ఒక ఫోటోను తన ట్విట్టర్ హ్యాండిల్‌లో ఆమె పోస్టు చేశారు. కొందరు తన వ్యక్తిగత నేపథ్యం గురించి మాట్లాడుతున్నారనీ, దీనిపై పూర్తి చిత్రాన్ని అందించటం సరైనదనిపిస్తున్నదని ఆమె రాసుకొచ్చారు. కొన్ని సార్లు గుర్తింపులు అనేవి కనబడేవాటి కంటే క్లిష్టమైనవని పేర్కొన్నారు.

కులం ఆధారంగా రాజకీయాలు చేయలేను

గోదావరి జిల్లాల నుంచే రాష్ట్ర రాజకీయాల్లో మార్పు మొదలు కావాలి : పవన్ కల్యాణ్






రాజోలు : వైసిపి ప్రభుత్వం ప్రజా సమస్యలను గాలికి వదిలేసి రౌడీలు, గుండాలను వెనకేసుకొస్తోందని జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ విమర్శించారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా మలికిపురంలో ఆదివారం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. తాను వారాహీ యాత్ర ద్వారా ప్రజల ముందు నిజాలను చెప్పే ప్రయత్నం చేస్తుంటే తనపై దాడికి ప్రయత్నాలు జరిగాయని అన్నారు. నేరగాళ్ల బెదిరింపులకు మంచివాళ్లు కూడా లొంగిపోతారని వ్యాఖ్యానించారు.

వైసిపిలో చేసినట్లు తాను కులం ఆధారంగా రాజకీయాలు చేయలేమని స్పష్టం చేశారు. వైసిపి పాలన నుంచి ఉమ్మడి గోదావరి జిల్లాలను విముక్తి చేయాలని కోరారు. ఉమ్మడి గోదావరి జిల్లాలోని 34 నియోజకవర్గాలపై జనసేన దృష్టి సారించిందని వెల్లడించారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో పి.గన్నవరంలో జనసేన జెండా ఎగురవేయాలని కోరారు. కులాలు, మతాలు, ప్రాంతాలకు అతీతంగా సామాన్యులకు అండగా ఉండాలనే లక్ష్యంతో కామన్ మ్యాన్ ప్రొటెక్షన్ ఫోర్స్ స్థాపించానని పేర్కొన్నారు. 2014లో జనసేన పార్టీని స్థాపించినప్పుడు తాను చెప్పిన మాటలను పవన్ ప్రస్తావించారు. 2019లో జనసేన పార్టీని రాజోలు నియోజకవర్గంలో గెలిపించి మార్పు కోసం చిరుదీపం వెలిగించారన్నారు. అది భవిష్యత్తులో రాష్ట్ర వ్యాప్తంగా అఖండ జ్యోతిగా మారి ప్రజలందరికీ వెలుగునిస్తుందని పేర్కొన్నారు.

జనసేన నుంచి గెలిచి వైసిపిలో చేరిన రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు పేరు ప్రస్తావించకుండానే పార్టీ నుంచి గెలిచిన ఏకైక ఎమ్మెల్యే స్వార్థ ప్రయోజనాల కోసం పార్టీని వదిలి వెళ్లిపోయారని విమర్శించారు. ఆయన వెళ్లిపోయినా పార్టీని వీడకుండా ప్రజలంతా అండగా ఉన్నారన్నారు. గోదావరి జిల్లాల నుంచే వైసిపిపై యుద్ధం మొదలవ్వాలని పవన్ కల్యాణ్ ఆకాంక్షించారు. పాలించే నాయకుడు నిజాయితీపరుడైతే ప్రజలకు న్యాయం జరుగుతుందని తెలిపారు. జనసేన పార్టీలో గ్రూపులు ఉండడం తప్పులేదని.. అందరూ జనసేన అభివృద్ధికి కృషి చేయాలే తప్ప గ్రూపులపోరు పార్టీకి ఓటమి చేకూర్చకూడదని పవన్ అన్నారు. అంతకు ముందు మలికిపురం మండలంలోని దిండి రిసార్ట్స్‌లో నియోజకవర్గ నేతలు, ముఖ్య కార్యకర్తలతో పవన్ కల్యాణ్ సమావేశమయ్యారు. నేరగాళ్లు రాజకీయాలు చేస్తే రాష్ట్రం నాశనం అవుతుందని తెలిపారు. ప్రజల హక్కులకు భంగం కలిగితే పోరాడతా.. ఎదురు తిరుగుతా అని హెచ్చరించారు.

ప్రధాని మోడీకి 'ఆర్డర్ ఆఫ్ ది నైల్' పురస్కారం



ఈజిప్టు : ఈజిప్టులో పర్యటిస్తున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి ఆ దేశ అత్యున్నత పురస్కారం 'ఆర్డర్ ఆఫ్ ది నైల్' లభించింది. ఈజిప్టు అధ్యక్షులు అబ్దెల్ ఫతా ఎల్-సిసి దీనిని అందజేసి సత్కరించారు. 1915లో ప్రారంభించిన ఈ పురస్కారాన్ని దేశంతోపాటు మానవాళికి విశేష సేవలందించే వివిధ దేశాల అధినేతలు, రాజులు, ఉపాధ్యక్షులకు అందిస్తున్నారు. తాజాగా మోడీకి ఈ పురస్కారం వరించింది. అంతర్జాతీయ స్థాయిలో ప్రధాని మోడీకి ఇది 13వ పురస్కారం.

పురాతన మసీదులో మోడీ

ఈజిప్టు పర్యటనలో భాగంగా ప్రధాని మోడీ అక్కడి ఓ పురాతన మసీదును సందర్శించారు. మతపెద్దలతో కలిసి అల్- హకీం- మసీదు మొత్తం కలియదిరిగిన ఆయన.. ప్రార్థనా మందిరం గోడలు, తలుపులపై చెక్కిన శాసనాలను పరిశీలించారు. 11వ శతాబ్దానికి చెందిన ఈ మసీదులో ఇటీవల చేపట్టిన పునరుద్ధరణ పనులను దావూదీ బోహ్రా వర్గానికి చెందిన మతపెద్దలు మోడీకి వివరించారు.

11వ శతాబ్దంలో కైరోలోనే అతిపెద్ద మసీదుల్లో ఈ 'అల్- హకీం- మసీదు' ఒకటిగా నిలిచింది. వెయ్యేళ్ల చరిత్ర కలిగిన ప్రఖ్యాత మసీదు 13,560 చదరపు మీటర్ల పరిధిలో విస్తరించింది. ఇందులో ప్రధాన ప్రార్థనా మందిరమే ఐదువేల చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఉంది. దీనిని ఫాతిమిద్‌కు (అరబ్ మూలాలున్న ఇస్మాయిలీ షియా వర్గం) చెందిన దావూదీ బోహ్రా వర్గం వారు ఇటీవల పునరుద్ధరించారు. ఈజిప్టుకు చెందిన ఈ దావూదీ బోహ్రాలు.. తొలుత యెమెన్, అక్కడ నుంచి భారత్‌కు వచ్చి స్థిరపడ్డారు. భారత్‌లో ఈ వర్గం జనాభా సుమారు 5 లక్షల వరకు ఉంటుంది.

అమెరికా, ఈజిప్టు పర్యటన పూర్తి

ప్రధాని నరేంద్ర మోడీ అమెరికా, ఈజిప్టుల పర్యటన ఆదివారంతో ముగిసింది. ఆదివారం ఆయన ఈజిప్టు నుంచి మనదేశానికి బయల్దేరారు. 'ఈజిప్టులో నా పర్యటన చారిత్రాత్మకమైనది. ఇది భారతదేశం-ఈజిప్టు సంబంధాలకు కొత్త శక్తిని జోడిస్తుంది. మన దేశ ప్రజలకు ప్రయోజనం చేకూరుస్తుంది. ఈజిప్టు అధ్యక్షుడు అబ్దెల్ ఫతా ఎల్-సిసి ప్రభుత్వం, ప్రజల ఆప్యాయతకు ధన్యవాదాలు' అని మోడీ ట్వీట్ చేశారు.

ఏపీలో సాంఘిక బహిష్కరణ అమానుషం

- తిరుమలాయపాలెం పెత్తందార్లపై కఠిన చర్యలు : వామపక్షాల డిమాండ్



అమరావతి : తూర్పుగోదావరి జిల్లా గోకవరం మండలం తిరుమలాయపాలెంలో దళితులపై పెత్తందారుల అరాచకాలను వామపక్ష పార్టీలు తీవ్రంగా ఖండించాయి. తిరుమలాయపాలెం ఘటనలపై రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని దళితులపై దాడికి పాల్పడిన పెత్తందారులను, వారికి కొమ్ము కాస్తున్న పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాయి. తొలగించిన ప్రాంతంలోనే అంబేద్కర్ విగ్రహాన్ని తిరిగి ఏర్పాటు చేయాలని కోరాయి. ఈ మేరకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణతోపాటు వై సాంబశివరావు (సిపిఐ(యంఎల్) న్యూడెమొక్రసి), జాస్తి కిషోర్‌బాబు (సిపిఐ(యంఎల్)), కాటం నాగభూషణం (యంసిపిఐ(యు)), యన్ మూర్తి (సిపిఐ(యంఎల్) లిబరేషన్), చిట్టిపాటి వెంకటేశ్వర్లు (సిపిఐ(యంఎల్) న్యూడెమొక్రసి), బిఎస్ అమర్‌నాథ్ (యస్‌యుసిఐ(సి)), పివి సుందరరామరాజు (ఫార్వర్డ్ బ్లాక్), జానకి రాములు (రివల్యూషనరీ సోషలిస్టు పార్టీ) ఆదివారం ఉమ్మడి ప్రకటన విడుదల చేశారు. తిరుమలాయపాలెంలోని ప్రభుత్వ స్థలంలో దళిత యువత అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసుకుంటే సహించలేని పెత్తందారులు విగ్రహాన్ని తొలగించడమే కాకుండా దళితులపై దాడులకు తెగబడ్డారని పేర్కొన్నారు. వారికి తిండి, నీరు, మందులు, కనీస అవసరాలు ఏవీ అందకుండా సాంఘిక బహిష్కరణ చేయడం అమానుషమని తెలిపారు. దళితులకు వస్తువులు ఏమైనా అమ్మితే జరిమానా విధిస్తామని దుకాణాలకు ఆదేశాలు జారీచేశారని పేర్కొన్నారు. నిత్యావసరాలు అందజేయడానికి వెళుతున్న దళిత సంఘాల కమిటీ వాహనాలను పోలీసులు అడ్డుకుని తిప్పి పంపడం సరైందికాదని పేర్కొన్నారు. చట్టప్రకారం శాంతిభద్రతలు కాపాడాల్సిన పోలీసులు కూడా దళిత యువకులపై దాడి చేయడం గర్హనీయమని పేర్కొన్నారు. పార్టీలకతీతంగా దళిత భరోసా యాత్ర చేస్తుంటే దాన్ని కూడా సహించలేక పోలీసులు అడ్డుకుని విచక్షణారహితంగా అరెస్టులు చేశారన్నారు. పోలీసుల అండతోనే పెత్తందారులు అడ్డూఅదుపు లేకుండా దళితులను వేధిస్తున్నారన్నారని తెలిపారు. గ్రామ బహిష్కరణ వార్తలు వస్తున్నా ఇప్పటి వరకూ ఎస్‌సి కమిషన్ జోక్యం చేసుకోకపోవడం తగదన్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం కూడా సహించలేని స్థితిలో ఉండడమంటే రాష్ట్రంలో కులవివక్ష ఎంత తీవ్రంగా వుందో అర్థమవుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణం జోక్యం చేసుకుని దళితులపై దాడులు, సాంఘిక బహిష్కరణను విధించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం దళితులకు అండగా నిలవాలని కోరారు.

ఏపీలో బిసిలకు రక్షణ లేదు

- గౌతు లచ్చన్న విగ్రహావిష్కరణలో సినీ నటుడు సుమన్



గుంటూరు : రాష్ట్రంలో బలహీన వర్గాలకు రక్షణ లేదని సినీ నటుడు సుమన్ అన్నారు. గుంటూరు జిల్లా పెదకాకానిలో ఆయన స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహాన్ని ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో సుమన్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో కులానికి ఒక పార్టీ ఉందని, బిసిలకు మాత్రం ఏ పార్టీ లేదని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో ఏ పార్టీ బిసిలకు అత్యధిక సీట్లు ఇస్తే ఆ పార్టీకి మద్దతు ఇవ్వాలని కోరారు. బిసిలకు ఎక్కువ సీట్లు ఇవ్వడం వల్లే కర్నాటకలో కాంగ్రెస్ గెలిచిందని తెలిపారు. బాపట్ల జిల్లా చెరుకుపల్లిలో పదవ తరగతి విద్యార్థిని కిరాతకంగా హత్య చేసినా ప్రభుత్వం నిందితులపై కఠిన చర్యలు తీసుకోలేదని, ఇందుకు ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకుంటుందని హెచ్చరించారు. తెలుగుదేశం పార్టీ నాయకురాలు గౌతు శిరీష మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరంలో ఎన్నో త్యాగాలను చేసిన మహోన్నత వ్యక్తి లచ్చన్న అని తెలిపారు. ఆయన జీవితం నేటి యువతకు ఆదర్శమని అన్నారు. సమాజంలో అట్టడుగు వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన కృషి అపారమని కొనియాడారు. ప్రముఖ న్యాయవాది కారంకి లక్ష్మీనారాయణ అధ్యక్షతన జరిగిన సభలో టిడిపి నాయకులు ఈడే మురళీ కృష్ణ, రాష్ట్ర గౌడ సంఘం ఎగ్జిక్యూటివ్ అధ్యక్షులు రామ్ గోపాల్ గౌడ్, గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షులు చలమోలు అశోక్ గౌడ్, రాష్ట్ర బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు కేసన శంకర్రావు పాల్గొన్నారు.

కుంజా బొజ్జి, సున్నం రాజయ్య స్ఫూర్తితో...
మోసకారి ప్రభుత్వాలను నిలదీయండి

పోలవరం పోరుకేక మహా పాదయాత్రలో
వి శ్రీనివాసరావు, కె ప్రభాకర్‌రెడ్డి, ఐ వెంకటేశ్వరరావు



రాజమహేంద్రవరం:
ఆదివాసీల హక్కుల పరిరక్షణ, సమస్యల పరిష్కారం కోసం పోరాడిన సిపిఎం ప్రజాప్రతినిధులు కుంజా బొజ్జి, సున్నం రాజయ్య స్ఫూర్తితో పోలవరం నిర్వాసితులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను నిలదీయాలని ఎపి రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, పిడిఎఫ్ ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. నిర్వాసితుల హక్కుల సాధనకు సిపిఎం చేపట్టిన పోలవరం పోరుకేక మహా పాదయాత్ర ఆరో రోజైన ఆదివారం విఆర్.పురం మండలంలోని పలు గ్రామాల్లో సాగింది. ఈ సందర్భంగా సోములగూడెం, అడవి వెంకన్నగూడెం, సున్నంవారి గూడెం, రేఖపల్లిలలో బహిరంగ సభలు జరిగాయి. ఈ సభలకు సిపిఎం మండల కార్యదర్శి సోయం చినబాబు అధ్యక్షత వహించారు. అడవి వెంకన్నగూడెం బహిరంగ సభలో ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టుకు పూర్తి స్థాయిలో నిధులు కేటాయించాల్సిన కేంద్ర ప్రభుత్వం తన బాధ్యత నుంచి తప్పుకుంటోందన్నారు. నిర్వాసితులకు పునరావాసం, పరిహారం కల్పించకుండా ప్రాజెక్టును ఎలా పూర్తి చేస్తారని ప్రశ్నించారు.

నిర్వాసితుల పోరాటానికి సంఘీభావ వరద

పోలవరం పోరుకేక మహా పాదయాత్రకు సంఘీభావ వరద వెల్లువెత్తుతోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. గతేడాది వరదలు ప్రతి ఇంటా విషాదాన్ని నింపాయన్నారు. ప్రతిపక్ష నేతగా వైఎస్ జగన్మోహన్ రెడ్డి 2019 ఎన్నికల ముందు పోలవరం నిర్వాసితులకు ఇచ్చిన ప్రతి హామీ ఇక్కడ వారికి గుర్తుందని తెలిపారు. పోలవరం నిర్వాసితుల నిధుల కోసం మోడీని నిలదీయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పోరాడితే తాము మద్దతుగా నిలుస్తామని తెలిపారు. పోలవరం నిర్వాసితుల పోరాటానికి అఖిలపక్ష పార్టీలు ఏకం కావాలన్నారు. ఇది కేవలం ఒక్క నియోజకవర్గ సమస్య అని నిర్లక్ష్యం వహిస్తే 175 నియోజకవర్గాల్లోనూ ఘోర పరాభవం తప్పదని హెచ్చరించారు. ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రజలు పోలవరం ప్రాజెక్టును ఎప్పుడు పూర్తి చేస్తారని ఎదురు చూస్తున్నారని తెలిపారు. పోలవరం నిర్వాసితులకు పునరావాసం, పరిహారం చెల్లించకుండా గోదాట్లో ముంచేసి, ఆ నీటిని ఆ ప్రాంతాలకు ఎలా తరలిస్తారని ప్రశ్నించారు. టిడిపి అధినేత చంద్రబాబు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పోలవరం నిర్వాసితుల సమస్యలపై లేఖలు పంపించేలా చూడాలని మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరికి వి.శ్రీనివాసరావు సూచించారు.

నిర్వాసితుల పోరాటానికి పిడిఎఫ్ సంపూర్ణ మద్దతు

పోలవరం నిర్వాసితుల పోరాటానికి పిడిఎఫ్ ఎమ్మెల్సీల సంపూర్ణ మద్దతు ఉంటుందని ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు తెలిపారు. అడవి వెంకన్నగూడెం, సున్నం వారి గూడెంలలో నిర్వహించిన బహిరంగ సభలలో ఆయన మాట్లాడారు. పోలవరం నిర్వాసితుల గురించి శాసనమండలిలో అనేకసార్లు ప్రభుత్వాన్ని ప్రశ్నించామన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టుకు నిధుల కేటాయింపులో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోందని తెలిపారు. అవకాశవాద రాజకీయ పార్టీలకు జనాగ్రహాన్ని తెలియజెప్పేందుకే పోలవరం పోరుకేక పాదయాత్ర మొదలైందన్నారు.

ఆదివాసీలను ముంచేసే హక్కు ఎవరిచ్చారు : ఎపి ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర

మూడు లక్షల మంది ఆదివాసీలను గోదావరిలో ముంచేసే హక్కు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఎవరిచ్చారని ఎపి ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర ప్రశ్నించారు. ఆదివాసీ చట్టాలను పోలవరం ప్రాజెక్టులో సమాధి చేయడం దారుణమన్నారు. మహా పాదయాత్రకు వస్తున్న మద్దతును చూసైనా రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించాలని కోరారు.

గోదాట్లో ముంచిన వైసిపి ప్రభుత్వానికి బుద్ధి చెప్పండి : మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి

పోలవరం నిర్వాసితులను గోదాట్లో ముంచిన వైసిపి ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని రంపచోడవరం మాజీ ఎమ్మెల్యే, టిడిపి నాయకులు వంతల రాజేశ్వరి కోరారు. సున్నంవారి గూడెంలో నిర్వహించిన సభలో ఆమె మాట్లాడారు. నిర్వాసితులకు పూర్తి పరిహారం చెల్లించాల్సిందేనని తేల్చి చెప్పారు. ముమ్ముందు ఈ సమస్యపై అఖిలపక్ష పార్టీలు కలిసి పనిచేయాల్సిన అవసరముందన్నారు. గత వరదలలో పోలవరం ముంపు గ్రామాల ప్రజలు పడిన ఇబ్బందులను ప్రత్యక్షంగా చూశానని తెలిపారు. వరద బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం కనీసం బరకాలు కూడా ఇవ్వలేదని, భోజనాలకు కూడా ప్రజలు ఇబ్బందులు పడ్డారని అన్నారు. 2019 ఎన్నికలకు ముందు వైసిపి ఇచ్చిన హామీలేవీ అమలుకు నోచుకోలేదని తెలిపారు. పోరుకేక మహా పాదయాత్రకు టిడిపి సంపూర్ణ మద్దతు తెలియజేస్తోందన్నారు.

పట్టిసీమ, పోలవరం విషయాల్లో తేడాలెందుకు? : సిపిఎం తెలంగాణ రాష్ట్ర నాయకులు యలమంచిలి రవికుమార్

పోలవరం తర్వాత పట్టిసీమ ప్రాజెక్టు ప్రారంభించి, ఆ ప్రాంతంలో నిర్వాసితులకు రూ.50 లక్షల చొప్పున పరిహారం ఇచ్చారని సిపిఎం తెలంగాణ రాష్ట్ర నాయకులు యలమంచిలి రవికుమార్ గుర్తు చేశారు. సున్నంవారిగూడెంలో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు పరిధిలోని ప్రాంతంలో పట్టిసీమ కంటే సారవంతమైన భూములు ఉన్నాయని, అయినప్పటికీ ప్రభుత్వం కేవలం నామమాత్రపు సాయాన్ని కొద్ది మందికి అందజేసి మొండిచేయి చూపుతోందని అన్నారు.

కాంటూరు లెక్కలన్నీ కాకి లెక్కలే : సిపిఎం తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి అరుణ్

కాంటూరు లెక్కలన్నీ కాకి లెక్కలేనని సిపిఎం గతంలోనే చెప్పిన విషయాన్ని ఆ పార్టీ తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి అరుణ్ గుర్తు చేశారు. సోములగూడెంలో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ కాంటూరు లెక్కలు తప్పుల తడక అనడానికి గతేడాది వచ్చిన వరదల వల్ల తలెత్తిన నష్టమే ప్రత్యక్ష తార్కాణమన్నారు. కాఫర్ డ్యాం ఏర్పాటుతో ప్రాజెక్టు పూర్తి కాకముందే విలీన మండలాలు పూర్తిగా ముంపునకు గురవుతున్నాయని తెలిపారు. ఇక ప్రాజెక్టు పూర్తయితే జనం జల సమాధేనని ఆందోళన వ్యక్తం చేశారు.

రెండు రైళ్ళు ఢీ

పట్టాలు తప్పిన 12 వ్యాగన్లు

- పశ్చిమబెంగాల్‌లో ప్రమాదం



బంకురా : పశ్చిమబెంగాల్‌లోని బంకురా జిల్లాలో ఆదివారం రైలు ప్రమాదం చోటుచేసుకుంది. అద్రా డివిజన్ పరిధిలోని ఓండా స్టేషన్‌కు సమీపంలో మెయింటెనెన్స్ రైలును గూడ్స్ రైలు ఢీకొంది. ఈ ఘటనతో 12కు పైగా వ్యాగన్లు పట్టాలు తప్పాయి. ప్రమాద తీవ్రతకు గూడ్స్ రైలు ఇంజిన్.. మరో రైలు వ్యాగన్ పైకి చేరింది. ఈ ఘటనతో ఆ మార్గంలో రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. రైల్వే సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని పునరుద్ధరణ చర్యలు చేపట్టారు. ఈ ప్రమాదంలో ఓ రైలు డ్రైవర్ స్వల్ప గాయాల పాలయ్యాడు. తెల్లవారుజామున 4.05 గంటల సమయంలో ఓండా స్టేషన్ వద్ద రైల్వే మెయింటెనెన్స్ రైలు (బిఆర్ఎన్) షంటింగ్ పని జరుగుతోంది. ఆ సమయంలో గూడ్స్ రైలుకు రెడ్ సిగ్నల్ పడిందని, కానీ ఆగకుండా ముందుకు వెళ్లిపోయిందని సమాచారం. ఆ తర్వాత బిఆర్ఎన్ మెయింటెనెన్స్ రైలును ఢీకొంది. ఉదయం 7 గంటల సమయానికి అప్ మెయిల్, అప్ లూప్ లైన్లను అధికారులు పునరుద్ధరించారు. ఈ విషయాన్ని ఆగ్నేయ రైల్వే సిపిఆర్ఓ వెల్లడించారు. ఈ ప్రమాదంపై రైల్వే అధికారులు మాట్లాడుతూ.. రెండు రైళ్లలో ఎటువంటి లోడూ లేదని చెప్పారు. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉందని పేర్కొన్నారు. ఈ ఘటన చోటుచేసుకున్న అద్రా డివిజన్.. పశ్చిమబెంగాల్‌లో నాలుగు జిల్లాలైన వెస్ట్ మిడ్నాపుర్, బంకురా, పురులియా, బృందావన్‌లో రైళ్ల రాకపోకలకు కీలకమైంది. ఝార్ఖండ్‌లోని ధన్‌బాద్, బొకారో, సింగభూమ్‌పై కూడా కొంత ప్రభావం పడుతుంది.

పలు రైళ్లు రద్దు.. మరికొన్ని దారిమళ్లింపు

ఈ ప్రమాదం నేపథ్యంలో 14 రైళ్లను ఆదివారం రద్దు చేసినట్లు ఆగ్నేయ రైల్వే ప్రకటించింది. మరికొన్నిటిని తాత్కాలికంగా రద్దు చేశామని, కొన్ని రైళ్లను దారి మళ్లించామని తెలిపింది. ఆ వివరాలను ట్విట్టర్ ద్వారా వెల్లడించింది.

ఎత్తు తగ్గితే సమస్యలే :ఐసీఎంఆర్



న్యూఢిల్లీ : ఎత్తు తక్కువగా ఉన్న పిల్లలకు పలు ఆరోగ్య సమస్యలు ఎదురవుతాయని భారత వైద్య పరిశోధనా మండలి (ఐసీఎంఆర్) ఒక నివేదికలో తెలిపింది. సాధారణంగా గ్రామీణ ప్రాంతాలలోని పిల్లలతో పోలిస్తే పట్టణ ప్రాంతాలలో ఉంటున్న చిన్నారులు పొడవుగా ఉంటారు. అయితే ఈ వెసులుబాటు ఇకపై వారికి ఎంతో కాలం ఉండకపోవచ్చు. 1990-2020 మధ్యకాలంలో 5-19 సంవత్సరాల మధ్య వయసున్న వారికి సంబంధించిన శరీర ద్రవ్యరాశి సూచిక (బీఎంఐ)పై ఐసీఎంఆర్ ఓ నివేదికను రూపొందించింది. ప్రపంచవ్యాపంగా పిల్లల ఆరోగ్యాన్ని ప్రభావితం చేసే అంశాలను ఈ నివేదిక అధ్యయనం చేసింది. దీని ప్రకారం పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో నివసిస్తున్న చిన్నారుల బీఎంఐలో వ్యత్యాసాలు తగ్గిపోతున్నాయి. అంటే పట్టణ ప్రాంతాలలో నివసిస్తున్న పిల్లలు పొందుతున్న ప్రయోజనాలు, వారి వృద్ధి తగ్గుతూ వస్తోంది. ఈ విషయాలను నేచర్ జర్నల్ పత్రిక తాజా సంచికలో ప్రచురించారు.

ఎత్తు తక్కువగా ఉన్నా, బీఎంఐ తక్కువగా ఉన్నా అనారోగ్యానికి గురికావచ్చునని, ప్రాణాలు పోయే ప్రమాదం కూడా ఉందని అధ్యయనం తెలిపింది. తక్కువ ఎత్తు ఉన్న వారు వివేకవంతులు కాలేరని, భవిష్యత్తులో విద్యలో వారి పనితీరు కూడా సరిగా ఉండదని వివరించింది. 5-19 సంవత్సరాల మధ్య వయసున్న వారిలో బీఎంఐ అధికంగా ఉంటే జీవితకాలం ఊబకాయంతో బాధపడే అవకాశం ఉందని, వారు సాధారణ వ్యాధులకు గురవుతారని పేర్కొంది.

పిల్లలలో శారీరక శ్రమ తగ్గుతోంది. దీంతో అనేక ఆరోగ్య సమస్యలు వస్తున్నాయి. పట్టణ ప్రాంతాల వారి కంటే గ్రామీణ ప్రాంతాల వారిలో బీఎంఐ పెరుగుతోంది. దీంతో రెండు ప్రాంతాలకూ చెందిన 5-19 సంవత్సరాల మధ్య వయసున్న వారిలో బీఎంఐ తేడా తగ్గుతోంది. పిల్లల అభివృద్ధి కోసం అవసరమైన విధానాలు, కార్యక్రమాలను అమలు చేయాల్సి ఉంది. పేదరికం, ద్రవ్యోల్బణం, పౌష్టికాహార లోపం, కోవిడ్ కారణంగా వచ్చిన మార్పులు, ఉక్రెయిన్ యుద్ధం వంటి పరిణామాలు అభివృద్ధికి ఆటంకాలుగా నిలిచాయి. పిల్లలు ఆరోగ్యంగా వృద్ధి చెందడానికి సైతం ఇవి ప్రతిబంధకాలుగా ఉన్నాయి' అని ఆ నివేదిక వివరించింది.

అరుణాచల గిరి ప్రదర్శనకు ప్రత్యేక బస్సు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

గురుపౌర్ణమి సందర్భంగా జులై 3వ తేదీ హైదరాబాద్ ఎమ్‌జీబీఎస్ నుంచి తమిళనాడులోని అరుణాచలం వరకు టీఎస్‌ఆర్టీసీ సూపర్ లగ్జరీ ప్రత్యేక బస్సును నడుపుతున్నట్టు ఆ సంస్థ చైర్మెన్ బాజిరెడ్డి గోవర్ధన్, మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనార్ తెలిపారు. ఈ మేరకు ఆదివారంనాడొక పత్రికా ప్రకటన విడుదల చేశారు. జులై 2న ఉదయం 6 గంటలకు హైదరాబాద్‌లోని ఎమ్‌జీబీఎస్ నుంచి బయలు దేరి, ఆంధ్రప్రదేశ్ కాణిపాకంలోని విఘ్నేశ్వరుని దర్శనానంతరం అదే రోజు రాత్రి 10 గంటలకు అరుణాచలం చేరుకుంటుంది. గిరి ప్రదర్శన పూర్తయిన తర్వాత జులై 3 మధ్యాహ్నం 3 గంటలకు వెల్లూరులోని గోల్డెన్ టెంపుల్‌కు వెళ్తుంది. అక్కడ దర్శనానంతరం బయల్దేరి, మరుసటి రోజు (జులై 4) ఉదయం 10 గంటలకు హైదరాబాద్‌కు చేరుకుంటారు. అరుణాచల గిరి ప్రదర్శనను టూర్ ప్యాకేజీ రూపంలో అందిస్తున్నట్టు తెలిపారు. దీనిలో ఒక్కొక్కరికి రూ.2,600 టిక్కెట్ ధరగా నిర్ణయించారు. అరుణాచల గిరి ప్రదర్శన చేయాలనుకునే భక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. టీఎస్‌ఆర్టీసీ అధికారిక వెబ్‌సైట్ ఙ్ఙ్ఙ.్‌జీశ్రీఱఅవ.ఱఅ లో ముందస్తు రిజర్వేషన్ చేసుకోవచ్చు. ఎంటీజీఎస్, జేబీఎస్, దిల్‌సుఖ్‌నగర్ బస్టాండ్లతో పాటు టీఎస్‌ఆర్టీసీ రిజర్వేషన్ కౌంటర్లలోనూ బుక్ చేసుకోవచ్చు. పూర్తి సమాచారం కోసం 99592 26257, 99592 24911 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

ఆ మూడింటిపై దృష్టి పెట్టాలి



విద్య, వైద్యం, మౌలిక సదుపాయాలు కల్పించాలి

- ప్రజల అవసరాలను తీర్చితేనే అభివృద్ధి: సామాజికవేత్తలు, నిపుణులు, విశ్లేషకుల సూచన



న్యూఢిల్లీ : దేశం అభివృద్ధి పథంలో దూసుకెళ్తున్నదనీ, దేశ ఆర్థిక వ్యవస్థ ప్రపంచ దేశాలతో పోల్చితే ఐదో స్థానానికి చేరుకున్నదని మోడీ సర్కారు ప్రచారాలు చేసుకుంటున్నది. మోడీ పాలనలో దేశ ఆర్థిక వ్యవస్థ చాలా బలంగా ఉన్నదని ఇటు బీజేపీ, దాని అనుకూల మీడియా, సోషల్ మీడియాలో ప్రచారాలు హోరెత్తుతున్నాయి. అయితే, ఇవేవీ దేశంలోని సామాన్య ప్రజలకు ప్రత్యక్షంగా ఊరటనందించవని నిపుణులు, విశ్లేషకులు అన్నారు. ప్రభుత్వం ద్వారా జరిగే ఏ పనైనా, అభివృద్ధి కార్యక్రమమైనా అది ప్రత్యక్షంగా సామాన్య పేద, మధ్య తరగతికి చేరినపుడే అది నిజమైన ప్రగతి కిందకు వస్తుందని చెప్పారు. విద్య, వైద్యం, మౌలిక సదుపాయాలు వంటివి ఇందులో కీలకమని అన్నారు. మోడీ సర్కారు మాత్రం కనీస ప్రాథమిక సౌకర్యాలలో ముఖ్యమైనవాటిలో భాగమైన ఈ మూడింటినీ నిర్లక్ష్యం చేస్తున్నదని ఆరోపించారు. ఈ మూడు అంశాల పైన దృష్టి సారించాల్సిన అవసరమున్నదని నొక్కి చెప్పారు. మోడీ తొమ్మిదేండ్ల పాలనలో ఇవి సాధారణ పౌరుడికి తగినవిధంగా అందలేదని చెప్పారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లోనూ పరిస్థితులు దారుణంగా ఉన్నాయన్నారు.

మోడీ నేతృత్వంలోని ప్రభుత్వం 2014లో కేంద్రంలో తొలిసారి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి విద్య, వైద్యం, మౌలిక సదుపాయాల కల్పన వంటివి ఆశించిన స్థాయిలో ప్రజలకు అందించలేదు. దీంతో దేశం విద్య, వైద్య రంగాల్లో క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్నదని విశ్లేషకులు తెలిపారు. మౌలిక సదుపాయాల లేమి ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నదని చెప్పారు.

విద్యకు ప్రయివేటు పోటు

విద్య వ్యవస్థలో ప్రయివేటు పాఠశాలలు ప్రతికూల ప్రభావాన్ని చూపుతున్నాయని విశ్లేషకులు, సామాజికవేత్తలు తెలిపారు. ప్రభుత్వాలు సర్కారు బడులపై దృష్టి సారించకపోవటంతో ప్రయివేటు పాఠశాలలను దానిని తమకు అనుకూలంగా మార్చుకొని విద్యను వ్యాపారంగా చేస్తున్నాయని చెప్పారు. ముఖ్యంగా దీని ప్రభావం సర్కారు బడుల మీద ఆధారపడే, ప్రయివేటు పాఠశాలల ఫీజులను భరించలేని ఎస్సీ, ఎస్టీ, బీసీ, పేద, మధ్య తరగతి ప్రజలపై పడుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితులను అధిగమించడానికి ఎస్సీ,ఎస్టీ అభివృద్ధి శాఖల వద్ద ఉన్న నిధులను ఉపయోగించుకోవాలని సూచించారు. ముఖ్యంగా, గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులకు ఉచితంగా యూనిఫామ్, పుస్తకాలు, అవసరమైన వస్తువులు సక్రమంగా అందేలా చూడాలన్నారు. ప్రస్తుత ఆధునిక కాలంలో ఇంటర్నెట్ వసతిని గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలలకు అందేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయంలో కేరళ ప్రభుత్వాన్ని చూసి నేర్చుకోవాలన్నారు.

ఆరోగ్య సేవలు పేలవం

దేశంలో ఆరోగ్యసేవలు కూడా పేలవంగానే ఉన్నాయి. ఉప్పెనలా వచ్చిన కరోనా వంటి విపత్కర పరిస్థితులు ఆరోగ్య రంగంలో భారత్ ఎంత వెనుకబడి ఉన్నదో చెప్పిందని ఆరోగ్య నిపుణులు, సామాజికవేత్తలు, ప్రజా సంఘాల నాయకులు తెలిపారు. ఆక్సిజన్ ప్లాంట్లు, సరిపడా బెడ్లు లేకపోవడం, సిబ్బంది కొరత, మౌలిక సదుపాయాల లేమి.. ఇలా ఆరోగ్య రంగంలోని ప్రతి అంశములోనూ భారత వైఫల్యం బయటపడిందని చెప్పారు. ఈ రంగానికి కూడా విద్యా రంగం ఎదుర్కొంటున్నట్టుగానే 'ప్రయివేటు' భారం పడిందని తెలిపారు.

సాధారణంగా కింది స్థాయి నుంచి ఆరోగ్య సేవ అనేది ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (ప్రతి 3వేల మందికి) నుంచి ప్రారంభమవుతుందనీ, వైద్యుడు అందుబాటులో ఉండాలని చెప్పారు. దేశంలోని వేలాది గ్రామాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు నిష్క్రియాత్మకంగా ఉన్నాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఆశా వర్కర్లు, నర్సులు, ఆరోగ్య సిబ్బంది కొరత కూడా చాలానే ఉన్నదన్నారు. ప్రభుత్వాలు బడ్జెట్‌లో కేటాయింపులు పెంచి ప్రజారోగ్యాన్ని కాపాడాలని నిపుణులు, విశ్లేషకులు కోరారు.

రోడ్లు అధ్వాన్నమే

దేశవ్యాప్తంగా అనేక ప్రాంతాలలో రోడ్ల వ్యవస్థ ఇప్పటికీ అధ్వాన్నంగానే ఉన్నదని చెప్పారు. విద్య వైద్యం.. ఈ రెండు అంశాలు రోడ్లతో ప్రత్యక్షంగానో, పరోక్షంగానే ముడిపడి ఉంటాయనీ, చక్కని రోడ్లు అభివృద్ధికి సంకేతాలని తెలిపారు. కానీ క్షేత్రస్థాయిలో మాత్రం రోడ్ల వ్యవస్థ ప్రభుత్వాలు చేసుకుంటున్నప్రచారాలకు విరుద్ధంగా ఉన్నాయని విశ్లేషకులు తెలిపారు. తమ పాలనలో రోడ్ల అభివృద్ధి అధికంగా జరిగిందని మోడీ ప్రభుత్వం చేసుకుంటున్న ప్రచారాలు సత్య దూరమని చెప్పారు. పల్లె, పట్టణ ప్రాంతాల్లో చక్కటి రోడ్లపై ప్రభుత్వాలు దృష్టి సారించి ప్రజావసరాలను తీర్చాలని వారు సూచించారు.

అసోంలో భారీ వరదలు

- **9 జిల్లాల్లో 4 లక్షల మంది నిరాశ్రయులు**

దీస్‌పూర్ : అసోంలో భారీ వరదలు వల్ల జనజీవనం అస్తవ్యస్తమైంది. తొమ్మిది జిల్లాల్లో నాలుగు లక్షల మందికి పైగా ప్రజలు నిరాశ్రయులయ్యారు. వరద నీరు మెల్లగా తగ్గుముఖం పడుతోంది. పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తున్నట్లు అసోం స్టేట్ ఎమర్జెన్సీ మేనేజ్‌మెంట్ అథారిటీ (ఎఎస్‌డిఎంఎ) అధికారులు తెలిపారు. పలు బృందాలు సహాయక చర్యల్లో నిమగ్నమయ్యాయి. ప్రజలను కూడా సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఇప్పటి వరకు ముగ్గురు మృతి చెందినట్లు అధికారులు తెలిపారు.

ఎస్‌డిఎంఎ నివేదిక ప్రకారం.. బక్సా, ఉదల్‌గురి, నల్‌బారి, లఖింపూర్, కమ్రూప్, గోల్‌పరా, ధుబ్రి, దర్రాంగ్, బార్‌పేట జిల్లాలకు చెందిన నాలుగు లక్షల మందికి పైగా ప్రజలు ప్రభావితులయ్యారు. ప్రజల సహాయార్థం 101 శిబిరాలు నిర్వహిస్తున్నారు. 81 వేలమందికి పైగా ఇక్కడ ఆశ్రయం పొందారు. ఐదు జిల్లాల్లో 119 సహాయ పంపిణీ కేంద్రాలు కూడా నడుస్తున్నాయి. 1,118 గ్రామాలు పూర్తిగా మునిగిపోయాయి. వరదల కారణంగా రైతుల పంటలు నాశనమయ్యాయి. 8,469.56 హెక్టార్ల భూమి పూర్తిగా నీట మునిగింది.

కరీంగంజ్‌లోని కొన్ని ప్రాంతాల్లో వర్షం కారణంగా కొండచరియలు విరిగిపడ్డాయి. తొమ్మిది జిల్లాల్లో రోడ్లు, వంతెనలు, ఇతర మౌలిక సదుపాయాలు దెబ్బతిన్నాయంటే వరద బీభత్సాన్ని ఊహించవచ్చు. అసోం సిఎం హిమంత బిస్వా శర్మకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఫోన్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా కేంద్రం నుంచి అన్ని విధాలా సాయం అందిస్తామని హామీ ఇచ్చారు.

62 ఏండ్ల తర్వాత తొలిసారి

- **ఢిల్లీ, ముంబైకు ఒకేసారి రుతుపవనాలు**

న్యూఢిల్లీ : నైరుతి రుతుపవనాలు ఢిల్లీ, ముంబై నగరాలకు చేరాయి. రుతుపవనాల రాకతో రెండు నగరాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఆయా నగరాలను నైరుతి రుతుపవనాలు తాకడంతో రెండు చోట్లా ఒకేసారి వర్షాలు కురవడం 62 ఏండ్లలో ఇదే తొలిసారి. ఇలాంటి అరుదైన సంఘటన చివరిసారిగా జూన్ 21, 1961న ఢిల్లీ, ముంబైల మీదుగా ఒకేసారి రుతుపవనాలు ప్రవేశించినప్పుడు జరిగిందని వాతావరణ కార్యాలయం తెలిపింది. రెండు నగరాలు ఒకదానికొకటి 1,430 కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి. రుతుపవనాలు సాధారణంగా జూన్ 27న ఢిల్లీని తాకగా, ఈ ఏడాది షెడ్యూల్ కంటే రెండు రోజులు ముందుగానే వచ్చాయి. మరోవైపు ముంబైకు రుతుపవనాలు వచ్చే తేదీ జూన్ 11. అయితే ఈ సారి రెండు వారాలు ఆలస్యంగా నగరంలోకి ప్రవేశించాయని భారత వాతావరణ విభాగం తెలిపింది.

ఢిల్లీలో వాతావరణ సూచన

ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం ఆదివారం ఉదయం కురిసింది. ఉదయం 5:30 గంటల వరకు, నగరంలోని ప్రాథమిక వాతావరణ కేంద్రమైన సఫ్దర్‌జంగ్‌లో 47.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. నైరుతి ఢిల్లీలోని పాలంలో 22 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఐఎండి డేటా ప్రకారం.. రుతుపవనాలు గతేడాది జూన్ 30న, 2021లో జులై 13న, 2020లో జూన్ 25న, 2019లో జులై 5న, 2018లో జూన్ 28న ఢిల్లీని ఆవరించాయి. ఆదివారం (జూన్ 25), సోమవారం (జూన్ 26) ఆరెంజ్ అలర్ట్ జారీ చేయబడింది. బుధవారం (జూన్ 27), గురువారం (జూన్ 28) ఎల్లో అలర్ట్ జారీ చేయబడింది.

ముంబైలో వాతావరణ సూచన

రెండు వారాల ఆలస్యం తర్వాత రుతుపవనాలు ముంబైకు చేరుకున్నాయి. సాధారణంగా జూన్ 11న రుతుపవనాలు చేరాల్సి ఉంది. నగరంలో ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. పలుచోట్ల నీటి ఎద్దడి ఉన్నట్టు సమాచారం. ముంబైకి ఎల్లో అలర్ట్ ప్రకటించారు.

12 మంది మిలిటెంట్ల విడుదల

మహిళలు చుట్టుముట్టడంతో డిచిపెట్టిన సైన్యం

- **హోం మంత్రితో సీఎం భేటీ**
- **30 వరకూ ఇంటర్నెట్ నిలిపివేత**

ఇంఫాల్ : మణిపూర్‌లోని ఇతం గ్రామంలో 1,200 మందికి పైగా మహిళలు చుట్టుముట్టడంతో సైన్యం ఆదివారం 12 మంది మిలిటెంట్లను విడుదల చేసింది. ఇంఫాల్ ఈస్ట్‌లోని ఇథమ్‌లో మిలిటెంట్లు దాక్కున్నారనే సమాచారంతో సైనికులు గ్రామాన్ని చుట్టుముట్టారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు మహిళల ఆధ్వర్యాన సుమారు 1200 నుంచి 1500 మంది ఆర్మీ వాహనాలను చుట్టుముట్టి, వాహనాలు ముందుకెళ్లకుండా అడ్డుకున్నారు. కొన్ని గంటలపాటు ఉద్రిక్తత కొనసాగడంతో 12 మంది మిలిటెంట్లను వదిలేయాలని అధికారులు నిర్ణయించారు. దీంతో, ఆందోళన విరమించారు. అనంతరం గ్రామంలో పెద్దసంఖ్యలో ఆయుధాలు, మందుగుండు సామగ్రిని సైనికులు స్వాధీనం చేసుకున్నారు. గ్రామస్తుల ఆందోళన నేపథ్యంలో మొయితీ వర్గానికి చెందిన మొయిరంగథెం తంబాసహా మిలిటెంట్ గ్రూప్ కంగ్లీ యావోల్ కన్నా లుప్ సభ్యులు తప్పించుకున్నారు.

మణిపూర్ సీఎం ఎన్.బీరేన్‌సింగ్ ఆదివారం హోం మంత్రి అమిత్‌షాను ఆదివారం కలిశారు. ఈ విషయాన్ని బీరేన్‌సింగ్ ట్వీట్ చేశారు. 'అమిత్‌షా పర్యవేక్షణలో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు గత వారంలో చాలావరకూ హింసను నియంత్రించగలిగాయి. ఈ నెల 13 నుంచి హింసాత్మక ఘటనల వల్ల ఎటువంటి ప్రాణనష్టం జరిగినట్లు సమాచారం లేదు' అని సీఎం తన ట్వీట్‌లో పేర్కొన్నారు. ఇదిలావుండగా, రాష్ట్రంలో ఇంటర్నెట్‌పై నిషేధం ఈ నెల 30 వరకూ కొనసాగుతుందని మణిపూర్ ప్రభుత్వం ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొంది.

ఎమర్జెన్సీ.. రాజ్యాంగ విలువలకు పూర్తి వ్యతిరేకం : ప్రధాని మోడీ

న్యూఢిల్లీ : భారతదేశ చరిత్రలో 21 నెలల కాలంలో మరిచిపోలేని కాలమని, ఇది రాజ్యాంగ విలువలకు పూర్తిగా వ్యతిరేకమని ప్రధాని మోడీ పేర్కొన్నారు. 1975, జూన్ 25న మాజీ ప్రధాని ఇందిరాగాంధీ భారత్‌లో ఎమర్జెన్సీ విధించిన సంగతి తెలిసిందే. ఎమర్జెన్సీ 48వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం ప్రధాని మోడీ పై విధంగా ట్వీట్ చేశారు.

"ఎమర్జెన్సీని ఎదిరించి, మన ప్రజాస్వామ్య స్ఫూర్తిని పటిష్టం చేసేందుకు కృషి చేసిన ధైర్యవంతులందరికీ నేను నివాళులర్పిస్తున్నాను. మన చరిత్రలో ఒక మరపురాని కాలంగా మిగిలిపోయింది, మన రాజ్యాంగం జరుపుతున్న విలువలకు పూర్తి విరుద్ధంగా ఉంది" అని ప్రధాని ఆరోపించారు. బీజేపీ కూడా ఇందిరాగాంధీ ఫోటోతో "భారత ప్రజాస్వామ్యంలో చీకటి అధ్యాయం" అని పోస్టర్‌ని ట్వీట్ చేసింది. నిరంకుశ పాలకులు ప్రకటించిన ఎమర్జెన్సీ ప్రజాస్వామ్యం, మానవ హక్కులను దెబ్బతీశాయని, ఇది ఒక నిర్దిష్ట కుటుంబం, రాజకీయ పార్టీ అహంకారం, అధికారాన్ని అంటిపెట్టుకోవాలనే కోరిక అంటూ మరో కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరీ ట్వీట్ చేశారు. కేంద్రమంత్రులు రాజ్‌నాథ్ సింగ్, కిరణ్ రిజిజు, ప్రహ్లాద్ జోషి, నితిన్ గడ్కరీలు కూడా ట్వీట్లు చేశారు.

సాంకేతిక విద్యకు ప్రపంచబ్యాంక్ రుణం

న్యూఢిల్లీ : భారత్‌లో సాంకేతిక విద్యా ప్రమాణాలను మెరుగుపరచేందుకు, విద్యార్థులకు అందుబాటులో ఉన్న ఉద్యోగాల సంఖ్యను పెంచేందుకు 255.5 మిలియన్ డాలర్ల రుణాన్ని అందించేందుకు ప్రపంచబ్యాంక్ అంగీకరించింది. రాబోయే ఐదు సంవత్సరాలలో ప్రభుత్వ సాంకేతిక విద్యా సంస్థలలో చదువుకునే మూడున్నర లక్షల మంది విద్యార్థులు దీనివల్ల ప్రయోజనం పొందుతారని ప్రపంచబ్యాంక్ తెలిపింది. భారత్‌లో 2011-12లో 40 వేల కళాశాలల్లో 2.9 కోట్ల మంది చదువుకుంటే 2019-20లో 40 వేల యూనివర్సిటీలలో 3.9 కోట్ల మంది విద్యను అభ్యసించారు. అయితే సాంకేతిక, సాంకేతికేతర విద్యల విషయంలో కొంత వ్యత్యాసం కన్పిస్తోంది. సాంకేతిక విద్యా ప్రాజెక్టులలో పరిశోధనలను మరింత మెరుగుపరిస్తే విద్యార్థుల నైపుణ్యం పెరుగుతుందని, వారు తగిన ఉద్యోగాలు పొందగలుగుతారని ప్రపంచబ్యాంక్ తెలిపింది.

ప్రాజెక్టులలో భాగంగా విద్యార్థుల పాఠ్యాంశాలను ఎప్పటికప్పుడు నవీకరిస్తారని, మెరుగైన ఇంటర్న్‌షిప్, నియామకాల ద్వారా విద్యార్థులు ప్రయోజనాలు పొందుతారని ప్రపంచబ్యాంక్ వివరించింది. భారత ప్రభుత్వ జాతీయ విద్యా విధానానికి ప్రాజెక్టులు బాసటగా నిలుస్తాయని ప్రపంచబ్యాంక్ భారత డైరెక్టర్ అగస్టే టానో కవామే చెప్పారు.